సంపుటి: 30
సంచిక: 4

ఫోన్ నెం
64843

Kattukolu Subba Reddy
Home Library Pedaogirala.

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 49 రూపాయలు.
జీవిత చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 325 రూపాయలు.

మే, 1980

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్ :
మిస్. మంజుల

సీనియర్ ఎడిటర్స్ :
వి. ఎస్. చెన్నూరి
వాసవదత్త
సుజనశ్రీ
ఏ. వి. మోహన్రావ్
విద్వాన్ షీలాదేవి

మీ ఉత్తరాలు

సప్లిమెంట్ నవలల్లో వసుంధర, వాణిశ్రీగారల రచనలు అద్భుతంగా వున్నై. సికిందర్‌గారి 'తిరుగులేని సాక్ష్యం' కథ సైంటిఫిక్‌గా చాలా గొప్పగా వుంది. 'సీక్రెట్ గ్యాంగ్' సీరియల్ క్లైమాక్స్‌లో కరెంట్ ఫెయిలయిన ఫీలింగ్ కలుగజేసింది.

—కాసారపు సంజీవ్, హైద్రాబాదు.

ఈ నెల అపరాధ కథలన్నీ వెరైటీగా వున్నాయి. మల్లాది వెంకటకృష్ణమూర్తిగారి 'దొంగల పాఠశాల'లో రెండు కిలోల గ్యాస్ సిలిండర్‌ను ఏర్‌బ్యాగ్‌లో తీసుకుపోవడం అసాధ్యం. ఏది ఏమైనా కథలో నూతనత్వం వుంది. ,వసుంధరగారి 'మోసగాడు' మమ్మల్ని నవ్వించాడు. జోక్స్ పెంచండి.

—దుక్కిపాటి నాగమణి, నెల్లూరు.

ఈ నెల కథల్లో 'దొంగల పాఠశాల', 'విరోధి వ్యూహం', నవలల్లో 'తోడుదొంగలు' చాలా బాగున్నాయి. 'పొగమంచు' సీరియల్‌కు మరికొన్ని పేజీలు కేటాయిస్తే బాగుంటుంది. మంచి కార్టూన్స్ అందిస్తున్నందుకు మీకు నా థాంక్స్.

—ఎస్.ఎన్. రావ్, గన్నవరం.

అరేబియా బానిసలు, కొత్త ఖైదీ, నల్లపూసలు కథలు మంచి థ్రిల్లింగ్‌గా వున్నాయి. నవలల్లో ఫారిన్ సెంట్, కంబళి కప్పిన శవం అద్భుతం! మీ తీర్పు ఏమిటి, పాఠకుల పరిశోధన పోటీలు మా మేధస్సును పెంచుతున్నాయి. అపరాధ ఎప్పటికీ ఇలాగే నిత్య నూతనంగా వెలుగొందాలని మనసారా కోరుతూ—

—డి. వైజయంతి, మైసూరు.

అపరాధ పరిశోధనను విడువకుండా చదువుతున్న పాఠకుల్లో నేనొకడ్ని. ముఖ్యంగా సప్లిమెంట్‌లో వేస్తున్న నవలలు సృజనాత్మకంగా వుంటున్నాయి. చక్కని క్రైమ్, సెంటిమెంట్లతో మమ్మల్ని బాగా ఆకర్షిస్తున్నాయి.

—జె. రామకృష్ణారావు, విశాఖపట్టణం-1.

ఈ నెలలో...

కథలు (మాసపత్రిక)

4. నగ్న చిత్రాలు—ఎమ్. వి. వి. సత్యనారాయణ.
39. క్రైం రివాల్వర్—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
50. మూడేళ్ళనాటి హత్య—ఏ. వీ. మోహన్రావ్.
64. వెల్లుల్లి వాసన—వసుంధర.
81. మారువేషం మర్మం—ప్రతాప రవిశంకర్.
103. ఫస్ట్ నైట్— వాణిశ్రీ.
122. బీచ్‌లో శవం—బొమ్మిడి అచ్చారావు.
133. నిప్పులేని పొగ—వి. లక్ష్మీదేవి.
151. నిశ్శబ్ద నేరం—మల్లాది వెంకటకృష్ణమూర్తి.
161. అనామకుడి హత్య—ప్రతాప రవిశంకర్
179. సీక్రెట్ గ్యాంగ్ (సీరియల్)—'సికిందర్'

నవలలు (సప్లిమెంట్)

3. ఆమె ఎవరు—వాణిశ్రీ.
46. మరణ శిక్ష—వసుంధర.
90. గోవా యాత్ర—'సికిందర్'.
140. చేతిలో కత్తి—మెడలో త్రాచు—ప్రతాప రవిశంకర్.
177. పొగమంచు (సీరియల్)—ముద్దా సురేష్.

ఇవిగాక—క్రైమ్‌లో తమాషాలు, రచయితలతో ముఖాముఖి, ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, మీ తీర్పు ఏమిటి, అపరాధ పరిశోధన పోటీ, పాఠకుల పరిశోధన పోటీ, జోక్స్, కార్టూన్లు మరెన్నో ఆకర్షణలు!!!

నగ్న చిత్రాలు

ఎమ్.వి.వి. సత్యనారాయణ

విశాలమైన భవంతి. చుట్టూ ఎత్తయిన ప్రహరీగోడ. గోడకి ఒకప్రక్క ఆర్చి ఆకారంలో గేటు, ఇనుప చువ్వల తలుపులు. భవంతివరకూ నున్నటి సిమెంటుచప్టా. చప్టాకి రెండుపక్కలా క్రోటన్ మొక్కలూ, కత్తిరించిన గడ్డీ....

"రాజాంతఃపురంలాగా వుంది" గొణుక్కున్నాడు విలి

యమ్స్.

గేటువద్ద వున్న గూర్ఖా విలియమ్స్‌ను లోపలికి ప్రవేశ పెట్టాడు. విలియమ్స్ పరిసరాలను నేత్రపర్వంగా చూస్తూ, రెటీనామీద పడే కమనీయ దృశ్యాలకు రంగుల నగిషీలు అద్దుతూ భవంతిలోకి అడుగుపెట్టాడు.

"రండి, అయ్యగారు మీ కోసం చూస్తున్నారు," దారి చూపించాడు, అరవై ఏళ్ల పైబడిన వృద్ధుడు. అతడు విలియమ్స్‌ను ఆశ్చర్యంగా చూడసాగాడు.

ఆరడుగుల మూడంగుళాల యెత్తులో పల్చగా వున్న గోధుమరంగు విగ్రహం విలియమ్స్‌ది. మోకాళ్లు దాటే టట్టున్న చేతులూ, వాటికి పొడవుపాటి వేళ్లూ, మొహంలో ఆకర్షణా, వెడల్పాటి నుదురూ, కోటేరుముక్కూ, బిగువుగావున్న ముతకపాంటూ, పల్చటి కమీజూ, సంస్కార హీనమైన జుత్తూ.

తనలో తాను లెక్కలు వేసుకుంటూ విలియమ్స్ గది లోకి అడుగుపెట్టాడు.

అది డ్రాయింగ్ రూం. గదిలో లినోలియం పరచబడి వుంది. గదిమధ్యగా ఖరీదయిన సోఫాలు, మధ్యలో నల్లగా నిగనిగలాడుతోన్న రోజ్‌వుడ్ టీపాయ్ దానిమీద అదే రంగులోవున్న యాష్‌ట్రే.

"రండి మిస్టర్ విలియమ్స్, కూర్చోండి" సోఫాలో విలాసంగా కూర్చునివున్న రాజభూషణంగారు చేత్తో సున్నితంగా సోఫా చూపించారు.

విలియమ్స్ తల పంకించి ఆయనకి యెదురుగా వున్న సోఫాలో కూర్చున్నాడు. విలియమ్స్ చూపు చిలకపచ్చ రంగు పెయింటు చేయబడిన గోడలమీదకు మళ్లింది. గోడ లకు విలువయిన తైలవర్ణ చిత్రాలు వెలుగుపడి షేడ్స్

సృష్టిస్తున్నాయి.

"మంచి కలెక్షన్!" అన్నాడు విలియమ్స్.

రాజభూషణంగారు గర్వంగా చూసారు.

"ఇంతేనా? ఇవి కేవలం ప్రకృతి దృశ్యాలు! చారిత్రాత్మక ఘట్టాలు. నా ఆంతరంగికమైన కలక్షన్ వేరేవుంది" అన్నాడు.

"అంటే!"

"చూస్తారుగదా! తొందర దేనికి?"

"నన్ను ఎందుకు పిలిపించారో తెలుసుకోవాలని వుంది"

"మిస్టర్ విలియమ్స్! మీరు మంచి చిత్రకారులని తెలిసింది. మీ ఆయిలు పెయింటిగ్స్‌ను యెగ్జిబిషన్‌లో చూసాను. అయినా మీ విద్యకు తగిన ప్రోత్సాహం లేదు."

"యూ మీన్!"

"ఆర్థికంగా మీకేమీ రాల్చబడంలేదు మీ కళ! మీకు అంగీకారమైతే నావద్ద ఈరోజే చిత్రకారుడిగా వుద్యోగంలో చేరండి. నెలకు వేయి రూపాయలిస్తాను. మీకు ఎప్పుడు ఇష్టం లేకపోతే అప్పుడే యెలాంటి షరతూ లేకుండా మానుకోవచ్చును."

"నేనేం చేయాలి?"

"నాకు కావలసిన రీతిలో చిత్రాలు గీయాలి."

విలియమ్స్ ఆశ్చర్యంగా చూసాడు.

"మీకు అంగీకారమేనా?"

"నేను గీయగలను అని మీరు నమ్మకంగా చెప్పడానికి మీకున్న ఆధారం ఏమిటి?"

రాజభూషణంగారు నవ్వాడు.

"మీపాటి కళవున్న చిత్రకారుడు యెవరయినా నా దగ్గర వుద్యోగం చేయగలరు. అయితే కళాకారుడు తన

కళకి పరిధి నిర్ణయించుకొని వుండకూడదు. అంతే!"

"నెలకి ఎన్ని పెయింటింగులు వేయవలసివుంటుంది?"

రాజభూషణంగారు పెళ్లున నవ్వి, "చెప్పడం మరిచాను. కళాకారుడికి ఉద్యోగం ఇవ్వబోయేవాడు తాత్కాలికంగానయినా దోపిడీ మనస్తత్వం మరచిపోవాలి. వెయ్యిరూపాయల భాగ్యానికి యెంత కళను పిండగలను అని నాకు లెక్క వేయడం రాదు. మీకు తగిన ప్రేరణ దొరికితే ఒక నెల్లో చిత్రం ముగించవచ్చును. లేదా కొన్ని నెలలో సంవత్సరాలో స్తబ్దతలో మునిగిపోవచ్చును. అప్పుడు మీరు వేయలేక పోయారని తప్పు పట్టి ఏం లాభం?"

విలియమ్స్ ఆయన మనస్తత్వాన్ని అంచనా కట్టడానికి విఫల ప్రయత్నం చేసాడు. తనవైపు నుండి చూస్తే తనకే లాభం ఈ ఒప్పందం! కొన్ని నెలలయినా నెలకి వెయ్యిరూపాయలు తనమీద ఖర్చుపెట్టడానికి రాజభూషణం సిద్ధపడుతున్నాడు. చాల పెద్దమనిషి తరహాగా వుంది ఆయన వ్యవహారం. ఇంతకీ తను చిత్రించవలసిన చిత్రాలు ఏమిటో? ఎలాంటివో!

రాజభూషణంగారు అతడి వూహని పసిగట్టినట్టు "మిస్టర్ విలియమ్స్! నా కూడా రండి" అంటూ లేచి నిలబడ్డాడు.

విలియమ్స్ కూడా లేచి నిలబడి బయలుదేరడానికి సిద్ధపడ్డాడు.

రాజభూషణంగారు గుమ్మాలకి వున్న తెరలు తొలగించుకుని లోపలిగదిలోకి వెళ్లాడు. విలియమ్స్ ఆయనను వెంబడించాడు. రాజభూషణంగారు మూడుగదులు దాటి చిన్న సందులో అడుగుపెట్టాడు.

మెట్లకింద చిన్నగది.

రాజభూషణంగారు తలవొంచి జేబులోంచి తాళాలగుత్తి

తీసి తాళం తెరవసాగాడు.

విలియమ్స్ చుట్టూ ఆశ్చర్యంగా చూడసాగాడు.

"రండి మిస్టర్ విలియమ్స్. నా ఆంతరంగికమైన గది. ఈ ఆస్తిని ఎవరికీ పంచను. తెలుసా?" పెళ్ళున నవ్వుతున్నాడు రాజభూషణంగారు.

2

రోజీ నిప్పులు కక్కుతూ చూచింది.

"డబ్బు చూచేటప్పటికి నీకు మతిపోయినట్టుంది. లేక పోతే ఏమిటిది? ఇంగ్లండునుండి నీ వెంబడి వచ్చినందుకు నన్ను గుడ్డలిప్పి బజార్లో పెడతావా? నిన్ను మనసారా కోరివచ్చిన ఆడదానికి నువ్విచ్చే గౌరవం ఇదా?"

రోజీకి కోపంతో నిలువెల్లా కంపిస్తోంది. పల్చటి పెదాలు అదురుతున్నాయి. బంగారు రంగు ముక్కు చివర ఎర్రటి రంగును పులుముకున్నది. కోపంతో చెదిరిన ముంగురులు రాగి రంగులో వెలుతురుపడి తళతళలాడుతూ గాలికి ఎగురుతున్నాయి.

"దీంట్లో తప్పు ఏముంది? నాలో వున్న కళాకారుడికి ఆంగ్లో యిండియన్ అయినా నీగ్రో అయినా ఒకే రకంగా కనిపిస్తారు. వారిలోవున్న విభిన్నమైన సౌందర్యం చిత్రపటంమీద కుంచెలతో అద్దంపడతాను. నీ స్థానంలో నా చెల్లెలువున్నా అంతే! బొమ్మ చిత్రించేటప్పుడు నాలో ఏ వికారమూ వుండదు. అంతే! నన్ను నమ్మితే నా మాటకి ఒప్పుకో!" అన్నాడు విలియమ్స్.

"నీకు వికారం వుండదు సరే! నీచేత నా నగ్నచిత్రం వేయించుకున్నవాడికి వికారం కలిగించదా?"

"వాడికి కలిగితే నాదా తప్పు?"

"ఎవరిది?"

"వాడి మానసిక వికారం! మనం ఏం చేస్తాం?"

"వాడికి వికారం కలిగించే నీ బొమ్మది కాదా తప్పు?"

"రోజీ! ఈ రకమైన వాదాలతో పొట్టలు నిండవు. అయినా మనం వేసే చిత్రాలు రాజభూషణంగారి గదిని దాటి బయటకి వెళ్ళవు. ఆయనకి వికారం కలిగించే చిత్రాలు ఇప్పటికే ఆయన దగ్గర వందల సంఖ్యలో వున్నాయి తెలుసా?"

"అయితే ఇంకా కొత్త చిత్రాలు దేనికి?"

"ఆయన కెందుకో మనకేం అవసరం? ఎవడి పిచ్చి వాడికి ఆనందం! ఆయన పిచ్చి మనకు నెలకి వేయిరూపా యలిస్తోంది."

"అయితే! మరో వెయ్యి ఇస్తే నన్ను ఆయనతో కులకమంటావల్లే వుంది."

"రోజీ!" అరిచాడు విలియమ్స్. "ఈ రోజు నీకు మతి పోయిందా? లేకపోతే ఏమిటా వెర్రివాగుడు?" చెయ్యెత్తాడు విలియమ్స్.

"కొట్టు. ఆగావేం? నీ పెళ్ళాన్ని నగ్నంగా చిత్రించి ఇవ్వడానికి నీకు సిగ్గులేనప్పుడు ఏమనుకుని ఏం లాభం?"

"నువు నా పెళ్ళానివనీ, ఆ చిత్రం నీదేనని రాజ భూషణానికి చెబుతానా?"

"నువు వేరే చెప్పాలా? చిత్రం చెప్పదా?"

"ముఖ కవళికలు మారుస్తాను కదా?"

"ఆమాత్రం ప్రావీణ్యం వున్నపుడు ఎవరో స్త్రీని నగ్నంగా వూహించుకుని చిత్రించలేవా?"

"చిత్రించగలను కానీ సహజత్వం వుండదు. ప్లీజ్.... రోజీ నిన్ను బజారున పడెయ్యడం నాకు మాత్రం సరదాగా వుంటుందా? నువు నా చిత్రాలకు కేవలం ప్రేరణ

మాత్రమే."

"నా నగ్నచిత్రం చూచి ఈ మోడల్ గరల్‌ను చూపించ మని రాజభూషణం కోరితేనో!"

"కోరితే ఆ రోజే మా మధ్య ఒప్పందం రద్దవుతుంది."

"ఆల్ రైట్!"

3

"వండర్‌ఫుల్! చాలా అద్భుతంగా వుంది. రంగుల మిశ్రమంలో మీకు మీరే సాటి మిస్టర్ విలియమ్స్!" రాజభూషణంగారి కళ్ళు మెరుస్తున్నాయి. ఆయన కళ్లు తదేకంగా స్టాండుకివున్న చిత్రానికి అతుక్కుపోయాయి.

చిత్రంలోవున్న స్త్రీ తలవెనక్కి తిప్పివుంది. ఒక చేత్తో చీర జారిపోతుంటే దాన్ని స్తనాలమీద కప్పుకుంది. మిగతాచీర కాళ్ళమీద పడుతోంది. చీర పల్చగావుండి పొత్తికడుపూ తొడలూ కనిపించీ కనపడకుండా వుంది చిత్రణ.

రోజారంగు ఒంటిమీద బంగారుఛాయ అద్దినట్టుంది ఆమె శరీరం. జుత్తు నల్లగా నిగనిగ లాడుతోంది. మబ్బు ప్రక్కనే నెలవంక కనిపించినట్టు ముఖం రేఖలాగా కనిపిస్తోంది. ఆమె రెండోచెయ్యి కుడి నడుంమీద అలవోకగా వేసుకుని నిలబడి వుంది.

"అద్భుతం! మిస్టర్ విలియమ్స్! మీలో గొప్ప కళ వుంది. ఆమె మెడదగ్గరా వక్షస్థలం మీదా మీరు సృష్టించిన షేడ్స్ అద్భుతం! విద్యుత్తువెలుగు పడినట్టు ఆమె చనుకట్టు మెరుస్తోంది" లొట్టలు వేసారు రాజభూషణంగారు.

విలియమ్స్ నిర్లిప్తంగా చూసాడు.

రాజభూషణంగారు పొగడుతోన్న తన కళ విలువయినదా?

తన కళకి ప్రేరణ అయి అస్పష్టంగా చిత్రంలో కని పిస్తోన్న తన భార్య శరీరపొంకం విలువయినదా!

నెలకి వెయ్యిరూపాయల ఒప్పందం విలువయినదా.

విలియమ్స్ తల విదిలించాడు.

"ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నారు!" అడిగాడు రాజ భూషణంగారు.

"ఏంలేదు! చిత్రంలో ఇంకా ఏమయినా మార్పులవ సరమా! అని చూస్తున్నాను" అబద్ధమాడాడు విలియమ్స్.

రాజభూషణంగారు తృప్తిగా నవ్వాడు.

విలియమ్స్‌లో ఆలోచనలు రేగుతున్నాయి.

'పాపం! రాజభూషణంగారు సెక్సుసౌఖ్యానికి దూర మయ్యారు కాబోలు! అందుకే యీ రకంగా స్త్రీల నగ్న చిత్రాలు చూచి తృష్ణ తీర్చుకుంటున్నారు. ఆయన కోరితే ఈ వయస్సులో నయినా కోటిమంది కన్యలు దొరుకుతారు. ఎందుకు ప్రయత్నించకూడదూ!'

"ప్చ...." నిట్టూర్చాడు విలియమ్స్.

'ఏ కోరికయినా సహజ వాతావరణంలో సహజమైన పద్ధతిలో తృప్తిపొందాలి కాని అడ్డదారిలో కాదు' సమా ధానపడలేకపోతున్నాడు విలియమ్స్.

4

తలుపుమీద టకటక చప్పుడయింది.

విలియమ్స్ స్టాండ్ దగ్గర పెన్సిలుతో నిలబడ్డాడు. రోజీ పల్చటి నైలాన్‌గౌనులో నారింజరంగు శరీరంతో స్టాండు కెదురుగా నిలబడివుంది. నైలాన్ గౌనులోంచి ఆమె ఒంటి వొంపులు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. లైట్‌గా పెన్సిలుతో స్కెచ్ గీయసాగాడు విలియమ్స్.

స్కెచ్ గీయడం ఆపి, "వెళ్లి చూడు యెవరో...."

అన్నాడు విలియమ్స్.

రోజీ తన మామూలు దుస్తుల్లోకి దూరి వెళ్లి తలుపు తీసింది.

తలుపు అవతల నలభై ఏళ్ళ వయసు లోపున వుండే స్త్రీ యెవరో నిలబడివుంది.

"విలియమ్స్‌గారి యిల్లు యిదేనా?" అడిగిందామె.

రోజీ తలాడించింది.

"వారు లోపల వున్నారా?"

"ఉన్నారు మీరెవరు?" అడిగాడు రోజీ.

"విలియమ్స్‌గారితో మాట్లాడాలి."

"వారు పనిలో వున్నారు."

"ఆ పని గురించే మాట్లాడాలి."

రోజీ ఆశ్చర్యంగా చూచింది.

"లోపలకి రండి" ప్రక్కకి తప్పుకుని దార యిచ్చింది రోజీ. ఆమె లోపలకు వచ్చింది.

"ఇలా కూర్చోండి. విలియమ్స్‌ని పిలుస్తాను" అంటూ రోజీ కుర్చీ చూపించి అవతలి గదిలోకి వెళ్లింది. ఆమె కూర్చుంది.

నిమిషం తర్వాత విలియమ్స్ వచ్చాడు. అతడి మొహంలో చిరాకు స్పష్టంగా కనిపిస్తోంది.

"సారీ! మీ పనికి ఆటంకం కలిగించాను" ఆమె నొచ్చుకుంది.

"దట్సాల్‌రైట్! మీరు వచ్చిన పనేమిటో మీరెవరో చెప్పండి" చిరాకును అణచుకోవడానికి ప్రయత్నించాడు విలియమ్స్.

"నా పేరు కమలవాసిని. రాజభూషణంగారి భార్యను."

విలియమ్స్ చెవులు విప్పుకున్నాడు. అతడికి తన కళ్ళనీ



చెవులనూ తనే నమ్మబుద్ధి కావడంలేదు. రాజభూషణంగారికి భార్య చనిపోయివుంటుందని తన అంచనా, అందుకే ఆయనలో కామవాంఛ వక్రమార్గం తొక్కింది అని వేసుకున్న తన అంచనా తారుమారయింది.

విలియమ్స్‌లో చిరాకు స్థానంలో సస్పెన్సు చోటు చేసుకుంది.

"నమస్తే" అన్నాడు విలియమ్స్.

కమలవాసిని ప్రతి నమస్కారం చేస్తూ, గుమ్మంకేసి తలత్రిప్పింది. రోజీ అక్కడే నిలబడి తనని తదేకంగా చూస్తోంది.

"మా వాంకి నగ్నచిత్రాలు అమ్ముతున్నారట!" అడిగింది కమలవాసిని.

"అమ్మడమా? అదేమిటి?" విస్తుబోయాడు విలియమ్స్.

కమలవాసిని తలాడించి, "మీరు మా కళకి ద్రోహం చేస్తోన్నట్టు చెప్పగలను. మీరు ఏ స్త్రీ నగ్నచిత్రం వేస్తోన్నారో కొంతకాలానికి ఆ స్త్రీ కావాలి వారికి. ఇంతకు ముందు ఇలా చాలాసార్లు జరిగింది" అన్నది.

"నేను చిత్రాలు అమ్ముతున్నట్టు మీకు ఎవరు చెప్పారు?" కోపంగా అరిచాడు విలియమ్స్.

"అమ్మడమో, నెల జీతానికి కక్కుర్తిపడి చిత్రించి యివ్వడమో.... నా దృష్టిలో ఏదయినా ఒకటే!"

విలియమ్స్‌కి రాజభూషణంగారంమీద మండిపోతోంది. తమ ఒప్పందం విషయాన్ని రహస్యంగా వుంచుతానని పెళ్ళాం దగ్గర దాచలేకపోయాడు భ్రష్టుడు!

"బహుశా మీ చిత్రాలకు ప్రేరణ మీ ఆవిడ శరీరం అనుకుంటాను."

విలియమ్స్‌కి ప్రక్కలో బాంబు పడినట్టు తోచింది.

"మీకు నెలకి వెయ్యి నేను యిస్తాను. వారికి చిత్రాలు యివ్వకండి."

విలియమ్స్ నుదురు చిట్లించాడు.

కమలవాసిని సిగ్గుగా నవ్వి, "నాకు యెంత వయసు వుంటుంది చెప్పండి" అన్నది.

"ముప్పై అయిదూ—ముప్పైఎనిమిదీ మధ్య."

"నలభై అయిదు."

"..........."

"నేను అందగత్తెనేనా!"

విలియమ్స్, రోజీ ఆశ్చర్యంగా మొహాలు చూసుకున్నారు.

నలభై యోపడిలో వున్నా ఆమె సౌందర్యం చెక్కుచెదరలేదు. తెల్లటి ఒళ్ళు, తీర్చిదిద్దినట్టున్న అవయవాలు, అందమైన కళ్లు, తీర్చిదిద్దినట్టున్న పలువరసా, యెర్రటి పల్చటి పెదాలూ-మొత్తానికి అందమైన విగ్రహం ఆమెది.

"మీరు అందగత్తెలలో మొదటిస్థానంలో వుంటారు" అంది రోజీ.

"ఆడది మెచ్చిందే అందం" నవ్వాడు విలియమ్స్.

"ఏం లాభం? నేను ఆయనకి పనికివచ్చాను కాదు."

"ఏం?"

"పదేళ్ళనుండి నేనంటే విముఖంగా వుండటం మొదలుపెట్టారు."

"మీకు రాజభూషణంగారితో నా ఒప్పందం విషయం యెలా తెలిసింది."

"అది నా రహస్యం."

"రాజభూషణంగారు చెప్పివుండాలి."

కమలవాసిని పకపక నవ్వింది.

"నీ శరీరం నాకు అక్కరలేదు. పరాయిస్త్రీల నగ్న చిత్రాలు చూచి చొంగలు కార్చుకుంటాను అని అయన నాకు చెబుతారా? మీకు అసలు హేతువాదం రాదు."

విలియమ్స్ మొహం యెర్రగా అయింది.

"మీరంటే మీ వారికి విముఖత యెందుకు?" అడిగింది రోజీ.

"మీ భర్తముందు చెప్పడం బావుండదు."

"నాతో ఒప్పందం పడితే మీ వృత్తి మీరు చేసుకో వచ్చును. వెయ్యిరూపాయిలూ వుచితంగా వస్తూంటాయి!" అన్నది కమలవాసిని విలియమ్స్‌కేసి తిరిగి.

"ఒప్పుకొనకపోతే!"

కమలవాసిని నవ్వింది.

"మీ ఆవిడ అందగత్తె అనే విషయం మా వారికి తెలిసేలాగా చేస్తాను. నగ్నచిత్రాల మోడల్ ఆమేనని చెబుతాను. అప్పుడయినా ఆయన రోజీవెంట పడతాడు. మీ ఒప్పందం కొనసాగించుకునే పాటి పౌరుషం మీకు వుంటుందనుకోను."

విలియమ్స్ కోపంగా చూసాడు.

"నాతో పరాచికలాడుతున్నారు."

"లేదు మీ మంచికోరి చెబుతున్నాను."

"నగ్నచిత్రాలు నా భార్యవని మీకు యెలా తెలుసు?"

"ఈ వెయ్యిరూపాయల భాగ్యానికి మీరు మోడెల్ గర్ల్సమీద పెట్టుబడి పెట్టగలరని ఏ మూర్ఖుడూ అనుకోడు."

"మోడల్ గర్ల్సకి రాజభూషణంగారు పే చేస్తున్నారు."

కమలవాసిని వ్యంగ్యంగా నవ్వి, "మా వారి మగతనం గురించి నాకు చెబుతారా?" అన్నది.

విలియమ్స్ గుర్రుగా చూసి, "మీరు నాకు ఎంతకాలం వరకూ వెయ్యిరూపాయిలివ్వగలరు?" అన్నాడు.

"ఎలా చెప్పను? మీరు యెంతకాలం వరకూ రాజ భూషణంగారితో ఒప్పందంలో వుండగలరో చెప్పగలిగారా? కనీసం యిప్పుడయినా సరే?" కమలవాసిని పకపక నవ్వింది.

విలియమ్స్ రోజీ మొహాలు చూసుకున్నారు.

5

"మీ వరస నాకు నచ్చలేదు. మాటమీద నిలబడ లేనప్పుడు అనవసరమైన ఒప్పందాలు దేనికి?" కోపంగా అడిగాడు విలియమ్స్.

"మాట తప్పడమా? నేనా?" ఆశ్చర్యపోయాడు రాజ భూషణంగారు.

విలియమ్స్ కమలవాసిని తన వద్దకు వచ్చిన సంగతి మొత్తం చెప్పాడు, నగ్నచిత్రాలు రోజీవనే విషయం మరగున పెట్టి.

రాజభూషణంగారి కళ్లు యెర్రబడ్డాయి.

"డర్టీ రోగ్... మొగుడిని సుఖపెట్టలేదుకానీ వెర్రిముండా

తెలవితేటలు మాత్రం వున్నాయి" చిరాకుపడ్డాడు రాజభూషణంగారు.

"అంటే మీరు చెప్పలేదా?" అనుమానంగా అడిగాడు విలియమ్స్.

"ఎవరైనా కోరి నిప్పును ఒడిలో కట్టుకుంటారా?"

"అయితే మన ఒప్పందం విషయం ఆమెకి యెలా తెలుసు?"

రాజభూషణంగారు కోపంగా చూచి, "మా ఆవిడ వెయ్యి రూపాయిలూ వుచితంగా యిస్తానంది కదా! తీసుకోండి" అన్నాడు.

"అంటే నేను ఆమెకి చెప్పాననా?"

"ఏమో!"

"నాకు అసలు మీకు కమలవాసినిగారి అంతటి అందమైన భార్య వున్న విషయమే తెలియదే?"

"అందమైన భార్య అనే విషయం గుర్తించారు కదా! అదే పదివేలు!"

"అంటే!"

"మిమ్మల్ని వలచి వచ్చిందేమో!"

"నాన్సెన్స్!"

ప్రక్కనే యెవరో గుసగుసలుగా నవ్వినట్టు శబ్దమయింది. ఇద్దరూ మొహాలు చూసుకున్నారు.

విలియమ్స్ కళ్ళతో సైగచేసి గది తనిఖి చేయడం మొదలుపెట్టాడు. అతడి శ్రమ ఫలించింది. అర గంట తర్వాత చెత్తబుట్ట ప్రక్కనున్న గోడలో మాయ అర కనిపించింది. దానిలో మైక్రోఫోను వుంది. మైక్రోఫోనును

బయటికి లాగాడు విలియమ్స్. తీగలు బయటికి వచ్చాయి.

రాజభూషణంగారు నిప్పులు కురుస్తూ చూడసాగాడు.

6

తలుపు మెల్లగా తోసాడు రాజభూషణంగారు.

గడియపెట్టలేనట్టుంది. తలుపు తెరుచుకుంది. నెమ్మదిగా లోపలకు అడుగు పెట్టాడు. గదిలో యెవరూ లేరు. యిల్లు నిశ్శబ్దంగా వుంది. లోపలి గుమ్మంలోంచి తొంగి చూసాడు.

అవతలి ప్రక్కగదిలో స్పాట్ లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. ఒక స్పాటులైటు స్టాండ్ మీద వున్న కాన్వాసుకి వెలుగు పులుముతోంది.

రెండో స్పాటులైటులో రోజీ అర్ధనగ్నంగా వున్న భంగిమలో కాంతి స్నానం చేస్తోన్న స్వప్నసుందరిలాగా కూర్చుండి వుంది. మోకాళ్లు ఆమె రొమ్ములను సగం వరకూ కప్పి పల్చటి నీడలో మిగతా శరీరాన్ని క్రమ్ముకుంటున్నాయి.

విలియమ్స్ ఆమె సౌందర్యాన్ని కళ్లతో త్రాగి తదేకంగా కుంచెతో కాన్వాసుమీద రంగులు రంగులుగా వెదజల్లుతున్నాడు. రోజీ తేనె కళ్లు నిషాను వెళ్ళక్రక్కుతున్నాయి.

రాజభూషణంగారు కళ్లు ఆర్పకుండా రోజీ శరీరం ఒంపులను జుర్రుకుంటున్నాడు. ఆమె నారింజపండు రంగు వొళ్లు తడిగా మెరుస్తోన్నట్టు కోరిక మెల్లగా రగులుకుని క్షణాల్లో విశ్వరూపం ధరిస్తోంది. ఎర్రటి ఆమె పెదాలు అతడిలోని కోరికలకు కళ్లాలు తొడిగి కదం త్రొక్కిస్తున్నాయి.

రోజీ రెప్పవేయకుండా విలియమ్స్‌నే చూస్తోంది.

విలియమ్స్ ఆమె ఎత్తుపల్లాలకు, మెరుగులు దిద్దుతూ తన కళలో లీనమైపోయాడు.

రాజభూషణం వూపిరి విడవడం మరచిపోయాడు.

క్షణాలు నిముషాల్లోకి పరుగెడుతున్నాయి.

విలియమ్స్ అలసటగా బ్రష్ ప్రక్కనే పెట్టి ఒళ్ళు విరుచుకున్నాడు.

"రిలాక్స్!" అన్నాడు రోజీని చూచి. స్పాటులైట్సు ఆఫ్ చేసాడు.

ముగ్గురికీ కళ్ళ ముందు అంధకారం పరచుకొన్నట్టయింది. రాజభూషణంగారు చప్పుడు కాకుండా బయటికి నడిచాడు.

రోజీ చటుక్కున తన దుస్తుల్లోకి మారి, "మన ఇంటి గుమ్మం తెరుచుకున్నట్టుంది" అంటూనే ముందుగదిలోకి నడిచింది. తలుపులు మూసివున్నాయి. "గడియవేయడం మరచిపోయినట్టున్నాము" గొణుక్కుంటూ రోజీ రోడ్డు మీదకు చూచింది.

జనం యెవరి గొడవలో వాళ్లు వున్నారు. రోజీ వెనక్కి తిరిగివచ్చింది. విలియమ్స్ స్పాట్ లైటును సరిచేసి రెండు గదులకూ వుమ్మడి గుమ్మంలో పడేలాగా చేసాడు. చుట్టూ సన్నటి తడి అంచుగా వున్న రెండు పాద ముద్రలు కనిపించాయి.

"ఎవరో నిన్ను అర్ధనగ్నంగా చూచి వాళ్లు వేడెక్కి యిప్పుడే బయటికి వెళ్ళిపోయారు" అన్నాడు విలియమ్స్ నీరసంగా.

రోజీ సిగ్గుగా భయంగా గుండె లదుముకుంది.

"రాస్కెల్! యెవడై వుంటాడు?" అడిగాడు విలియమ్స్.

"కమలవాసిని అయివుంటుందా?"

"కాదు. ఎవరో మగవాడు."

"ఆమె నియమించిందేమో!"

"ఆమెకు ఏం అవసరం?"

"రాజభూషణంగారేమో?"

"కావచ్చు."

రోజీ చేతుల మధ్య మొహం పెట్టుకొని యేడవ సాగింది.

"ప్లీజ్.... ఏడవక...."

రోజీ కోపంగా చూచింది.

"ఏడవక యేం చేయను? నన్ను వీధిన పడేసావు."

"ఏం చేద్దాం?"

"యేం చేసి యేం ప్రయోజనం? కావలసిందంతా అయాక!"

"వెరీ సారీ డియర్! వాడిని చంపేస్తాను."

రోజీ భయంగా చూచింది.

"కమలవాసినితో మనం ఒప్పందం కుదుర్చుకోవలసింది. నువ్వు అనవసరంగా రాజభూషణంతో చెప్పావు."

"ఇప్పుడు వచ్చిన మనిషి యెవరో తేలాలి కదా ముందు!"

ఇద్దరూ ఆలోచనలో పడ్డారు.

7

సర్వేతోట చుట్టూ జనం మూగుతున్నారు. పోలీసులు వారిని అదుపులో పెట్టడానికి శాయశక్తులా లాఠీలు ఝళిపించి కేకలుపెట్టి ప్రయత్నం చేస్తున్నారు.

సర్వే తోటచుట్టూ ముళ్లకంచె నాలుగు వరసలుగా కట్టి వుంది. గుమ్మంలాగా వున్న ప్రదేశంలో జనం రద్దీ మరీ



ఎక్కువగా వుంది. యెలా వెళ్ళగలిగాడో ఇన్స్పెక్టర్ గోపాల్ గుమ్మంవద్ద ప్రత్యక్షమయ్యాడు.

"ప్లీజ్.... వినండి. జనంలో ఏ ఒక్కరు సర్వేతోటలో అడుగుపెట్టినా వారి అడుగుజాడలు పడితీరుతాయి. వారంతా యీ హత్యకేసులో దోషులుగా అనుమానించబడతారు. టేక్ కేర్.... దూరంగా తప్పుకొనండి. లేకపోతే అనవసరంగా కేసులో యిరుక్కుంటారు" అరిచాడు గోపాల్.

'హత్య.... కేసు ...దోషి.... ఇరుక్కోవడం' మాటలు జనంమీద బాగా పనిచేసాయి. తోటకి పాతిక గజాలమేర లోకి పోయి నిలబడ్డారు.

ఇన్స్పెక్టర్ గోపాల్ రోడ్డువైపు చూచి, రమ్మన్నట్టు తలూపాడు.

అంతసేపూ రాజ్దూత్ మీద కూర్చుండి జనంకేసి చూస్తోన్న డిటెక్టివ్ శిరీష్ తన వాహనాన్ని రోడ్డుకి వొక ప్రక్కగా బ్రేక్ వేసి పార్క్ చేసి, చకచక సర్వేతోటలో అడుగుపెట్టాడు. సర్వేచెట్ల మధ్య ఇద్దరు కానిస్టేబుల్సు

నిలబడి వున్నారు. గోపాల్, శిరీష్ అటు నడిచారు.

సర్వేచెట్ల మధ్యవున్న స్థలంలో బోర్లగిలబడి వుంది శవం. వీపులో వెండిలా మెరిసే కత్తి దిగబడివుంది. హతుడి శరీరంమీద వున్న చొక్కా-నిండా రక్తం పెచ్చు కట్టి భీభత్సంగా వుంది. తల మట్టిలో కూరుకుపోయి వుంది. గూడకట్టుపంచె కట్టుకున్నాడు హతడు. దానిమీద కూడా రక్తం కారి అట్టలా మరకట్టింది.

"బట్టలనుబట్టి చూస్తే హతుడు బాగా కలగిన కుటుంబం వాడై ఉంటాడనిపిస్తోంది." అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

గోపాల్ వంగి శవాన్ని పరీక్షించేవాడల్లా లేచి తలూపి. "అవును. ఫోటోలు తీసాక తల బయటికి తీయించుదాం" అని, ఫోటోగ్రాఫర్‌కోసం కానిస్టేబులును పంపించాడు. నిమిషంలో వ్రేలిముద్రల నిపుణులతోబాటు ఫోటోగ్రాఫర్ కూడా వచ్చాడు. గోపాల్ వాళ్లకి సూచనలివ్వసాగాడు.

డిటెక్టివ్ శిరీష్ పరిసరాలను గమనించుకుంటూ కంచె వరకు వచ్చాడు.

"ఏమైనా అనుమానించ దగ్గ వస్తువులు కనిపించాయా?"

డిటెక్టివ్ శిరీష్ వెనక్కి తిరిగిచూసాడు.

తనలాగే గోపాల్ పరిసరాల్లో వెతుకుతూ తన వెనకనే వచ్చాడు.

"లేదు." అన్నాడు శిరీష్.

"శవంమీద వేలిముద్రలు దొరకలేదు. రా! తల చూసి గుర్తుపడదాం!" గోపాల్ వెనక్కి తిరిగాడు. శిరీష్ అతడిని అనుసరించాడు.

"గోపాల్! అటు చూడు....ఇసుకలో...." అరిచాడు శిరీష్.

గోపాల్ శిరీష్ చూపినవైపు చూచి చురుకుగా యిసుకలో సగం కూరుకుపోయి వున్న తెల్లటి కవర్ తీసాడు. జాగ్రత్తకోసం జేబురుమాలుతో పట్టుకున్నాడు. ఇద్దరూ శవం దగ్గిరికి నడిచారు.

అప్పటికే ఫోటోగ్రాఫర్ శవాన్ని అయిదారు కోణాల్లో ఫొటోలు తీసాడు. కానిస్టేబుల్సు శవాన్ని కదిలించి తలను మట్టిలోంచి ప్రక్కకి తీశాడు. పత్తికాయల్లాగా తెరచుకున్న కళ్ళనిండా ఇసుక అంటుకుని వుంది. నోరు తెరుచుకుని వుంది. నోటినిండా ఇసుక!

"అరె! రాజభూషణంగారు!" ఆశ్చర్యంగా అరిచాడు గోపాల్.

"పాపం! ఆయనకున్న లక్షలు ఆయన్ని దుర్మరణం నుండి కాపాడలేకపోయాయి" అన్నాడు డిటెక్టివ్ శిరీష్.

"ఆస్తి తినడానికి పిల్లలు కూడా లేరు."

"భార్య కమలవాపినికే కదా ఆస్తి దక్కేది."

"అవును."

గోపాల్ తన చేతిలో వున్న తెల్లటి కవరును వ్రేలి ముద్రల నిపుణుడికి అందించి, వ్రేలిముద్రలకోసం చూడ మని ఆదేశించాడు. నిపుణుడు కవరునూ, లోపల వున్న చిన్న వుత్తరాన్ని పరీక్షించి వ్రేలిముద్రలు లేనట్టు నిర్ధారించి యిచ్చేసాడు. గోపాల్ వుత్తరం పైకి చదివాడు.

గౌ॥ రాజభూషణంగారూ!

సర్వేతోటవద్ద వేచి వుండండి. పెయింటింగుల విషయం మాట్లాడుదాం,

—విలియమ్స్,

"ఉత్తరం ఇంగ్లీషులో వుంది. ఇంతకీ విలియమ్స్ యెవరో, పెయింటింగు లేమిటో తెలుసుకుందాం. రాజ భూషణం బంగ్లాకి వెళదాం" గోపాల్ అంటూనే తర్వాత

చేయవల్సిన పనులను తన సిబ్బందికి పురమాయించ సాగాడు.

8

"మీరు భర్తపోయిన దుఃఖంలోవుంటే ప్రశ్నలువేసి సమాచారం రాబట్టవలసి వస్తోంది. క్షమించండి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

రాజభూషణంగారి బంగళాలో డ్రాయింగ్ రూంలో గోపాల్, డిటెక్టివ్ శిరీష్ కూర్చుని వున్నారు. వారికి ఎదురుగావున్న సోఫాలో మూర్తీభవించిన శోకదేవతలాగా కమలవాసిని కూర్చున్నది. ఆమెకళ్ళు ఎర్రగా వుబ్బి వున్నాయి. బుగ్గలమీద కన్నీళ్ళు చారికలు కట్టివున్నాయి. ఆమె మెల్లగా ఏడుస్తోంది.

"ఫరవాలేదు అడగండి. మీ కర్తవ్యం మీరు నెరవేర్చు కుంటారు గదా!" అంది కమలవాసిని ఏడుపును దిగమింగు కుని.

"మీ వారికి శత్రువులెవరయినా వున్నారా?" అడిగాడు గోపాల్.

"నాకు తెలిసి ఎవరూలేరు. ఆయన ఎవరికీ అపకారం చేసినవారు కాదు."

"ఆయన్ని ఎవరయినా హత్యచేస్తామని బెదిరించినట్టు మీకు తెలుసా?"

"లేదు."

"ఈ మధ్య మీవారిని కలుసుకున్నవారిలో కొత్తవారెవ రయినా వున్నారా?"

"ఇంటికి ఎవరూ రాలేదు"

"మీకు యెవరిమీదయినా అనుమానం వుందా?"

"లేదండి."

"మీ వారు చనిపోతే ఆస్తికి మీరే హక్కుదారు లను కుంటాను."

"అవును. ఈ పాపిష్టి ఆస్తి అంతా నాకే! ఏం చేసు కోను? నాకు కూడా వెనక యెవరూ లేరు."

"నిజంగా విచారించ వలసిన విషయమే!"

కమలవాసిని ఏడవడం మొదలుపెట్టింది.

డిటెక్టివ్ లిద్దరూ మౌనంగా కూర్చున్నారు. ఏడ్చి ఏడ్చి కమలవాసిని తన దుఃఖం బరువు దించుకుంటోంది. బరువు దించుకోనకుండా ఆమెను ఆపే హక్కు తమకి లేదని ఆ డిటెక్టివ్‌ల అభిప్రాయం అయివుంటుంది.

కమలవాసిని ముక్కు చీదుకుని "సారీ...." అన్నది.

"ఫరవాలేదు. విలియమ్స్ ఎవరు?" అడిగాడు శిరీష్.

"విలియమ్సా? మీకు యెలా తెలుసు?" ఎదురు ప్రశ్న వేసింది కమలవాసిని.

"తెలిసింది లెండి. అతడి గురించి చెప్పండి."

"విలియమ్స్ చెయ్యి తిరిగిన చిత్రకారుడు."

"మీవారితో స్నేహం వుందా?"

"వుంది."

"ఎలాంటి స్నేహం?"

"తెలియదు."

"కమలవాసినిగారూ! మీకు తెలిసింది చెప్పకపోతే కేసు ముందుకి వెళ్ళదు. దయచేసి సహకరించండి."

"నేను నిజం చెబుతున్నాను. నన్ను నమ్మండి."

"విలియమ్స్ ఎలాంటివాడు?"

"మంచివాడనే నా అభిప్రాయం!"

"మీ వారితో పెయింటింగ్స్ విషయంలో అతడు మాట్లాడబోయినట్టు మీకు తెలుసా?"

"పెయింటింగ్సా? ఆశ్చర్యంగా వుంది. వున్న పెయింటింగ్సు యెక్కడ పెట్టుకోవాలో తెలియక పోతోంటే కొత్తవాటి విషయం ఆలోచించడానికి సమయం ఏదీ?"

"అంత ఎక్కువ సంఖ్యలో పెయింటిగ్సున్నాయా?"

"ఉన్నాయి. అయితే మావారు చూడనివ్వనివి కొన్ని వున్నాయి."

"విలియమ్స్ చిరునామా మీకు తెలుసా?"

"మావారు ఆ మధ్య చెబితే గుర్తొస్తోంది. చిత్రాలయ థియేటర్ దగ్గర "కళాకేతన్" భవనంలో ఒక వాటాలో వుంటున్నాడట."

"మీకు తెలియని రహస్యాలు మీ వారికి వున్నట్టు మీరే చెబుతున్నారు."

"ఉండవచ్చు. ఆశ్చర్యంలేదు."

"ఏం?"

కమలవాసిని తలవాల్చి, "పదేళ్ళనుండి నేను బ్రహ్మచర్యం పాటించుతున్నాను. ఆయన విషయం నాకు అంతగా తెలియదు" అన్నది.

"ఏమీ అనుకోవద్దు. లోపం ఎవరిలో వుంది?"

కమలవాసిని చురుకుగా చూచింది. "తెలిసే లోపం అయితే సరిదిద్దుకోరూ?" అంది.

"మీ వారి పెయింటింగ్సు చూడవచ్చునా?"

"అలాగే!" కమలవాసిని లేచి లోపలి గదిలోకి వారిద్దరిని తీసుకువెళ్ళింది.

ఆ గదిలో రకరకాల పెయింటింగ్సు వున్నాయి. చారిత్రక ఘట్టాలతోబాటు నగ్నసుందరీమణుల చిత్రాలూ, వేటకి వెళ్ళేవారికి ఎదురయ్యే దృశ్యాలూ....ఒక రకం కాదు. విలువయిన తైలవర్ణ చిత్రాలు.

"మీకు కనిపించకుండా దాచినవి ఈ చిత్రాలేనా?" అడిగాడు గోపాల్.

"నగ్నచిత్రాలు."

"ఐసీ...."

ఆమెకి థాంక్స్ చెప్పి ఇద్దరూ బంగళాలోంచి బయట పడ్డారు.

"ఇంత బంగళాకి ఇద్దరు!" అన్నాడు శిరీష్ దారిలో.

"ఇద్దరి జీవితాలూ రెండు కొసలు."

"ఆశ్చర్యం."

రాజ్ దూత్ పోలీస్ స్టేషన్ ముందు ఆగింది. గోపాల్, శిరీష్ వాహనం దిగి స్టేషన్ లో అడుగుపెట్టారు. సార్జంటు ఇద్దరికి సెల్యూట్ చేసి, "శవాన్ని మార్చురీకి పంపాం సార్! ఇంకా రిపోర్టు రాలేదు" అన్నాడు.

"ఈలోగా విలియమ్స్ దగ్గరకి వెళ్దాం" అన్నాడు శిరీష్.

గోపాల్ తలూపాడు.

9

"గ్లాడ్ టు మీట్ యూ. మీగురించి విన్నాను. ఇలా వచ్చారేమిటి?" అన్నది రోజీ.

"విలియమ్స్ గారి కోసం చిన్నపనిమీద వచ్చాము" అన్నాడు గోపాల్.

"విలియమ్స్ కాన్వాసు షీట్సు కొని తెచ్చుకోవడానికి విజయనగరం వెళ్ళాడు. మరో గంటలో రావచ్చును. ఈ లోగా నేను మీకు ఏం హెల్ప్ చేయగలనో చెప్పండి."

"థాంక్స్ మీకు రాజభూషణంగారు తెలుసా?"

"తెలుసు?"

"ఎలా తెలుసు?"

"మా వారికి ఈ మధ్యనే పరిచయమయారు."

"ఏ రకంగా?"

"ఆయనకి ఏదో పెయింటింగ్స్ చిత్రించమన్నారట!"

"ఎలాంటి పెయింటిగ్స్ తెలుసా?"

"ఇంకా విలియమ్స్ చిత్రించలేదు. బహుశా శిల్పాలయి వుండాలన్నాడు విలియమ్స్."

"మిస్టర్ విలియమ్స్‌కీ రాజభూషణంగారికీ ఎంత కాలమై స్నేహం!"

"వారం అయివుంటుంది. కేవలం పరిచయమే-స్నేహం వరకూ వెళ్ళలేదు."

"ఇద్దరూ సర్వేతోపులో కలుసుకుని మాట్లాడుకుందామనుకున్న విషయం మీకు తెలుసా?"

"సర్వేతోపులోనా! ఎందుకు?"

"ఏమో మీరే చెప్పాలి."

"రాజభూషణంగారు లంకంత బంగళాలో మాట్లాడలేని విషయం అక్కడ ఏమైనా మాట్లాడుకోవాలనేమో!"

"ప్చ ఇద్దరికీ మధ్య అంత రహస్యాలు లేవు."

ఇన్‌స్పెక్టర్ గోపాల్ జేబులోంచి సర్వేతోపులో దొరికిన వుత్తరం చూపించాడు.

రోజీ ఆ ఉత్తరం చదివి తెల్లబోయింది.

"ఉదయాన్నే విలియమ్స్ విజయనగరం బయలుదేరి వెడుతోన్నట్టు నాతో చెప్పి బయలుదేరాడు. ఇంతకీ యేం జరిగింది!"

"రాజభూషణంగారు హత్యచేయబడ్డారు."

రోజీ విచారంగా చూచింది!

"విలియమ్స్‌తో ఒప్పందం చేసుకుంటే.. ప్చ...డబ్బు కనిపించినట్టే కనిపించి మాయమయింది" అన్నది నిట్టూర్చి.



"ఏ మాత్రం డబ్బు?"

"నెలకి వెయ్యిరూపాయిల జీతం!"

గోపాల్ శిరీష్‌కేసి చూసాడు. శిరీష్ కళ్లు సగం మూసుకుని ఆలోచనలో మునిగివున్నాడు.

"రాజభూషణంగారి శవం ప్రక్కనే విలియమ్స్ రాసిన వుత్తరం పడివుంది. అందుకే ఆయన మొదటి అనుమానితుడు" అన్నాడు శిరీష్.

రోజీ ధీమాగా చూచి, "ఆయన హత్యచేసేటంత కఠోరుడు కాదు. పైగా రాజభూషణంగారిని చంపుకుంటే తనకే నష్టం! ఆ విషయం మీకే మీ దర్యాప్తులో తేలుతుంది."

శిరీష లేచాడు, గోపాల్‌కేసి సాభిప్రాయంగా చూసాడు.

"మీరు చెప్పవలసిందేమయినా వుందా?" అన్నాడు గోపాల్.

"నేనా!" నవ్వింది రోజీ. "మీరు అడిగితే తప్ప.... యిక విషయాలేమీ లేవు" అంది.

ఆమె వద్ద సెలవు పుచ్చుకుని అపరాధ పరిశోధకులిద్దరూ బయటికి నడిచాడు.

"అన్నట్టు మరిచాను. శవాన్ని మొదట చూచిం దెవరు?" అడిగాడు శిరీష్.

"ఎవరో పబ్లిక్ బూత్ నుండి ఫోన్ చేసారు."

రాజ్‌దూత్ పోలీస్‌స్టేషన్ ముందాగింది.

అప్పటికే పోస్ట్‌మార్టం రిపోర్టు కూడా వచ్చింది.

"హత్య తెల్లవారుజాము 3 గం—4 గం మధ్య జరిగింది. గుండె ప్రాంతాల్లో వున్న కండరాలు మాడిపోయి వున్నాయి. పెద్దసైజు తుపాకీతూటాతో హతుడు ప్రాణాలు కోల్పోయాడు. అయితే తూటా దొవకలేదు. గుండ్రటి గాయంలో తర్వాత కత్తి గుచ్చబడింది. తూటా గుండెల్లోంచి ప్రయాణించి వీపులోంచి బయటికి వెలువడింది. అంటే తుపాకీని చాలా దగ్గరలోంచి ప్రేల్చివుండాలి. తూటా తగిలిన కొద్దిక్షణాల్లోనే మరణం సంభవించింది."

ఇన్‌స్పెక్టర్ గోపాల్ చదివి పోస్ట్‌మార్టం రిపోర్టును శిరీష్‌కి అందించాడు. శిరీష్ రిపోర్టు చదివి తల పంకించాడు.

"తుపాకీ తూటా గురించిన వివరాలు పరిశీలించాలి" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

"కత్తి ఎవరిదో తెలుసుకోవాలి. విలియమ్స్‌ను విచారించాలి" అన్నాడు శిరీష్.

10

డిటెక్టివ్ శిరీష్ మార్చురీ బిల్డింగుముందు తన రాజ్‌దూత్‌ను పార్క్‌చేసి చకచక భవనంలోకి నడిచాడు. అధికారులతో సంప్రదించి రాజభూషణం శవం పరీక్షచేసిన పాథాలజీ సర్జన్‌లతో చర్చలకు దిగాడు.

"తూపాకీ తూటాతోనే ప్రాణంపోయినట్టు నిర్ధారిం చారు. ఆ విషయంలో యింకా వివరాలు అందించగలరా?" అడిగాడు శిరీష్.

"మా పరిశోధనలో తేలిన విషయమంతా రిపోర్టులో రాశాం. మీకు కావలసిన వివరాలు అడగండి" అన్నాడు సర్జన్స్‌లో పెద్దాయన.

"తుపాకిని యెంత దగ్గరగా వుంచి ప్రేల్చితే ఆ విధంగా తూటా శరీరంలోంచి వెలుపలికి వస్తుందో నేను తెలుసుకుంటాను. మీరు గాయం పొడవు వెడల్పులు చెప్ప గలరా?"

"రండి. లోపలికి వెళ్దాం" అంటూ సర్జన్స్ లోపలికి దారితీసారు. ఒక సర్జన్ మంచు అరను బయటికి లాగాడు. రాజభూషణం శవం! గుండెప్రాంతాల కోతలతో బీభత్సంగా వుంది. తల, మిగతా శరీరం కుట్లు కుట్టివుంది.

"ఇన్‌స్పెక్టర్ గోపాల్‌వద్ద నుండి కబురు రాగానే గాయపడిన ప్రాంతం కూడా కుట్టించుదాం అనుకుని ఆగాను" అన్నాడు సర్జన్స్‌లో పెద్దాయన.

"తూటా తగిలిన వెంటనే ప్రాణం పోయివుంటుం దన్నారు. అంటే ఎంత సేపటిలోపులో?"

"పదిక్షణాల్లో తప్పితే ఇరవై క్షణాల్లో గుండె కవా టాలు తెబ్బతిని హెమరేజ్ సంభవించడం వలన మర ణించడం చాల త్వరగా జరిగివుంటుంది."

సర్జన్స్ గ్లోవ్స్ తొడుక్కున్నారు.

శవం గుండెల ప్రాంతాల వున్న కండరాలను ఒత్తి గించి టేపుతో కొలవసాగారు. శిరీష్ కొలతలు నోట్‌చేసు కున్నాడు.

గాయం వ్యాసం 0.28 అంగుళాలు.

మాంసం పొరల మధ్య తూటా చీల్చిన వరసలు 19.

వరసల మధ్య దూరం 0.6 అంగుళాలు

మరో అరగంటపాటు తనకి కావలసిన వివరాలను అడిగి నోట్ చేసుకుని శిరీష్ వారికి కృతజ్ఞతలు చెప్పి బయటకు నడిచాడు.

రాజ్‌దూత్ పోలీస్‌స్టేషన్ ముందు ఆగింది.

సరిగ్గా అప్పుడే గోపాల్ జీపు దిగి లోపలికి నడుస్తున్నవాడల్లా ఆగాడు.

"కత్తి యెవరిదో తెలుసుకున్నావా?" అడిగాడు శిరీష్.

"చాల సులువుగా. విలియమ్స్‌వాళ్ళ వంట యింట్లో కూరలు తరుక్కునే కత్తి."

"అనుకున్నాను."

"ఎలా అనుకున్నావు?" ఆశ్చర్యపోయాడు గోపాల్.

"తర్వాత చెబుతాను. విలియమ్స్ వచ్చాడా?"

"ఇంకా రాలేదు."

"లోపల కూర్చుందాం. చాలా వివరాలు తెలిసాయి." గోపాల్ హుషారుగా ఈలవేసాడు. ఇద్దరూ స్టేషన్‌లోకి నడిచారు. కుర్చీలలో ఆసీనులయారు. డిటెక్టివ్ శిరీష్ టేబులుమీద వున్న 'క్రిమినాలజీ' పుస్తకం తెరిచి పేజీలు తిరగవేసాడు. గోపాల్ చూస్తూ వూరకుండిపోయాడు.

అయిదు నిమిషాల నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ, "గోపాల్! హతుడు 0.280 బోర్ రాస్ ఏక్సిలెరేటెడ్ రైఫిల్‌తో హత్య చేయబడ్డాడు. దాని తూటా దూసుకుపోయే వేగం సెకండుకు 4,500 అడుగులు. గమ్యంమీద 2,800 ఫుట్ పౌండ్ల శక్తితో వెళ్ళి పడుతుంది. చాల దగ్గర

నుండి అంటే 20 అడుగుల లోపునుండి తుపాకీ ప్రేల్చి రాజభూషణాన్ని హత్య చేసారు. మొదట ఈ తుపాకీ ఎవరిదో కనుక్కోవాలి."

గోపాల్ నోరు తెరుచుకుని వుండిపోయాడు.

"పెద్ద జంతువులను క్రూరంగా వేటాడే రైఫిల్‌తో మనిషిని వేటాడారా! చాలా పాతకాలంనాటి తుపాకీ అది. ఎవరిదో తెలుసుకోవడం సులభమే" అన్నాడు గోపాల్.

గుమ్మంవద్ద అలికిడయింది.

ఇద్దరూ తల తిప్పి చూసారు.

సార్జంట్, ప్రక్కన తెల్లగా పొడవుగా వున్న వ్యక్తి నిలుచుని వున్నారు.

"వీరే మిస్టర్ విలియమ్స్" అన్నాడు సార్జెంట్.

"ప్లీజ్ కమ్‌యిన్" అన్నాడు గోపాల్.

విలియమ్స్ లోపలికి అడుగుపెట్టాడు గోపాల్ చూపించిన కుర్చీలో కూర్చున్నాడు.

"మీ మిసెస్ రోజీ మీకు అంతా చెప్పివుంటారనుకుంటాను" అన్నాడు గోపాల్.

విలియమ్స్ తలూపాడు.

"రాజభూషణాన్ని సర్వే తోటకు రమ్మని వుత్తరం రాసారా?"

"రాసాను."

"దేనికి?"

"పెయింటింగ్స్ విషయం మాట్లాడదామని."

"బంగళాలో మాట్లాడవచ్చు కదా!"

"కమలవాసినిగారికి భర్త అభిరుచి పట్ల మంచి అభిప్రాయంలేదు."

"అంటే!"

"పెయింటింగ్సుమీద యెక్కువ ఖర్చుపెట్టడం ఆమెకి యిష్టంలేదు."

"ఎలాంటి పెయింటింగ్సు!"

"ప్రకృతి దృశ్యాలు, భారతీయ జీవనం."

"మిస్టర్ విలియమ్స్! రాజభూషణంగారి కలక్షన్ నగ్న చిత్రాలున్నాయి చూసారా?" అడిగాడు శిరీష్.

"చూసాను."

"అటువంటి చిత్రాలు చిత్రించమని రాజభూషణం కోర లేదా?"

"కోరారు నేనే ఒప్పుకోలేదు."

"ఏం?"

"ఏమో! నాకు ఆ పద్ధతి యిష్టంలేదు—"

"హతుడి శరీరంలో మీ యింట్లో వున్న కత్తి గుచ్చుకుని వుంది. ఏమంటారు?"

"ఆ కత్తి మొన్నటినుండి మా యింట్లో కనిపించడం లేదు."

"అంటే ఎవరైనా కత్తి దొంగిలించారా?"

"అనే నా అనుమానం!"

"మీ అనుమానానికి ఆధారం వుందా?"

"మొన్న నేను చిత్రం తుదిమెరుగులు దిద్దుకుంటూంటే రోజీ నా ప్రక్కనే నిలబడి వుంది. ముందు గదితలుపు తెరచినట్లనిపించింది. రెండు గుమ్మాలకి మధ్య తలుపుల వద్ద యెవరో నిలబడినట్లు అడుగుజాడలు కనిపించాయి. ఆ తరువాతనుండి కత్తి కనిపించలేదు."

"మీకు యెవరిమీదన్నా అనుమానం వుందా?"

"నాకు తెలిసి శత్రువులెవరూ లేరు."

"రాజభూషణంగారిని సర్వేతోటలో కలుసుకున్నారా?"

"కలుసుకుని మాట్లాడాను."

"ఎప్పుడు?"

"నిన్న సాయంత్రం అయిదుగంటలకు."

"ఎంతసేపు?"

"అరగంట."

"ఆయన కంగారుగా కనిపించారా?"

"లేదు. చాల ప్రశాంతంగా మాట్లాడుకున్నాం."

"ఈ రోజు తెల్లవారుజామున మీరు ఎక్కడున్నారో చెప్పగలరా?"

"నిద్ర మంచంమీద."

"విజయనగరం బయలుదేరి వెళ్ళడానికి ముందు ఏం చేసారో వివరంగా చెప్పండి."

"ఆరుగంటలకు నిద్రలేచాను. తయారై ఏడూపదిహేను బస్సుకి విజయనగరం బయలుదేరాను."

"శవం ప్రక్క మీ వుత్తరం, కత్తీ వున్నాయి. అంటే...."

"మొదటి అనుమానితుడిని నేనంటారు! నాకు ఆయనని హత్య చేయవలసిన పనిలేదు. పైగా నష్టం కూడా."

"ఆల్ రైట్. మీరు వెళ్ళండి" నిస్పృహగా కుర్చీలో కూలబడ్డాడు ఇన్‌స్పెక్టర్ గోపాల్.

11

"మిస్టర్ విలియమ్స్! మిమ్మల్ని కలుసుకోవడం నాకు చాలా సంతోషంగా వుంది" అన్నాడు ఫుల్‌సూటులో వ్యక్తి.

"ఐ-టూ" అన్నాడు విలియమ్స్ చేయి చాపి.

ఇద్దరూ కరచాలనం చేసుకున్నారు.

"మీపేరు?" అడిగాడు విలియమ్స్.

"సేట్ రాంచంద్."

"నన్ను వెతుక్కుంటూ వచ్చారంటే ఏదో అర్జంటు పని నాతో వున్నదని వూహిస్తోన్నాను."

"ఎస్. నాకు కొన్ని నగ్నచిత్రాలు—ఆయిల్ పెయింటింగ్స్ చాల అవసరంగా కావాలి. చిత్రానికి రెండువేలు అయినా సరే యివ్వగలను."

"నా వద్ద లేవు."

"అత్యవసరంగా అయినా చిత్రించండి, ప్లీజ్. నా స్నేహితుడు అమెరికా వెళ్ళిపోతున్నాడు. అతడికి బహూకరించాలి."

విలియమ్స్ ఆలోచనలో పడ్డాడు.

"నేను ఈ మధ్యనే ఒకరికి మూడు చిత్రాలు చిత్రించి యిచ్చాను. ఆయన తిరిగి యిస్తే మీకు ఇస్తాను."

"ఆయనకో...."

"మరల పెయింట్ చేస్తాను."

"ఆల్‌రైట్ అడ్వాన్సు యివ్వనా?"

"వద్దు. డబ్బు మొత్తం సాయంకాలానికి సిద్ధంచేయించండి."

సేట్ రాంచంద్ కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు.

12

"ఈ తైలవర్ణ చిత్రాలతోపాటుగా వాటిని ఫోటో తీసిన నెగటివ్స్ యిచ్చెయ్యకూడదా?" ప్రాధేయపడ్డాడు విలియమ్స్.

కమలవాసిని నవ్వింది.

"చట్టం చేతులు పొడుగయినవో, కావో తెలియదు

కాని పోలీసులు నిన్ను మరీ బాధపెడితే నా విషయం చెప్ప వని హామీ యేముంటుంది? అందుకే నెగటివ్స్ నా దగ్గరే వుంటాయి.”

విలియమ్స్ నిరుత్సాహంగా తైలవర్ణచిత్రాల పేకెట్‌తో వెనక్కి తిరిగాడు.

సేట్ రాంచంద్ తలుపు దగ్గర నిలబడివున్నాడు. అతడి రెండుచేతుల్లో రెండు పిస్తోళ్ళు మెరుస్తున్నాయి.

“రాంచంద్!” నివ్వెరపోయాడు విలియమ్స్.

“కాదు ఇన్‌స్పెక్టర్ గోపాల్!” నవ్వాడు రాంచంద్‌గా వ్యవహరించిన గోపాల్.

కమలవాసిని చటుక్కున విలియమ్స్‌ను ముందుకి తోసింది. విలియమ్స్ బాలెన్స్ తప్పి గోపాల్‌మీద పడ్డాడు. గోపాల్ ప్రక్కకి తప్పుకుని బయటకి గెంతి తలుపు దగ్గరగా లాగి గొళ్ళెం పెట్టాడు.

కమలవాసిని ఏడుస్తోంది.

13

“కేసు రెండురోజులలో పరిశోధించారు. చాల నైపుణ్యంగా పరిష్కరించారు. ఎలా సాధ్యపడిందో మొదట నుండి వివరంగా చెప్పండి” అన్నాడు పోలీస్ కమీషనర్.

డిటెక్టివ్ శిరీష్, గోపాల్ మొహాలు చూసుకున్నారు.

శిరీష్ కళ్ళతో సైగచేసాడు.

గోపాల్ నవ్వి, “రాజభూషణం కేవలం ప్రకృతి దృశ్య చిత్రీకరణ కోసం నెలకు వెయ్యిరూపాయలమీద విలియమ్స్‌ను నియమించుకొని వుండడనిపించింది. రాజభూషణంలో కామప్రకోపం వెర్రితలలు తొక్కింది. ఫలితంగా నగ్నచిత్రాల సేకరణలో పడ్డాడు. డబ్బు ఖర్చైపోయి వుంది. వారసులు లేరు. భార్యవలన సుఖంలేదు.

అంతగా ఆదాయంలేని కళాకారుడు విలియమ్స్ అతడి దృష్టిలో పడ్డాడు. అతడిని తనకి అనుకూలంగా వాడుకోవాలని ప్రయత్నించాడు.

కమలవాసినికి విలియమ్స్ మంచి ఆసరాగా దొరికాడు. రాజభూషణాన్ని హతంచేస్తే ఆ నేరం సులువుగా విలియమ్స్ మీదకి తోసెయ్యవచ్చు. పథకం వేసింది. నగ్న చిత్రాల విషయంలో అతడిని బెదిరించి తనవేపు తిప్పుకుంది.

ఆరోజు తెల్లవారుజామున నిద్రపోతోన్న రాజభూషణాన్ని అతని తుపాకీతో కాల్చి చంపారు. బాగా దగ్గరగా తుపాకి పేల్చడంతో, తూటా శరీరంలోంచి బయటకిపోయి బెడ్‌లో ఇరుక్కుంది. శవం గాయంలో విలియమ్స్ ఇంటి నుంచి ఎత్తుకువచ్చిన కత్తిని గుచ్చి సర్వేతోటలో పారవేసింది అతనికి తెలియకుండా.

విలియమ్స్ రాసిన వుత్తరం, కత్తి శవం వద్ద దొరికినప్పటికీ విలియమ్స్ దంపతులు కంగారు పడలేదు. అంటే హత్యచేసినవారి గుప్పెటలో వాళ్ళు యిరుక్కున్నారన్న మాట. ఏ రకంగా అని ఆలోచిస్తే విలియమ్స్‌ను రాజభూషణం వాడుకోగలిగిన మార్గం గుర్తొచ్చింది. అంటే నగ్నచిత్రాల పని.

విలియమ్స్ ఇంటిచుట్టూ దర్యాప్తు చేసి అతడి యింటికి కాల్‌గర్ల్‌గానీ మోడల్ గర్ల్‌గానీ ఈ మధ్య కాలంలో రాలేదని తెలుసుకున్నాం. అంటే విలియమ్స్ నగ్నచిత్రాలు చిత్రించివుంటే రోజీనే మోడల్‌గా వాడుకున్నాడని అర్థమయింది. నగ్న తైలవర్ణచిత్రాల బేరంతో నేను విలియమ్స్‌నీ, కమలవాసినినీ రెడ్‌హాండెడ్‌గా పట్టుకున్నాను" చెప్పడం ముగించాడు గోపాల్. □

మల్లాది వెంకటకృష్ణమూర్తి

టైం రివాల్వర్

ప్రైంమినిస్టర్, అమెరికానుంచి వచ్చిన ఆ దేశ ప్రెసిడెంటుతో, గత నాలుగురోజులుగా జరిపిన చర్చల ఫలితంగా, భారతదేశం అమెరికాల మధ్య ఆర్థిక, సైనిక వ్యవసాయ రంగాలలో కుదుర్చుకున్న ఒప్పందాల తాలూకు టైప్‌చేసిన అగ్రిమెంట్లమీద భారతప్రధాని, అమెరికన్ అధ్యక్షుడు ఆ రోజు సంతకాలు పెడుతున్నారు.

ఉదయం పదకొండున్నరకి సంతకాలు జరుగుతాయని ప్రైంమినిస్టర్ సెక్రటేరియట్‌నుంచి అంతకు ముందురోజే ప్రెస్‌నోటు విడుదల చేయబడింది.

ప్రజలు, కొద్దిమంది ప్రతిపక్ష సభ్యులుకూడా అందుకు హర్షం వెలిబుచ్చారు. ఆ సంతకాలు భారతప్రధాని కార్యాలయంలో జరుగుతాయి.

ఇండియన్ న్యూస్‌రివ్యూ కెమేరామేన్, అమెరికన్ ప్రెసిడెంటు వెంట ఆయన టూర్‌ని కవర్‌చేయడానికి వచ్చిన అమెరికన్ ప్రభుత్వ కెమేరామేన్, రెండుదేశాల టెలివిజన్ కెమేరామేన్‌లు, అమెరికన్ రాయబారి, రాయబారి కార్యాలయంలోని కొందరు వున్నతోద్యోగులు, భారత ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వశాఖలోని వున్నతోద్యోగులు మొదలయిన వాళ్ళతో ఆ విశాలమైన హాలు కోలాహలంగా వుంది.

అమెరికన్ ప్రెసిడెంటు భారతదేశ అధ్యక్షుడిని చూడటానికి రాష్ట్రపతి భవనానికి వెళ్ళి సరిగ్గా పదకొండూ ఇరవైకి భారతప్రధాని కార్యాలయంలోని ఆ హాలుకి చేరుకున్నాడు.

భారతప్రధాని, అమెరికన్ అధ్యక్షుడు తమతమ కుర్చీలలో కూర్చున్నారు. వాళ్ళు సంతకం చేయాల్సిన అగ్రిమెంట్లు వాళ్ళముందు ప్లాస్టిక్ ఫైళ్ళలో బల్లమీదున్నాయి.

వివిధ పత్రికలనుంచి వచ్చిన ఫొటోగ్రాఫర్‌లు కెమేరాలు క్లిక్ మనిపిస్తున్నారు. న్యూస్‌రీల్ విభాగంనుంచి వచ్చిన వారు, టెలివిజన్ కెమేరామెన్‌లు తమ మూవీ కెమేరాలను సిద్ధంగా వుంచారు.

రెండుదేశాలకి చెందిన అంగరక్షకులు, సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అప్రమత్తంగా వున్నారు.

భారతప్రధాని వెనకాల కొద్దిదూరంలో నిలబడివున్న భారత సీక్రెట్ సర్వీస్ ఉద్యోగి కెప్టన్ ఉత్పల్ అనుమానంగా తన వెనకవైపుకి తిరిగి చూసాడు.

ఏదో అనుమానం వేసి ఏడెనిమిది అడుగుల వెనక గోడకున్న అలమారు దగ్గరకి వెళ్ళాడు.

విశాలంగావున్న ఆ అలమారకి తలుపులేదు. ఆ అలమారలో వివిధ దేశాలవాళ్ళు భారతప్రధాని ఆయా దేశాలకి టూర్ వెళ్ళినప్పుడు బహూకరించిన చేతిబొమ్మలు అందంగా అమర్చబడి వున్నాయి.

వాటిముందు ఆగి ఆ బొమ్మలని పరిశీలనగా చూడ సాగాడు వుత్పల్.

ఆ హాల్లోని రెండుదేశాల గూఢచారి శాఖకు చెందిన వుద్యోగుల దృష్టి వుత్పల్‌మీద పడింది. అమెరికన్ రాయబారికూడా తలెత్తి చూసాడు అతనివంక.

ఉత్పల్ ఆ బొమ్మల మధ్యవున్న ఓ జపాన్ బొమ్మని చేత్తో యెత్తాడు. కాగితంగుజ్జుతో చేసిన ఆ సన్నటిబొమ్మ వెనకాల చిన్న టైంపీస్ అందరి కంటా పడింది. పదకొండూ ఇరవై యేడు చూపిస్తోంది టైం.

చాలామంది వులిక్కిపడ్డారు. ఓ టి. వి. కెమేరామేన్ కెమేరా స్విచ్ ఆన్‌చేసి అటువైపు తిప్పాడు కెమేరాని.

అంతా వులిక్కిపడింది ఆ జపాన్‌బొమ్మ వెనకవున్న గడియారాన్ని చూసికాదు. అది మామూలుగా అందరి ఇళ్ళలో వుండే గడియారం లాంటిదే.

కాని ఆ గడియారం కిందనుంచి కనబడుతోన్న రివాల్వర్ బేరల్‌నుచూసి. ఆ గడియారం కిందనుంచి ఓ రివాల్వర్ బేరల్ గురిపెట్టబడుంది. సరిగ్గా అది అమెరికన్ ప్రెసిడెంటు వీపుకి గురిపెట్టబడివుంది.

క్షణం ఆలశ్యం చేయకుండా, మెరుపులా వుత్పల్ ఆ బేరల్ని వెనక్కి, గోడవైపుకి తిప్పాడు. గడియారం కూడా బేరల్తో పాటుగా వెనక్కి తిరగడంతో గడియారం వెనక భాగం అందరికంటా పడింది. గడియారం వెనక భాగం తెరచి వుంది. అందులోంచి కొన్ని తీగలు గడియారం క్రిందిభాగంలో అమర్చబడున్న రివాల్వర్ ట్రిగర్కి కట్టివున్నాయి.

రివాల్వర్ ట్రిగర్కున్న ఆ తీగలని తెంపేసాడు వుత్పల్. ఈలోగా మిగతా గూఢచారులు దానిచుట్టూ గుమికూడారు.

ఉత్పల్ గబగబా మిగతా బొమ్మలుకూడా ఎత్తిచూసేడు. కాని వాటివెనక అలాంటివేం లేవు.

ఆ హాల్లోని అందరి దృష్టి ఆ టైం రివాల్వర్ మీద పడింది. అమెరికన్ ప్రెసిడెంటు మొహంలో ఆశ్చర్యం కొద్దిపాటి భయం తొంగి చూసాయి. భారతప్రధాని లేచి గబగబా ఆ గడియారం దగ్గరకి వెళ్లాడు.

"ఇది సరిగ్గా పదకొండున్నరకి పేలేలా అమర్చారు. ఎవరో అమెరికన్ ప్రెసిడెంటుని కాల్చి చంపడానికి కుట్ర పన్ని దీన్ని ఆయనవీపుకి సూటిగా దాచి వుంచారు" చెప్పాడు ఉత్పల్ ఆ గడియారాన్ని జాగ్రత్తగా పరిశీలించి.

అక్కడున్న సీక్రెట్ ఏజెంట్సు అందరూ ఆ పరికరాన్ని పరిశీలించారు. పెద్దగండం తప్పి పోయినందుకు అందరూ వూపిరి పీల్చుకున్నారు.

"నా తరఫున, నా దేశం తరఫున మీకు క్షమాపణ చెప్తున్నాను. నా కార్యాలయంలోనే మిమల్ని హత్యచేయడానికి యెవరో పన్నాగం పన్నారు. అతి త్వరలో ఆ దుర్మార్గులని పట్టుకుని తగిన శిక్ష విధిస్తాము. ఐయామ్ సో

సారీ ఫర్ వాట్ హేపెండ్." భారతప్రధాని కొద్దిగా బాధగా చెప్పాడు అమెరికన్ అధ్యక్షుడికి.

కెమేరాలలోని రీళ్లు చకచకా తిరుగుతున్నాయి. మిగతా గూఢచారులు గబగబా ఆ గదిలోని ఇతర వస్తువులను వెదకసాగారు.

పావుగంట తర్వాత, అనుకొన్న దానికన్నా పదిహేను నిముషాలు ఆలస్యంగా వప్పందాలమీద సంతకాలు జరిగాయి.

కొందరు ప్రెస్ రిపోర్టర్లు బయటకి పరిగెత్తారు అమెరికన్ ప్రెసిడెంటుమీద జరిగిన హత్యాప్రయత్నం గురించి న్యూస్ పేపర్లకి టెలిఫోన్ చేయడానికి.

కొందరు రిపోర్టర్లు ఉత్పల్‌ని ప్రశ్నలడగ సాగారు.

"మీరెలా వూహించారు జపాన్ బొమ్మ వెనకాల ఆ రివాల్వర్ వున్నదని?"

"నేను వూహించలేదు. గడియారం టిక్, టిక్‌మనే శబ్దం వినిపించి నాలో అనుమానం రేకెత్తించింది___"

"మరి యెలా కనుక్కున్నారు ఆ సంగతి?"

"నా దృష్టి ఈ గదిలోని ప్రతిమనిషిమీద, ప్రతీ వస్తువు మీదా వుంది. ఎక్కడయినా ఏదయినా మార్పు కానీ, అనుమానాస్పదమయిన విశేషం కానీ కనపడితే అదెందుకు జరిగిందో తెలుసుకోవటం మాకు శిక్షణ ఇచ్చేటప్పుడు చెప్పే ప్రాథమిక అంశం.

ఈ అలమారలోని బొమ్మలు చూసాక నాకు వాటిలో ఏదో మార్పు వున్నట్లు తోచింది. వెంటనే తెలుసుకోలేకపోయాను. జాగ్రత్తగా పరీక్షిస్తే ఆ జపాన్‌బొమ్మ ఎప్పుడూ వుండేస్థానంలో వుండకుండా, రెండుమూడు అంగుళాలు ఎడంపక్కకి జరిగినట్లనిపించింది. ఎందుకలా జరిగిందో తెలుసుకోవడానికి దానిదగ్గరకి వెళ్ళి ఎత్తిచూస్తే కారణం తెలిసింది."

"బొమ్మ రెండుమూడు అంగుళాలు పక్కకి జరిగిందన్నారు. ఆ కాస్త మార్పుని ఇంత త్వరగా గమనించగలిగారంటే, ఈ హాల్లో ఏ వస్తువులు ఎక్కడ వున్నాయో మీకు గుర్తేనా?"

"బాగా గుర్తు. ఇవాళ వుదయమే నేను, మరో ఇద్దరు ఈ హాలుని పూర్తిగా తణిఖీ చేసాము ఎలాంటి బాంబులు, మారణాయుధాలు లేవని నిర్ధారణ చేసుకోడానికి."

"ఇది యెవరి పనయివుండచ్చని మీ అభిప్రాయం?"

"నాకెలాంటి అభిప్రాయం లేదు."

ప్రైమ్‌మినిష్టర్‌ని ప్రశ్నించారు కొందరు.

"అమెరికన్ ప్రెసిడెంట్‌ని మీ కార్యాలయంలో, మీరు పక్కనుండగా హత్యచేసే ప్రయత్నం జరిగింది. దీనిమీద మీ అభిప్రాయం?"

"ఇది చాలా అవమానకరమైన పరిస్థితి. ఇలా జరిగినందుకు బాధపడుతున్నాను."

అమెరికన్ ప్రెసిడెంట్‌ని అడిగారు కొందరు.

"కొన్ని నిముషాల క్రితమే మీరు మృత్యువుని తప్పించుకున్నారు కదా. మీ కెలా అనిపించింది?"

చిన్నగా నవ్వి చెప్పాడు ఆయన.

"ఇది నాకు కొత్తకాదు. నిజానికి ప్రెసిడెంట్ పదవిలో వున్న ప్రతివ్యక్తికీ సంవత్సరానికి దాదాపు వెయ్యిసార్లు చంపుతామని బెదిరించే వుత్తరాలు వస్తుంటాయి. కానీ విదేశంలో నా మీద యిలాంటి ప్రయత్నం జరగడం ఇదే మొదటిసారి."

మర్నాడు ఉదయం పేపర్లో ఆ వార్త హెడ్‌లైన్స్‌లో వచ్చింది. ఒక్క భారతదేశంలోని పేపర్లలోనే కాదు. ప్రపంచంలోని అన్ని వార్తా పత్రికల్లోనూ ఆ వార్త ప్రముఖంగా ప్రచురించారు.

భారత ప్రధాని 'సెంట్రల్ ఇంటలిజెన్స్ బ్యూరో' డైరెక్టర్‌ని పిలిచి, త్వరగా ఆ టైం రివాల్వర్‌ని అక్కడ అమర్చిన దోషులని పట్టుకోవలసిందిగా కోరాడు.

* * *

సెంట్రల్ ఇంటలిజెన్స్ బ్యూరోలోని స్పెషల్ సెల్‌లో పనిచేసే కమాండర్ చంద్రకాంత్‌కి ఆ కేసు అప్పగించబడింది. విపులంగా ఆ కేసంతా పరిశీలించాడు చంద్రకాంత్.

బయట బజారులో ఏ షాపులోనైనా దొరికే ఫేవర్ లూబా టైంపీస్ అది.

గడియారానికి అమర్చబడ్డ రివాల్వర్ సర్వీస్ రివాల్వర్. ఆర్మీలో పనిచేసే కల్నల్స్ వుపయోగించే రివాల్వర్ అది. సైనికుల్లో ప్రభుత్వంపట్ల అసంతృప్తి ఏర్పడి ఈ పన్నాగం పన్నారా!

ప్రైమ్‌మినిష్టర్ కార్యాలయంలోని ఆ హాల్లోకి ఆ రోజు వెళ్ళిన వ్యక్తుల జాబితాని చదివాడు. అందరూ గౌరవ నీయులుగానే కనిపించారు. వాళ్ళల్లోనే వుండాలి ఆ ద్రోహి.

చంద్రకాంత్ ఆ రోజు, అంతకు ముందురోజు ఆ వ్యక్తులంతా ఎక్కడెక్కడికి వెళ్ళారో, ఎవరెవరిని కలుసుకున్నారో ఆరా తీయడానికి గూఢచారులని నియమించాడు. ధనానికి ఆశపడో లేదా బ్లాక్‌మెయిల్ చేయబడో ఈ పని వాళ్ళలో యెవరయినా చేసే అవకాశం వుంది.

తర్వాత సర్వీస్ రివాల్వర్ నంబర్‌నిబట్టి అది యెవరికి యివ్వబడిందో వాకబు చేసాడు డిఫెన్స్ డిపార్టుమెంట్‌లో.

గూర్ఖా దళానికి చెందిన ఓ కల్నల్‌కి అది నాలుగు సంవత్సరాల క్రితం యివ్వబడింది. రెండు సంవత్సరాల క్రితం పాకిస్థాన్ బార్డర్‌లో యెదురు మదురుగా జరిగిన కాల్పులలో అతను మరణించాడు. అతని రివాల్వర్ ఏమయిందో తెలియదు. శవందగ్గర లేదు. టెలెక్స్‌ద్వారా గౌహతిలోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ నుంచి ఈ సమాచారం అయిదారు గంటల్లో చేరింది చంద్రకాంత్‌కి.

చంద్రకాంత్ ఫేవర్‌లూబా గడియారం మీదవున్న సీరియల్ నంబర్‌ని నోట్ చేసుకుని ఆ కంపెనీ రీజినల్ సేల్స్ ఆఫీస్‌కి వెళ్ళాడు.

వాళ్ళ రికార్డ్స్ తిరగేసి అది ఢిల్లీలోని చాణక్యపురి ప్రాంతంలో వున్న ఓ వాచ్ డీలర్ షాప్‌కి అమ్మకానికి నెలక్రితం పంపబడిందని తెలుసుకున్నాడు. తర్వాత చాణక్యపురిలోని ఆ దుకాణానికి వెళ్ళాడు. అది రెండు రోజుల క్రితమే యెవరికో అమ్మబడిందని చెప్పాడు దుకాణదారు. బిల్లులో కొన్నవారి పేరు రాయలేదు.



"మొగా? ఆడా?" అడిగాడు చంద్రకాంత్.

"మొగే."

"ఎలా వుంటాడు?"

"సుమారు ముప్పై అయిదేళ్ళుంటాయి మిలట్రీలో పని చేసిన వాడిలా వున్నాడు."

"అతని ఫోటో చూపిస్తే గుర్తుపట్టగలరా?"

"తప్పకుండా."

చంద్రకాంత్ మళ్ళీ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్‌కి వెళ్ళాడు సరాసరి. తనకి కావలసిన సమాచారం అడిగాడు.

"నాలుగైదు గంటల్లో ఆఫీస్‌కి పంపిస్తాను" చెప్పారు.

తిరిగి తన ఆఫీస్‌కి చేరుకున్నాడు. అమెరికన్ ప్రెసిడెంట్ మర్నాడు మధ్యాహ్నం వాషింగ్‌టన్ వెళ్ళిపోతాడు. ఈ లోపలే దోషులని పట్టుకోవడానికి ప్రయత్నించవలసిందిగా కమాండర్ చంద్రకాంత్‌ని కోరాడు సి. ఐ. బి. డైరెక్టర్.

రాత్రి పదింటికి డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ నించి చంద్ర కాంత్‌కి కావలసిన సమాచారం వచ్చింది.

ఆ రివాల్వర్ తాలూకు కల్నల్ వున్న రెజిమెంట్‌లోని సైనికుల జాబితా అది. జాగ్రత్తగా ఆ లిస్ట్ చదివాక ఆ లిస్ట్‌ని హత్యాప్రయత్నం జరిగిన హాల్లోకి వెళ్ళిన వ్యక్తుల జాబితాతో పోల్చి చూసాడు. చిన్నగా ఈల వేసాడు.

గంట తర్వాత చాణక్యపురిలోని గడియారాల షాపుకి చేరుకున్నాడు. చంద్రకాంత్ చూపించిన ఫోటోగ్రాఫ్‌లోని వ్యక్తిని గుర్తుపట్టాడు ఆ దుకాణాదారు. అతనే వచ్చి ఆ గడియారం కొన్నది.

చంద్రకాంత్ సరాసరి పి. బి. ఐ. డైరెక్టర్ ఇంటికి చేరుకున్నాడు.

"ఏమయినా ప్రోగ్రెస్ వుందా?" అడిగాడు ఆయన చంద్రకాంత్‌ని.

"యస్ సర్. దోషి దొరికాడు."

"ఎవరు?"

"ఉత్పల్?"

"ఉత్పల్ ....?"

"అవును సర్. పి. యం. సెక్యూరిటీ చూడాల్సిన ఉత్పల్ పని యిది."

"అతను బాధ్యతగల మనిషి. పైగా మన డిపార్ట్‌మెంట్‌కి చెందిన వ్యక్తి. అతనే ఆ గడియారాన్ని కనుక్కున్నది కూడా. అతనెలా దోషి అవుతాడు?"

"నేనూ ముందు అలాగే అనుకున్నాను. కాని నాకు ఓ కారణం కనిపిస్తోంది. అమెరికన్ ప్రెసిడెంట్‌ని మరణం నించి కాపాడితే ప్రమోషన్, డిపార్ట్‌మెంట్‌లో గుర్తింపు, తోటివుద్యోగులలో గొప్పతనం అతన్ని పనికి దారి తీపి

వుంటాయి."

పి. బి. ఐ. డైరెక్టర్ మొహంలో కొంతసేపు కోపం నాట్యం చేసింది.

"ఆ రివాల్వర్ గూర్ఖా రెజిమెంట్‌కి చెందిన ఓ కల్నల్‌ది. ఆయన మరణించాడు. ఆ రివాల్వర్‌ని అప్పుడు ఆ రెజిమెంట్‌లో పనిచేసే ఉత్పల్ కొట్టేసి వుంటాడు. ఆర్మీనుంచి అతను సి. బి. ఐ.లో చేరాడు. పైగా ఆ గడియారాన్ని ఉత్పల్‌కి అమ్మిన దుకాణదారు సాక్ష్యంవుంది. ఆ హాల్లోకి అతితేలికగా దాన్ని ప్రవేశపెట్టగల సమర్థత అతని దగ్గర వుంది. అతన్ని ఎవరూ చెక్ చేయరు."

"షేమ్‌ఫూల్" అన్నాడు సి.బి.ఐ. డైరెక్టర్.

తర్వాత టేబిల్‌మీదవున్న రిసీవర్‌ని అందుకున్నాడు. □

అపనలో తన పేరు??

"నా పేరు ప్రతినెలా అపనలో పడుతుంది తెలుసా?"

"మీరు కార్టూనిస్టా?"

"కాదు....!"

"మరి ఉత్తరాల్రావా?

"అబ్బే—లేదండి!!"

"మరి, మీ పేరెలా పడుతుంది?"

"ఆ పత్రిక ఎడిటర్ పేరు, నా పేరు ఒకటే కదా....!"

—మారిశెట్టి రామమూర్తి, సిర్పూర్ కాగజ్‌నగర్.

మూడేళ్లనాటి హత్య

ఏ.వీ.మోహన్రావ్

బంగళా ముందున్న లాన్‌లో కుర్చీ వేసుకుని, సిగరెట్ కాలుస్తూ, క్రైమ్ జర్నల్ తాపీగా చదువుకుంటు న్నాడు డిటెక్టివ్ సుధాకర్. అక్కడకు దగ్గరగా వున్న గేటు దగ్గర దర్వాను యెవర్నో గదమాయిస్తున్నట్లు, లీలగా విని పించింది. లేచి చూసాడు. గేటు పతలవేపు ఒక ముస లావిడ కనిపించింది.

అక్కడ్నుంచి గేటువేపు నడచి వెళ్ళాడు.

"నమస్తేసార్!" అన్నాడు దర్వాను.

"ఏమిటి గొడవ?"

"ఈమెవరో మిమ్మల్ని చూడాలని పట్టుదలగా నిలబడింది. బాబుగారు యిప్పుడు యెవర్నీ చూడరు. ఉదయం వారి ఆఫీసుకు వెళ్ళమంటే వినటంలేదు. అరగంట నుంచి నన్ను సతాయిస్తోంది సార్" అన్నాడు దర్వాన్.

"బాబూ! దినదినగండం నూరేళ్ళ ఆయుస్సులా వుంది నా వ్యవహారం. రేపటిదాకా వుంటానో వుండనో? అయ్యగార్ని చూడాలని వచ్చాను. వీడు రాక్షసుడిలా అడ్డు పడుతున్నాడు" అందామె ఎక్కసంగా.

"ఆయనే అయ్యగారు!" చెప్పాడు దర్వాన్.

"నమస్తే బాబూ!" అందామె.

"మీ కేం కావాలి?" అడిగాడు సుధాకర్.

"మీ సాయం!" అందామె.

"లోపలకు రండి!" అన్నాడు.

ముసలామె లోనికి వచ్చింది. ఆమెను లాన్‌లోకి తీసుకెళ్ళాడు. తను కూర్చున్న కుర్చీకెదురుగా వున్న ఇంకొక కుర్చీ చూపించాడు ఆమెకు. ఆమె మొహమాటపడుతూ క్రిందే కూర్చుంది. సుధాకర్ కూడా, తన కుర్చీని వెనక్కి త్రోపి ఆమెకు యెదురుగా, పచ్చగడ్డిపైన చతికిలబడ్డాడు.

"చెప్పమ్మా!"

"నేను పేదరాల్ని. పెళ్ళయ్యాక రెండేళ్ళకు భర్త పోయాడు. రెక్కలు ముక్కలుచేసుకొని, అస్తులు అరగదీసుకుని, నా బిడ్డను పెంచి పెద్దచేశాను. వాడు చేతికింద వచ్చాడుగదా, నా కష్టాలు గట్టెక్కినట్లేనని అనుకున్నాను. ఇంతలో వాడు కాస్తా ఒక హత్యకేసులో ఇరుక్కున్నాడు.

హత్య వీడే చేసినట్లు రుజువయిందని, వాడికి అజన్మ ఖైదీ వేసారు. వాడు జైల్లో వున్నాడు. నేను బైట వున్నాను" అందామె.

"ఎన్నాళ్ళయింది నీ కొడుకు జైలుకెళ్ళి?"

"మూడేళ్ళయింది?"

"అప్పుడు రాలేదేం?"

"ఎర్ర ఏగాని లేదు. నా మొహం ఎవరు చూస్తారు?" అంది కోపంగా ఆ ముసలావిడ.

"ఇప్పుడు మాత్రం ...."

"మీలాంటి వాళ్ళకు ఇచ్చేపాటి ఫీజు సంపాదించాను. అందుకే ధైర్యంగా వచ్చాను."

"ఏ మాత్రం వుందేమిటి?" అడిగాడు సుధాకర్.

"ఐదువేలు వుంది? చాలదా బాబూ?" ఆతృత ఆమె కంఠంలో వినిపించింది, మొహంలో కనుపించింది.

"ఎలా సంపాదించావ్?"

"అంట్లుతోమి, పిండిరుబ్బి, తిండి మానేసి...." అంటూండగానే, సుధాకర్ మనస్సు వికలమయిపోయింది. అంత పెద్ద వయస్సులో, ఆమెపడ్డ కష్టం తలపుకువచ్చి, అతను అవాక్కయిపోయాడు.

"కోర్టులో మీ అబ్బాయి హత్య చేసినట్లు ఋజువుచేసారనీ, అతన్ని జైల్లో వేసారనీ, నువ్వే చెప్పావు. అతను హత్య చెయ్యలేదని నిరూపించే సాక్ష్యమేదైనా వుందా నీ దగ్గిర" అడిగాడు సుధాకర్.

"ఉంది!" అంది దృఢంగా.

"ఏమిటది?"

"వాడ్ని కని పెంచి, పెద్దచేసిన నా తల్లి మనసు" అందామె.

దాన్ని ప్రామాణికంగా తీసుకోవటం సాధ్యం కాదనే విషయం చెప్పేందుకు సుధాకర్‌కు మనస్కరించలేదు. ఆమె పట్టుదల, నమ్మకం, గుర్తొచ్చి, ఒకవేళ ఆ అబ్బాయి నిర్దోషేమోనన్న అనుమానం కలిగింది.

"మీ అబ్బాయి పేరేమిటి?"

"మునెయ్య."

"ఎవర్ని హత్య చేసాడని ఆరోపించారు'"

"పోలీసు సాంబయ్యను."

సుధాకర్‌కు ఆ కేసు వెంటనే గుర్తుకొచ్చింది. "మీరు రెండ్రోజులయ్యాక రండి. నా శాయశక్తులా కృషిచేస్తాను" అన్నాడు సుధాకర్.

"డబ్బు తెచ్చాను" అందామె.

"అవసరంలేదు. నేనంత పేదవాణ్ని, మనసులేనివాణ్ని కాదు. ఆ డబ్బు దాచి వుంచండి. మీ అబ్బాయి నిర్దోషి అని ఋజువయితే, విడుదలవుతాడు. వెలుపలకొచ్చాక, అతని జీవితానికొక మార్గం చూపించడంలో ఆ డబ్బు ఉపయోగపడుతుంది" అన్నాడు సుధాకర్.

"నిన్ను భగవంతుడు చల్లగా చూడాలి!" అందా ముసలామె.

ఆమె ఇంటి విలాసం, వివరాలు అడిగి తెలుసుకొని, గేటు దాకా సాగనంపి వచ్చాడు సుధాకర్.

2

సుధాకర్ పోలీస్ కానిస్టేబుల్ సాంబయ్య హత్యకేసుకు సంబంధించిన, వివరాలన్నీ, పాత పేపర్ల కటింగ్సులో నుండి తీరిగ్గా రెండుగంటలు కష్టపడి సేకరించాడు.

రాజమ్మ సారా దుకాణంలో సాయంత్రం కూర్చుని వున్న పోలీస్ సాంబయ్యను, అనవసరంగా హత్య చేసి

చంపినట్లు, ముసలావిడ కుమారుడైన మునెయ్యమీద కేసు బనాయించబడింది. రాజమ్మతోపాటు, మరో యిద్దరు ఖాతా దారులు కూడా, మునెయ్య హత్య చెయ్యడం కళ్ళారా చూసామని సాక్ష్యం చెప్పారు. దాంతో అతని నేరం ఋజువయింది. కోర్టు అతనికి ఆజన్మఖైదు విధించింది.

మూడేళ్ళనాటి కేసును తిరిగి త్రవ్వాలంటే, కొంత జాగ్రత్త, యెక్కువ వోర్పు అవసరమనిపించింది సుధాకర్‌కు.

రాత్రి తొమ్మిదయ్యాక బట్టలు మార్చుకొని, రోజూ సారా పట్టే గిరాకీలా తయారైనాడు సుధాకర్. కారెక్కి, రాజమ్మ దుకాణంవేపు పోనిచ్చి, దూరంగా ఆపి, దిగి వెళ్ళాడు.

సుధాకర్ దుకాణం దగ్గరకు చేరేసరికి, బెంచీల నిండా వున్నారు జనం. ప్రతివాళ్ళ ముందూ, తెల్లటి సీసాలున్నాయి. మధ్యగా వున్న ఎత్తైన అరుగుమీద, మూడు కుండలు ముందు పెట్టుకొని వున్న మధ్యవయసు మనిషిని చూపి ఆమే రాజమ్మ అయివుంటుందని అనుకున్నాడు. ఆమె కుడిచేతివేపు పెద్ద పెద్ద అల్యూమినియం పళ్ళేలున్నాయి. వాటినిండా మిరపకాయ బజ్జీ లున్నాయి.

సుధాకర్ తిన్నగా ఆమె ముందు వెళ్లాడు.

"ఏం బాబూ! యెంత కావాలి సరుకు?" అడిగింది రాజమ్మ.

"నాటేనా? మరేమైనా వుందా?" అడిగాడు సుధాకర్ మెల్లగా.

"ఇది రాజమ్మ కొట్టు. ఎలాంటి సరుకు కావాలన్నా దొరుకుతుంది" అంది గర్వంగా, మెళ్ళో వున్న కాసుల పేరు వ్రేలితో కదలించి చూపిస్తూ.



"అయితే విస్కీ కావాలి!"

"డబ్బుందా?"

సుధాకర్ మాట్లాడకుండా జేబులోంచి డబ్బు తీసాడు. వందరూపాయల నోట్ల బొత్తి వచ్చింది. అందులోంచి ఒకటి లాగి, ఇచ్చాడు.

"చెల్లేవేనా?" అనుమానంగా అంది రాజమ్మ.

"మనం కాదు ముద్రేసింది. గవర్నమెంటు. చిల్లర తెప్పించి చూసుకో, అనుమానమైతే...." అన్నాడు సుధాకర్.

రాజమ్మ నోటును పరిశీలనగా చూసింది.

"రంగయ్యా!" అని పిలిచింది.

కోరమీసాలతో, లావుగా వున్న ఎత్తైన వ్యక్తి వచ్చి నిలుచున్నాడు రాజమ్మ ముందు.

"నువ్వీడ కూకో! నే వెళ్లి బాబుగార్ని చూసొస్తాను" అంటూ లేచి అరుగు దిగింది.

వెనకవైపు వున్న చిన్నగదిలోకి దారితీసింది రాజమ్మ.

సుధాకర్ కూడా ఆమెను అనుసరించాడు.

గూట్లో నుంచి విస్కీ సీసా, గ్లాసు, రెండు సోడాలు తీసి క్రిందపెట్టింది.

"కోడికూర కావాలా?" అడిగింది రాజమ్మ.

"వద్దు! అందమైన ఆడమనిషి వుంటే బాగుంటుంది" అన్నాడు సుధాకర్.

"ఎందుకు?" నవ్వుతూ అడిగింది రాజమ్మ.

"ఎదురుగా వుంటే అరసీసాతో ఆగేవాణ్ని. కనీసం అరింటిదాకా అన్నా పోతాను" అన్నాడు సుధాకర్.

"సీసా ఎంతో తెలుసా?"

"తెలీదు!"

"అరవై రూపాయలు" అంది రాజమ్మ.

"అయితే ఇక్కడ ఇరవై తక్కువన్నమాట."

"అ:! ఇంతకూ నువ్వేం వ్యాపారం చేస్తావ్!" అడిగింది రాజమ్మ.

"నాది ఒకరికి చెప్పే వ్యాపారం కాదు" అన్నాడు సుధాకర్.

"నాకు చెప్పు, ఫరవాలేదు" అంటూ రొమ్ములపై నుండి పైటకొంగు కాస్త క్రిందకు జార్చింది.

సుధాకర్ మందు గ్లాసులోకి వంచుతూ ఆమెను ఓరగంట చూసాడు. "చెప్తాను. కానీ ఎవ్వరికీ చెప్పకూడదు" అన్నాడు.

"అలాగే!"

"దొంగ బంగారం. వారానికి ఇరవై కేజీల బంగారం వస్తుంది. దాన్ని అమ్ముతూంటాను."

"పోలీసులు పట్టుకోరా?"

పట్టుకోరన్నట్లు అడ్డంగా తలూపాడు సుధాకర్.

"ఏ మాత్రం లాభమొస్తుంటుంది?"

"ఒక లక్ష. కానీ యిక్కడ నుంచి నేనే వేరే దేశం వెళ్దామనుకుంటున్నాను. నా వ్యాపారం నా స్నేహితుడికి అప్పగించి వేద్దామనుకున్నాను. అతనికోసం వస్తే లేడని తెలిసింది. దురదృష్టవంతుడు. అణాకు, అర్ధణాకు, అడ్డమైన చాకిరీ చేసేవాడట. ఆ తర్వాత ఏదో హత్య కేసులో చిక్కుకుని, జైలు కెళ్ళాడని తెలిసింది" అన్నాడు సుధాకర్.

"ఎవరతను?"

"మునెయ్యని. ఇక్కడేదో సారాకొట్లో పని చేసేవాడట" అన్నాడు సుధాకర్ ఆమెకేసి చూడకుండా గ్లాసులోకి చూస్తూ, గుటకలు వేస్తూ.

"అతను నా దగ్గరే పని చేసేవాడు. అమాయకుడు. చాలా నమ్మకమైనవాడు" అంది సానుభూతిగా రాజమ్మ.

"నా స్నేతుడ్ని ఆదరించి, చేరదీసింది నువ్వేనన్న మాట. వాడి కప్పగించాలనుకున్న వ్యాపారం, నీకు దత్తం చేద్దామని వుంది" అన్నాడు సుధాకర్.

"ఆడదాన్ని, నా వల్ల నవుతుందా?...." అంది రాజమ్మ.

"సరుకు నీకే చేరే యేర్పాటు చేస్తాను. కొనేవాళ్ళు కూడా ఇక్కడికే వస్తారు" అన్నాడు సుధాకర్.

"అంతా పోనూ, వారానికి యే మాత్రం మిగులుతుంది....."

"ఎంత హీనంగా వేసుకున్నా యాభయివేలు మిగులుతుంది. చాలదా?" అడిగాడు సుధాకర్.

"ఈ దుకాణం యిన్నేళ్ళనుండి నడుపుతున్నాను. పట్టుమని పదివేలు వెనకేసినట్లు లేదు. ప్రతివాడూ నన్ను

రమ్మని పిలిచేవాడే" యీసడింపుగా అంది.

"పెళ్ళి కాలేదా?"

"ఒక్కడికి కట్టుబడి వుండడం ఇష్టంలేక నేనే చేసుకో లేదా?"

"మునెయ్య ఎవర్ని హత్య చేసాడు."

"పోలీసు సాంబయ్యను."

"ఎందుకు?"

"వాడు రోజూ వచ్చి, కడుపునిండా త్రాగి, పాతిక రూపాయలిస్తేగానీ కదిలేవాడు కాదు. ఎంత చెప్పినా వినలేదు. ఒకసారి యివ్వకుంటే రైడింగ్ చేయించి, నన్ను వారంరోజులు జైల్లో తోయించాడు. మునెయ్య వాడి తతంగం చూసి, రోజూ నన్ను తిట్టేవాడు. ఊ అంటే చంపుతా అనేవాడు. నేనే వద్దన్నాను. కానీ, ఆ రోజు, సాంబయ్యకు, నాకూ మాట మాట పెరిగింది. వాడు నా పైకి దూకాడు. మునెయ్య చూడలేక, కత్తితో వాణ్ని పొడిచాడు. పారిపోయే ప్రయత్నం చేసాడు. రంగయ్య, వెంగయ్య యిద్దరూ వాణ్ని పట్టుకుని పోలీసులకు అప్ప చెప్పారు" అంది రాజమ్మ.

"నీ కోసం అంత సాహసం చేసిన నా స్నేహితుణ్ని, వాళ్ళిద్దరూ అలా పట్టుకుంటే, నువ్వు చూస్తూ ఊరకుండి పోయావన్నమాట. అది న్యాయమేనా....?" అడిగాడు సుధాకర్.

"ఇద్దర్నీ తిట్టాను. కొట్టాను. మునెయ్యని వదలమని చెప్పాను. వాళ్ళిద్దరూ అంతకుముందే రెండుసార్లు జైలు కెళ్ళి వచ్చి వున్నందువల్ల, తమను బొక్కలో తోస్తారన్న భయంతో అలా చేసారట" అంది రాజమ్మ.

"అదీ నిజమే! కోర్టులో నువ్వు కూడా సాక్ష్యం



చెప్పావా?"

"జరిగింది జరిగినట్లు చెబితే మునెయ్యని వదిలేస్తామని ఇనస్పెక్టర్ చెప్పాడు. అందుకని చెప్పాను చూపింది చూపినట్లే........" అంది రాజమ్మ అందులో తన తప్పు లేదనట్లు.

"ఎలా చంపాడు సాంబయ్యను?"

"జేబులోనుండి కత్తి తీసి, ఒక్క పోటు పొడిచాడు గుండెల్లో. అరుస్తూ క్రింద బడ్డాడు. వాడి గుండెలపై కెక్కి, దాన్ని వెలుపలకు లాగాడు. అంతలోనే రంగయ్య, వెంగయ్య వచ్చి పట్టుకున్నారు" అంది రాజమ్మ.

త్రాగడం ఆపేసి లేచాడు సుధాకర్.

"ఆరు సీసాలు త్రాగుతా నన్నావ్?" అడిగింది రాజమ్మ.

"హత్యా, రక్తం, గుర్తొస్తే మందు, దిగదు. రేపొస్తాను. వ్యాపారం సంగతి ఏమిటి?" అడిగాడు సుధాకర్.

"ఆ సాయం చేశావంటే, నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను. ఈ కొట్టు కూడా మూసేస్తాను" అంది రాజమ్మ.

3

తలుపు తట్టిన శబ్దం కావడంతో "ఎవరది?" అని అరుస్తూ లేచి తడిక తెరిచాడు రంగయ్య. ఎదురుగా ఆరడుగుల అజానుబాహు విగ్రహం, ఫుల్‌సూట్‌లో కనిపించగానే విస్తుపోయాయి

"ఎవరు బాబూ!" అడిగాడు.

"నీ మంచి కోరేవాణ్ని" అన్నాడు సుధాకర్.

"అంటే...."

"నువ్వు చేసిన హత్యను ఇన్నాళ్లు కప్పిపుచ్చిన ఒక మనిషి, ఆ రహస్యాన్ని కేవలం పదివేల రూపాయల కోసం అమ్మివేసేందుకు నిర్ణయించుకుంది. మునెయ్య విడుదల, నీ కారాగార ప్రవేశం, ఒక్కసారే అతి త్వరలో జరుగుతాయి. అది చెప్తామని వచ్చాను" అన్నాడు సుధాకర్.

"ఆ ముండ అడ్డమైన పని చేయించుకొనేందుకు బెదిరిస్తూనే వుంది. చివరకు అన్నంతపనీ చేసిందన్నమాట" అన్నాడు రంగయ్య.

"అంత తెలివితక్కువగా ఆమెకు నీ రహస్యం ఎలా పట్టిచ్చావ్?" అడిగాడు సుధాకర్.

"రక్తం పడ్డ గుడ్డల్ని విప్పి వేరేవి కట్టుకోమంది. బట్టలిచ్చాక వాట్ని దాచిపెట్టింది. దానికి తోడు సాంబయ్యను నేను పొడవడం ఆ ముండ చూస్తూనే వుంది."

"వెంగయ్య చూశాడా?"

"లేదు!"

"నువ్వెందుకు చంపావ్?"

"తన గదిలో మందు తాగుతూ, నన్ను, పిలిచి, నేను

వుంచుకుని వున్న రత్తాల్ని పిల్చుకు రమ్మన్నాడు. నాకు కోపమొచ్చింది. దాని పేరెత్తితే చంపుతా నన్నాను. సాంబయ్య మళ్ళీ అదే మాటన్నాడు. అంతే. చాకుతో పొడి చాను ఈలోగా మునెయ్య వచ్చాడు. నేను బైటపడ్డాను. అతను కత్తితో వుండగా రాజమ్మ లోనికి వెళ్ళింది. నన్ను పిలిచింది. వెంగయ్య కూడా వచ్చాడు. ఇద్దరం కలపి అతన్ని పట్టుకొన్నాం. నా బట్టలు విప్పి రాజమ్మ కిచ్చాను. పోలీసులు వచ్చారు. మున్నెయ్యను పట్టుకున్నారు" అన్నాడు రంగయ్య.

"రాజమ్మ దగ్గరున్న ఆ బట్టలు తెలివిగా నయాన్నో, భయాన్నో, తీసుకుని తగలెయ్యి. ఆ తర్వాత ఆమె ఏం చెప్పినా నమ్మరు. వెంగయ్యను కూడా వెంటబెట్టుకెళ్ళు. లేకుంటే మీ యిద్దరూ జైల్లో పడతారు" అన్నాడు సుధాకర్.

"రాజమ్మ నన్ను పట్టిస్తున్నట్లు నీ కెవరు చెప్పారు?"

"మునెయ్య తల్లి. పదివేలడిగిందది రాజమ్మ. తనదగ్గర ఐదువేలున్నాయనీ, మరో ఐదువేలు అప్పు ఇవ్వమని అడిగింది. ఎందుకంటే విషయం చెప్పింది. మా యింట్లో పని చేస్తోందామె. మునెయ్యమీద నాకు కోపం వుంది. అతను జైల్లోంచి బైటపడటం నా కిష్టంలేదు. అందుకే నీ దగ్గరకు వచ్చాను" అన్నాడు సుధాకర్.

"ఈపాటికి ఆ ముండ ఆ బట్టలు పోలీసుల కిచ్చిందేమో సార్!" అన్నాడు రంగయ్య.

"నే నింకా ఐదువేలు ఇవ్వలేదు. రేపు ఇస్తానని చెప్పాను" అన్నాడు సుధాకర్.

"అయితే నేను యిప్పుడే వెళ్తాను" అన్నాడు రంగయ్య.

"మంచిది. రేపు రాత్రికొస్తాను. ఏమైందీ చెప్పు" అంటూ చకచక వెనక్కి వెళ్ళిపోయాడు సుధాకర్ చీకట్లో కలిసిపోతూ.

4

రాత్రి పన్నెండయింది.

రంగయ్య, వెంగయ్య, రాజమ్మ కల్లుదుకాణం దగ్గరకు చేరారు. వెనుకవైపునున్న గదిలో, మంచం మధ్యగా పడు కుని వున్న రాజమ్మకు తలవేపు ఒకడు, కాళ్ళవేపు ఒకడు నిలుచున్నారు. ఇద్దరి చేతుల్లో, కత్తులున్నాయి.

"రాజమ్మా!" అరచాడు రంగయ్య.

కళ్ళు తెరచి కాళ్లవారగ నిలుచున్న రంగయ్యను చూసింది. అతని చేతిలో మెరుస్తున్న కత్తికేసి చూపి "ఏంట్రా సచ్చినోడా! ఇంత రాత్రిపూట వచ్చావ్?" అడి గింది రాజమ్మ.

"లేచి వెంటనే,నా బట్టలు ఎక్కడున్నాయో తెచ్చివ్వు?" అన్నాడు.

"ఎందుకు?"

"అవి పదివేలిస్తే పోలీసుల కిచ్చి నేను హత్య చేసిన విషయం, పబ్లిగ్గా చెప్తానని మునెయ్య అమ్మతో బేరం కుదుర్చుకున్నావట. అవి ఇచ్చెయ్యి" అరిచాడు రంగయ్య.

"నువ్వెన్ని వేలిస్తావ్?" అడిగింది రాజమ్మ.

"వంద పోట్లు పొడుస్తాను'' అన్నాడు కత్తి చూపిస్తూ రంగయ్య.

"ఇవ్వను'' అంది రాజమ్మ.

"రాజమ్మా! మర్యాదగా ఇవ్వు" తలవేపు నున్న వెంగయ్య అరిచాడు.

ఇద్దర్నీ చూచి భయంతో వణికిపోయింది.

"అంతా అబద్ధం! నేనెవ్వరికీ చెప్పలేదు!" అంది రాజమ్మ.

"చెప్పకపోయినా సరే నిన్ను నమ్మను. ఎక్కడ పెట్టావో చెప్పు!" అన్నాడు రంగయ్య.

రాజమ్మ లాభం లేదని కల్లుకుండల క్రింద నున్న అడగు ఇటుకలు తొలగించి, అందులోంచి, రక్తం కంపు కొడుతున్న రంగయ్య బట్టలు వెలికి తీసింది. అవి ఇస్తుంటే ఆమెకు, రంగయ్యలాంటి నమ్మకమైన సేవకుణ్ణి పోగొట్టుకొన్నట్లనిపించింది.

రంగయ్య బట్టలు తీసుకుని చూసుకుంటూండగా, నాలుగువేపుల నుండి పోలీసులు వచ్చి చుట్టుముట్టారు. వాళ్ళతో వున్న సుధాకర్‌ను చూచి రంగయ్యా, రాజమ్మా విస్తుపోయారు.

"ఆయనెవరు?" ఇద్దరూ అడిగారు ఒక్కసారే.

"ప్రఖ్యాత డిటెక్టివ్ సుధాకర్" చెప్పాడు యస్. ఐ. అర్ధంగాక తెల్లమొహం వేశారు.

ఒక అమాయకురాల, మనస్సాక్షి, ఆధారంగా, సాగించిన పరిశోధన ఫలించడం, సుధాకర్‌కు ఎంతో ఆనందం కలిగించింది. □

"ధనయోగం?"

జ్యోతిష్కుడు: మీ ఇంటికి త్వరలోనే ధనం వచ్చే యోగముంది. లాటరీ టిక్కెట్లు ఏమైనా కొన్నారా?

సోమనాధం: నా మొఖం! మొన్ననే రెండులక్షలకు లైఫ్ ఇన్సూరెన్సు చేయించుకున్నాను.

—బి.పి.ఆర్.ఆర్. అరుణశ్రీ, కరీంనగర్.

వెట్టిచాకిరీ వాసన

వసుంధర

"ఎదురింట్లో ఏదో కలకలంగా వున్నట్లుంది" అన్నాడు వెంకన్న.

"నేనువెళ్ళి తెలుసుకు వస్తాను బాస్!" అంది సీతమ్మ.

"ఊఁ" అన్నాడు వెంకన్న.

"అమ్మయ్య—నువ్వు వెడితే కాసేపు బాస్‌తో ఏకాంతంగా మాట్లాడుకోవచ్చు...." అంది రాజమ్మ. సీతమ్మ

మూతి మూడువంకర్లు తిప్పి అక్కణ్నించి బయటకు వెళ్ళింది.

"మిస్ రాజమ్మా! నీకు నాతో ఏకాంతంగా మాట్లాడా లని కోరికగా వుంటుందా?" అన్నాడు వెంకన్న కుతూహ లంగా ఆమె ముఖం వంక చూస్తూ.

"అవును బాస్!"

"అయితే మాట్లాడు—వింటాను!" అన్నాడు వెంకన్న అరమోడ్పు కన్నులతో.

"బాస్! డిటెక్టివుగా మీరు రెండుచేతులా సంపాదిస్తు న్నారు. మీ అసిస్టెంట్సుగా మాకూ యెంతో కొంత పేరు ప్రఖ్యాతులు వస్తున్నాయి. అయితే నాకు ఒక్కటే బాధ!"

"ఏమిటది?" అన్నాడు వెంకన్న కుతూహలంగా.

"అన్నిట్లోనూ మీరు మమ్మల్నిద్దర్నీ సమానంగానే చూస్తున్నారు. నిజానికి నాకు సీతమ్మకంటె శక్తిసామర్ధ్యా లెక్కువ. ఆ విషయం మీకూ తెలుసు. అందుకని ఆమె కంటె నాకు ఎంతో కొంత—అంటే ఆఖరికి ఒక్కరూపా యైనా సరే సీతమ్మకంటె జీతం ఎక్కువిప్పించాలి!" అంది రాజమ్మ.

"ఇదా నువ్వు నాతో ఏకాంతంగా మాట్లాడాలనుకున్న విషయం?" అంటూ వెంకన్న నిట్టూర్చి ఏదో అనబోయేం తంలో సీతమ్మ ప్రవేశించి—"బాస్! ఎదురింట్లో దొంగ తనం జరిగింది. విలువయిన బంగారునగలు, వెండిసామాను కొంత డబ్బు పోయాయి. నిన్నటి రోజున వాళ్ళింటికి బంధువు వచ్చాడట. ఆయన ఏదో పనిమీద కూడా అయిదు వేల రూపాయల క్యాషు తెచ్చాడట. ఆ డబ్బుకూడా పోయింది" అంది.

''ఇంతకీ దొంగతనం ఎలా జరిగింది?'' అన్నాడు డిటెక్టివ్ వెంకన్న.

సీతమ్మ, రాజమ్మవంక అదోలా చూసి—''సగం వివరాలు నేను తెలుసుకు వచ్చాను. మిగతా సగం వివరాలు నువ్వు తెలుసుకు రావాలి. ఎందుకంటే బాస్‌తో నేను ఏకాంతంగా మాట్లాడాలనుకుంటున్నాను....'' అంది.

"ఎంత కుళ్ళే తల్లీ నీకు?" అంటూ రాజమ్మ లేచింది.

డిటెక్టివ్ వెంకన్న మాత్రం నీరసంగా కుర్చీలో జారగిలపడి "ఏం చెప్పాలనుకుంటున్నావో చెప్పు!" అన్నాడు.

సీతమ్మ చిరుకోపంతో వెంకన్నవంక చూసి "బాస్! మీకు నేనంటే యిష్టంలేదనుకుంటాను. ఇందాకా రాజమ్మ మీతో ఏకాంతంగా మాట్లాడతానంటే మీ కళ్ళలో మెరుపు కనబడింది. ఇప్పుడు నేను మాట్లాడతాననగానే మీరు నీరసంగా అయిపోయారు" అంది.

"అవును మరి-ఏకాంతంగా అంటే—పద్దెనిమిదేళ్ళ కన్నెపిల్ల నా లాంటి యువకుడితో ఏవేవో మాట్లాడుతుందని అనుకుంటాను. కానీ తనకు నీకంటే ఓ రూపాయ జీతం యెక్కువిప్పించమని అడిగింది రాజమ్మ" అన్నాడు వెంకన్న.

"దానికి బొత్తిగా ఏమీ తెలియదు. జీతమంటూ పెంచితే నాకే పెంచాలి. ఎందుకంటే నాకైతే ఏకాంతంగా ఉన్నప్పుడు మిమ్మల్ని ముద్దుపెట్టుకోవాలని అనిపిస్తుంది" అంది సీతమ్మ.

వెంకన్న ముఖం యెర్రబడింది. కళ్ళు మెరిశాయి— "నిజంగానా?" అన్నాడు.

"నిజం బాస్! అయితే ఒక్క సందేహం. మీకు పెళ్ళైపోయిందిగా—మీరింకో ఆడపిల్లని ముద్దు పెట్టు

కుంటే తప్పు కదూ!" అంది సీతమ్మ.

వెంకన్న గొంతు సవరించుకుని "చూడు మిస్ సీతమ్మా! ముద్దు పెక్కుకింద లెక్కకాదు. అదొక అందమైన మధుర మైన కార్యం. మనకిష్టమైన వాళ్ళకు ఓ చిరునవ్వు పారేసి నట్లే ఓ ముద్దుకూడా పారేయొచ్చు. ఉదాహరణకు ఇప్పుడు మనమిద్దరం ముద్దు పెట్టుకున్నామనుకో మన శీలాలు పాడైనట్లు కాదు" అని యింకా యేదో అనబోతూండగా-

"బాస్-అయితే పెళ్ళికిముందు మీరెవరైనా అమ్మాయిని ముద్దు పెట్టుకున్నారా?" అనడిగింది సీతమ్మ.

వెంకన్న జవాబివ్వబోతుండగా రాజమ్మ ప్రవేశించింది. సీతమ్మ రాజమ్మ వంక చిరాగ్గాచూసి "మరీ అంత తొందరగా వచ్చేయడమేమిటే బాబూ—ఇక్కడ మేమెంతో సరదాగా మాట్లాడుకుంటూంటే" అంది.

రాజమ్మ ఆ మాటలు పట్టించుకోకుండా "బాస్! ఎదురింటి ఆమె పుట్టింటివారు ఆ బంధువుద్వారా ఆమెకు వెల్లుల్లి ఆవకాయ పంపారట. అందులో వెల్లుల్లి పాలు కాస్త ఎక్కువై చాలా ఘాటుగా వున్నదట. ఎదురింటి ఆమెకు వెల్లుల్లి ఘాటు పడదట. నిన్నరాత్రి ఎనిమిది గంటలకు ఆమె భర్త ఏదో పనిమీద బజారుకు వెళ్ళాడుట. బంధువు మొదటి ఆట సినిమాకు వెళ్లాడట. ఈమె ఇంటిపనులు చేసుకుంటూ వెల్లుల్లి ఆవకాయను డబ్బాలోంచి జాడీలోకి మారుస్తోందిట. సగం పనిఅయ్యేసరికి వెల్లుల్లిఘాటు ఆమె తలకెక్కి కళ్లు తిరిగాయట. పని మధ్యలో వదిలేసి ఆమె మంచమెక్కిందట. రాత్రి తొమ్మిదింపావుకి ఆమె బంధువు వచ్చేసరికి ఇంటి తలుపులు బార్లా తెరిచివున్నాయట. వస్తువులన్నీ చెల్లాచెదురుగా వున్నాయట. అతను లేపగా ఆమె లేచిందిట. వెతికిచూస్తే చాలా పోయాయి. ఆ తర్వాత ఇంకాస్సే

పటికి ఆమె భర్త వచ్చాడట. భార్య అశ్రద్ధకు మండిపడి అతనామెను కొట్టినంత పనికూడా చేసాడుట'' అంది.

వెంకన్న సాలోచనగా—"నిన్న రాత్రి మేము విందు భోజనానికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి రాత్రి పన్నెండయింది. అప్పటికీ గొడవంతా సద్దుమణిగి ఉంటుంది. అంటే ఇప్పుడు ఇరుగూ పొరుగూ చేరి హడావుడి ప్రారంభించారన్నమాట" అని చటుక్కున లేచి నిలబడి—"డిటెక్టివ్ ఇంటి ముందు దొంగతనమా? ఇది వెంకన్నకు అవమానం. ఈ కేసు అంతుతేల్చవలసిందే—" అన్నాడు.

"అయినా వాళ్లు మనింటికి రావడం లేదేమిటి?" అంది సీతమ్మ ఆశ్చర్యంగా.

"ఇది నా పరువుకు సంబంధించిన విషయం కాబట్టి—వాళ్ళు అడక్కపోయినా ఈ కేసు నేనే పరిశోధించి విషయం తేలుస్తాను....'' అన్నాడు వెంకన్న.

2

"పోలీసు రిపోర్టిచ్చారా?'' అన్నాడు వెంకన్న.

"లేదు. ఇవ్వాలని కూడా లేదు. వాళ్ళ చుట్టూ తిరిగే ఓపిక నాకు లేదు....'' అన్నాడు కాంతారావు. అతడు ఎదురింటామె భర్త.

"వీళ్ళవైతే నగలు, వెండి సామాను పోయాయి. నావైతే రొక్కం. దొరికే అవకాశమెలగూ లేదు. పోలీసులకు చెప్పి మళ్లీ అదో గొడవెందుకు?''అన్నాడు వీర్రాజు. అతను ఎదురింటామె బంధువు.

"అది మా సొమ్ము కాదు. పోయింది. ఋణం తీరిపోయింది'' కన్నీళ్ళొత్తుకుంటూ అంది యశోద. యశోద అన్నది ఎదురింటామె పేరు.



"మీరిలా ఊరుకోవడం ఏమీ బాగాలేదు. డిటెక్టివ్ వెంకన్న ఇంటికి ఎదురుగా ఉంటున్నారు మీరు. మీ ఇంట్లో దొంగతనం జరగడం నాకు నచ్చలేదు. నేనూరుకున్నా మా ఆవిడ ఊరుకోదు. ఈ దొంగతనం విషయం నేను తేల్చేయగల ననుకుంటున్నాను...." అన్నాడు వెంకన్న.

"ఎందుకండీ — అనవసర శ్రమ!" అన్నాడు కాంతారావు.

"అదేంటండీ — ఈవేళ మీ ఇంట్లో అయింది. రేపు ఇంకోరింట్లో కావచ్చు. మనమిలా చేతులు ముడుచుకుని కూర్చుంటే దొంగ విజృంభించి రోజుకో ఇంటిని కొల్లగొడతాడు. నా పరిశోధనవల్ల పోలీసుల బెడద ఉండదు. మీరు నా చుట్టూ తిరగనక్కర్లేదు. అవసరమైనప్పుడల్లా నేనే మీ చుట్టూ తిరుగుతాను...." అన్నాడు వెంకన్న.

"మా నగలు మాకు చిక్కుతా యంటారా?" అన్నాడు కాంతారావు.

"తప్పకుండా చిక్కుతాయి. దొంగ కూడా చిక్కుతాడు...." అన్నాడు వెంకన్న.

"పరిశోధన యెలా ప్రారంభిస్తారు?...." అనడిగాడు వీర్రాజు.

"దొంగ ఇల్లంతా గాలించాడు గదా—అతగాడి వ్రేలి ముద్రలు దొరుకుతాయేమో ప్రయత్నిద్దాం. నా దగ్గర మామూలుగా దొంగతనాలు చేసేవాళ్ళ వేలిముద్రలు చాలా ఉన్నాయి. వాడు కొత్త దొంగకాని పక్షంలో వాడి ఆచూకి తెలుసుకునేందుకు ఎంతోసేపు పట్టదు—" అన్నాడు వెంకన్న.

"మేము ఇల్లంతా కంగారుగా వెతికినప్పుడు అన్నీ కంగాళీ చేసేశాం. మీకు వేలిముద్రలు దొరుకుతాయని అనుకోను నేను...." అన్నాడు కాంతారావు.

"జరిగిన దొంగతనం మామూలుది కాదు. పోయిన మొత్తం సామాన్యమైనది కాదు. మీలో యెవరికీ చీమ కుట్టినట్టైనా లేదే!" అన్నాడు వెంకన్న.

వీర్రాజు ఉలిక్కిపడి—"అయిదు వేలు రొక్కం పోయింది. చీమ కుట్టినట్లెలా ఉంటుంది? ఏ కొండచిలువో మింగినట్లుంటుంది కానీ...." అన్నాడు.

"అలాగా—అయితే ఆ దొంగని నేను పడతాను. ఒక్కసారి జరిగిందంతా చెప్పండి!—" అన్నాడు వెంకన్న.

వాళ్ళు చెప్పిన కథ సీతమ్మ, రాజమ్మలు చెప్పిందాని లాగే ఉంది.

వెంకన్న కథంతా విన్నాక—"ఈ దొంగతనం జరగడానికి మీ ముగ్గురూ కూడబలుక్కుని సహకరించినట్లుంది తప్పితే దొంగ యేమీ యిబ్బంది పడ్డట్లు లేదు—" అన్నాడు.

కాంతారావు ముఖంలో కోపం కనబడింది—"దొంగ

తనం జరగడానికి మేమెందుకు సహకరిస్తాం?"

"ఉదాహరణకు—....ఆ సమయంలో మీరు ఇంట్లో లేనని అంటున్నారు. ఏ పనిమీద బైటకు వెళ్లారో చెప్ప గలరా?" అనడిగాడు వెంకన్న.

"నా స్నేహితుడు నళినీకాంతారావు ఇంటికి వెళ్ళాను. బ్రిడ్జి ఆడాలని ఆహ్వానించాడతను. అలా అప్పుడప్పుడు ఎవరో ఒకరి ఇంట కలుసుకుని బ్రిడ్జి ఆడడం మాకు రివాజు. ఒకోసారి మా ఇంటకూడా ఆడుతూంటాం. నేను అక్కణ్నించి తిరిగివచ్చేసరికి పదకొండు దాటి పోయింది ..." అన్నాడు కాంతారావు.

"ఇంట్లో ఆడదొక్క_ర్తీ ఉందని తెలిసి కూడా మీరు సినిమాకు వెళ్లారా?" అన్నాడు వెంకన్న వీర్రాజుతో.

"నాకు సినిమా పిచ్చి. ఏ మాత్రం కాళీ దొరికినా పిక్చర్ చూస్తూంటాను—" అన్నాడు వీర్రాజు.

"ఒక్క_ర్తినీ ఉండడం నాకు బాగా అలవాటు—ఆ భయం లేదు—" అంది యశోద.

"కానీ—నేను ఖచ్చితంగా చెప్పగలను. ఈ దొంగ తనం విషయంలో మీ ముగ్గుర్లో కనీసం ఇద్దరు లాలూచీ అయుండాలని నా నమ్మకం. ఇలా అంటున్నానని మీరేమీ అనుకోకండి—" అన్నాడు వెంకన్న.

"మిస్టర్ వెంకన్నా! దొంగతనం జరిగి మే మేడు స్తూంటే మీరు మాకు ఇలాంటి అభియోగాలతో మరింత చిరాకు తెప్పిస్తున్నారు. మీకూ మీ పరిశోధనకూ ఓ నమ స్కారం. మీ రిక్కణ్ణుంచి వెళ్ళండి!" అన్నాడు కాంతా రావు.

"పిలవని పేరంటంగా పరిశోధనకు దిగడం నాకేమీ కొత్తకాదు. గానీ మీరు వద్దన్నా మానను. నా అభియోగం

ఇదే! లేని దొంగతనాన్ని మీ ఇంట్లో సృష్టించారు.సృష్టించి ఊరుకుంటే ఫరవాలేదు. వీధిలో అనవసరంగా కాసేపు అలజడి కలిగించారు. నేరం జరిగితే అది పోలీసులకు రిపోర్టు చేయడం మంచి పౌరుడి బాధ్యత. ఆ బాధ్యతను మీరు నిర్వహించకపోతే నేను నిర్వహిస్తాను...." అన్నాడు వెంకన్న.

"పోలీసుల గొడవెందుకు గానీ మీరే పరిశోధించండి. ఈ దొంగతనం నిజంగా జరుగలేదని మీ రెందుకు అభిప్రాయపడుతున్నారు?" అన్నాడు కాంతారావు.

"వెల్లుల్లి వాసనకు కళ్లు తిరిగి దొంగాడొచ్చి ఇల్లంతా దోచేస్తున్నా తెలియనంతగా స్పృహ తప్పిపోవడం చాలా సిల్లీగా ఉంది—" అన్నాడు వెంకన్న.

"ఇందులో సిల్లీ ఏమీలేదు. మా ఆవిడకు వెల్లుల్లి పడదు. ఇలా చాలాసార్లు తెలివితప్పి పడిపోయింది—" అన్నాడు కాంతారావు.

"అయితే ఒక్క సందేహం—ఆమెకు వెల్లుల్లి పడదని తెలిసికూడా ఆమె పుట్టింటివారు ఘాటైన వెల్లుల్లి ఆవకాయ యెందుకు పంపినట్లు?" అన్నాడు వెంకన్న.

కాంతారావు నవ్వి—"డిటెక్టివ్‌లు అడగవలసిన ప్రశ్నే అడిగారు. నాకు వెల్లుల్లి బాగా ఇష్టం. నా కోసం ప్రత్యేకంగా ఆ ఆవకాయ పంపింది మా అత్తగారు—" అన్నాడు.

"నేనో పర్యాయం ఆ ఆవకాయ చూడొచ్చా"అన్నాడు వెంకన్న.

"మీకు అంతగా ఇష్టమైతే ఓ చిన్న గిన్నెడు ఊరగాయ ఇస్తాను...." అన్నాడు కాంతారావు.

"అది తర్వాత చూద్దాం. ముందు ఊరగాయ

చూస్తాను....” అన్నాడు వెంకన్న.

కాంతారావు వెంకన్నను వంటింట్లోకి తీసుకు వెళ్ళాడు. వెంకన్న ఊరగాయ వాసన చూసి “—కాస్త ఘాటుగానే ఉంది కానీ దీనికి స్పృహ తప్పుతుందా?”—అన్నాడు.

“వెల్లుల్లి ఇష్టంలేని వాళ్ళకు దాని వాసన దుర్భరంగా ఉంటుంది. మా ఆవిడకేకాదు—నా చెల్లెలి కూడా ఇలాంటి జబ్బుంది—” అన్నాడు కాంతారావు.

ఇద్దరూ మళ్ళీ నడవాలోకి వచ్చారు—“మీకు వెల్లుల్లి ఏమాత్రమూ సహించదా?” అనడిగాడు యశోదవంక చూస్తూ.

“సహించదు....”

“వెల్లుల్లిపట్ల మీకున్న అసహ్యం చిన్నప్పట్నించీ ఉందా—మధ్యలో వచ్చిందా?”

“చిన్నప్పట్నించీ ఉంది....”

“చిన్నప్పట్నించీ ఉందా?” ఆశ్చర్యంగా అడిగాడు వెంకన్న.

“అవునండీ—చిన్నప్పట్నించీ ఉంది....” అని కాస్త చిరాగ్గానే నవ్వింది యశోద—“ఎదురింట్లో డిటెక్టివుంటే ఇదో పెడద కాబోలు. దొంగతనం జరిగిన ఇంట్లో మనుషు లనే దొంగల్ని చేస్తాడు....”

“పోయిన మీ నగలు, డబ్బు దొరకాలని మీకుందా?”

“ఉంది!” అంది యశోద.

“అయితే నామీద విసుక్కోకండి. ఈ రోజు మధ్యాహ్నానికల్లా అన్నీ దొరికేస్తాయి....”

ముగ్గురూ అతడివంక ఆశ్చర్యంగా చూసి—“ఏమిటి మీరంటున్నది?” అన్నారు.

"ఎదురింటి డిటెక్టివ్ తడాఖా మధ్యాహ్నానికి చూపిస్తాను...." అన్నాడు వెంకన్న.

3

నళినీకాంతారావు వద్ద వాకబు చేయగా కాంతారావు చెప్పింది నిజమేనని తెలిసింది. చాలా రాత్రి వరకూ అక్కడ బ్రిడ్జి ఆట కొనసాగింది. కాంతారావు కూడా ఉన్నాడు.

వీర్రాజు సినిమాకు వెళ్ళిన విషయం నిజమే అయుండాలి. అది ఋజువు చేయడం కష్టం. కానీ అతను ఇల్లు ఆరుగంటలకు కాస్త ముందుగా వదిలిపెట్టాడనీ, తిరిగి తొమ్మిది దాటాకనే ఇంటికి వచ్చాడనీ వీధిలో కొందరి ద్వారా తెలిసింది. ఆ సాక్ష్యాలను ఖచ్చితంగా నమ్మాలంటే-దొంగ ఏదో సమయంలో ఇంటదూరాడు గదా— అదెవరూ చూపినట్లులేదు.

వెంకన్న తిరిగివచ్చేక సీతమ్మ, రాజమ్మ అతడివేపు ఆశ్చర్యంగా చూస్తూ—"నిజంగా దొంగతనం జరుగలేదని మీరెందుకు అనుమానిస్తున్నారు?"

"నేను డిటెక్టివ్‌ను కదా—నా ఆలోచనా రీతులు మీ కర్థంకావు—...." అన్నాడు వెంకన్న.

"మరీ అంత అర్థం కాకుండా లేదులెండి—వెల్లుల్లి వాసనకు స్పృహ తప్పిపోవడం మీకు అసందర్భంగా తోచింది. అంతేగదా!" అంది సీతమ్మ.

"బాగా చెప్పావు!" అన్నాడు వెంకన్న.

"అయితే మీ ఊహ సరైనది కాదు. మా నాయనమ్మకు వెల్లుల్లి వాసన తగిలితే స్పృహతప్పి పడిపోయేది...." అంది రాజమ్మ. ఆమె చెప్పిన ప్రకారం ఆవిడకు మళ్ళీ స్పృహ రావడానికి ఒకోసారి రెండేసి గంటలు కూడా



పట్టేది.

"పూర్వకాలంలో ఆడవాళ్ళకు యింటిచాకిరీ యెక్కువగా వుండేది. అది తప్పించుకోవడం కోసం ఒకోసారి ఇలాంటి వంక పెట్టేవారు. మొదట్లో నటనగా ప్రారంభించేక కొన్నాళ్ళకది అలవాటుగా మారిపోతుంది—" అన్నాడు వెంకన్న.

"మధ్యాహ్నంలోగా దొంగను పడతానన్నారు-ఎలా?" అనడిగింది సీతమ్మ.

"ఈ రోజంతా కాంతారావు, వీర్రాజు, యశోదలను నా మనుషులు నీడలా వెన్నంటి ఉంటారు....వాళ్ళేం చేసారో తెలుసుకుంటారు" అన్నాడు వెంకన్న.

పదకొండున్నరకు వెంకన్నకు ఫోన్ వచ్చింది. కాంతారావు ఆఫీసుకు వెళ్ళి మామూలుగా తన తని చేసుకుంటున్నాడుట. ఏ విశేషమూ జరగలేదుట.

మరో అయిదునిముషాల్లో ఇంకో ఫోన్ వచ్చింది.

వీర్రాజు మనిషి దిగులుగా కనబడుతున్నాట్ట. అజంతా హోటల్ ముందు చాలాసేపు తచ్చాడాడుట. లోనికి వెళ్ళనా, మాననా అని చాలా పర్యాయాలు తటపటాయించి ఆఖరికి లోపలకు వెళ్ళలేదుట. పోస్టాఫీసుకు వెళ్ళి ఓ ఉత్తరం రాసాట్ట. అడ్రస్: రాజయ్య, ఆత్రేయపురం, తూర్పు గోదావరిజిల్లా. ప్రస్తుతం అతను ఓ హాండ్‌లూమ్ ఎగ్జిబిషన్లో తిరుగుతున్నాట్ట.

ఇంకో అయిదునిముషాల్లో ఒక యువతి అక్కడకు వచ్చింది. ఓ గంటక్రితం ఆమె ఆ వీధిలో గిల్టు నగలు అమ్మిందట. యశోద గిల్టునగలపై ఏ విధమైన ఆసక్తి చూపలేదుట. ఈ విషయం చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

వెంకన్న ఫోన్‌తీసి "దేవీ!" అన్నాడు.

వంటింట్లోంచి ఫోన్ తీపిన పద్మావతీదేవి "హలో!" అంది.

"నాలుగు వెల్లుల్లి పాయలు వలిచి, రేకలుతీసి, ముద్దగా నూరి ఘాటు ఏ మాత్రమూ పోకుండా భరిణలో పెట్టి మూతవేసి వుంచు. సీతమ్మని పంపిస్తాను. ఆమె కా భరిణ ఇవ్వు" అన్నాడు వెంకన్న.

"సరే!" అని ఫోన్ పెట్టేసింది పద్మావతీదేవి.

"ఏం చేయబోతున్నారు మీరు?" అంది రాజమ్మ.

"దొంగకు నిస్సహాయత కలిగించబోతున్నాను...." అన్నాడు వెంకన్న.

అంతకుమించి అతనేమీ చెప్పడని అర్థమైన—అసిస్టెంట్సు ఇద్దరూ మాట్లాడకుండా ఊరుకున్నారు. కొద్దిసేపట్లోనే ఫోన్ మ్రోగింది. పద్మావతీదేవి వెల్లుల్లి ముద్దను తయారుచేసిన విషయం ఫోన్లో చెప్పింది. వెంకన్న ఆనతి మేరకు సీతమ్మ వెళ్ళి ఆ భరిణ తీసుకువచ్చింది.

"ఇప్పుడు మనం ముగ్గురం ఎదురింటికి వెడుతున్నాం" అన్నాడు వెంకన్న.

ముగ్గురూ బయల్దేరి యెదురింటికి వెళ్లారు.

"రండి—రండి—దొంగ దొరికాడా?" అంది యశోద నవ్వుతూ.

"దొంగా దొరికాడు. వస్తువులూ దొరికాయి. శాంపిల్‌కు ఒక ఉంగరం తీసుకొచ్చాను. ఈ భరిణలో వుంది. మీదే నేమో చూడండి...." అన్నాడు వెంకన్న.

"పోయిన వస్తువుల్లో ఉంగరం వున్నట్టులేదే...." అంటూ యశోద కుతూహలంగా భరిణ మూతతీసింది. వెల్లుల్లి వాసన గుప్పుమంది. అప్పుడు వెంకన్న చటుక్కున ఆమెను సమీపించి ఆ భరిణను ఆమె ముక్కుకు అదిమి పెట్టాడు.

"అబ్బా—ఏమిటిది?" అంటూనే ఆమె కళ్ళు తేలవేసి ఉన్నపళంగా నేలమీద కూర్చుండిపోయి-నెమ్మదిగా కిందకు వాలిపోయింది.

ఆమెకు దెబ్బలు తగలకుండా సీతమ్మ, రాజమ్మలు కాశారు కానీ లేకపోతే ఏ ఎముకైనా విరిగి వుండేదామెకు!

"మీరు కాస్త జాగ్రత్తగా ఈమెను చూస్తూండండి" అంటూ వెంకన్న ఇల్లంతా కలయదిరగసాగాడు. తన అనుభవాన్ని జోడించి అతను కొన్ని స్థలాల్లో పరీక్షించగా ఒకచోట ఓ మూట దొరికింది. ఆ మూటలో నగలున్నాయి. కొంత క్యాషు కూడా వుంది. దాంతో అతను ఉత్సాహంగా సీతమ్మ, రాజమ్మలవద్దకు వచ్చి "రండి, పోదాం-ఆ భరిణ తీయండి" అన్నాడు.

యశోద ఇంకా స్పృహతప్పి పడి వుంది.

ముగ్గురూ మళ్లీ వెంకన్న ఇల్లు చేరుకున్నారు.

సీతమ్మ, రాజమ్మలు ఆ నగలవంక ఆశ్చర్యంగా చూస్తూ "ఎక్కడ దొరికాయి మీకు?" అన్నారు.

"యశోద ఇంట్లో!"

"మరామె అలా స్పృహతప్ప పడివుంది...." అంది రాజమ్మ.

"ఆమెను చూస్తే చాలా జాలిగా ఉంది నాకు. దొంగాడా కరవకురా అన్నట్లు ఆమెను మోసగించే ఉపాయం ఆమే చెప్పేసింది నాకు" అన్నాడు వెంకన్న.

"ఆమె నటించడంలేదు. నిజంగానే స్పృహతప్పి పడి పోయింది. చూస్తూ చూస్తూ యెవ్వరూ యావదాస్థినీ పోగొట్టుకోరు" అంది సీతమ్మ.

"నగలు పోయాయని వాళ్ళనుకుంటున్నారు. ఆ ఇంట్లో యెవ్వరూ దొంగ కాని పక్షంలో అవెలాగూ పోయినట్లే గదా! నాకు దొరికాయి" అన్నాడు వెంకన్న.

సరిగ్గా పన్నెండున్నరకు కాబోలు వీర్రాజును వెంట బెట్టుకుని యశోద వెంకన్న యింటికి వచ్చింది.

"డిటెక్టివ్‌లై యుండి మీరు నన్నిలా మోసగిస్తారను కోలేదు" అంది యశోద వస్తూనే తీవ్రంగా వెంకన్న వంక చూస్తూ.

"బాగుంది నేనేం చేశాను?" అన్నాడు వెంకన్న.

"నాకు వెల్లుల్లి వాసన చూపించి....స్పృహ తప్పించి నా యింట్లో దొంగతనం చేశారు" అందామె. ఈ సారి ఆమె కంఠంలో కాస్త తడి కూడా వుంది.

"మీ యింట్లో దొంగతనాని కింకేమున్నాయి? నిన్న రాత్రే అంతా దొంగలు దోచేసారు" అన్నాడు వెంకన్న

ఆశ్చర్యాన్ని నటిస్తూ.

"ఎందుకొచ్చిన గొడవ వెంకన్నగారూ. నిజం చెప్పే స్తాను. మా ఇంట్లో నిజంగా దొంగతనం జరగలేదు. కొన్ని కారణాలవల్ల అది సృష్టించవలసి వచ్చింది" అంది యశోద.

సీతమ్మ, రాజమ్మ ఆశ్చర్యంగా యశోద వంక చూశారు.

వీర్రాజు బాగా డబ్బున్న వాళ్ళబాయి. ఏదో పని మీద అయిదువేలిచ్చి అతన్నీ ఊరు పంపించారు. నిన్న అజంతా హోటల్ క్లబ్బులో అతను పేకాడి రెండువేలు పోగొట్టు కున్నాడుట. ఇంటి దగ్గర ఈ విషయం తెలిస్తే తిడతారు. అందుకని అతను తనను కాపాడమని కాంతారావును కోరాడుట. ఫలితంగా మూడువేలూ ఇద్దరూ పంచుకుందా మన్నాడతను. ఊరికే పదిహేనొందలుస్తున్నాయిగదా అని కాంతారావు ఈ దొంగతనం ఉపాయం పన్నాడు. దొంగ తనం జరిగినట్లు వీర్రాజు అప్పుడే ఇంటికి ఉత్తరం కూడా రాసేశాడు. వీధిలో నలుగురూ ఈ దొంగతనానికి సాక్ష్యంగా వుంటారు గదా అని కాస్త హడావుడి చేస్తే వెంకన్న తగులుకున్నాడు.

అప్పుడు వెంకన్న వారి సామాను వారికి చూపించాడు. యశోద ఆత్రంగా వాటిని పరీక్షించి చూసి "ఫరవాలేదు. డిటెక్టివులను నమ్మవచ్చు" అంది.

"వెల్లుల్లి విషయంలో మీరు డాక్టర్ని కలుసుకోవడం మంచిది. మీ ఇంట దొంగతనం చాలా సులభం" అంది సీతమ్మ.

''డిటెక్టివ్ ఇంటి యెదురుగా వుంటే నాకేం భయం?'' అంటూ వెళ్ళిపోయింది యశోద. వీర్రాజు ఆమెను అనుసరించాడు.

''యశోదకు వెల్లుల్లి పడుతుంది. ఇందాకా ఆమె చేసినది నటన మాత్రమే!'' అన్నాడు వెంకన్న.

''ఆ అనుమానం మీదనే గదా మీ పరిశోధన ప్రారంభమైంది—అసలా అనుమానం మీ కెలా వచ్చింది?'' సీతమ్మ, రాజమ్మ ఒకేసారి అడిగారు కుతూహలంగా.

''ఏముందీ—చిన్నప్పట్నించీ నాకు వెల్లుల్లి అంటే విపరీతమైన ఇష్టం. అది తినని రోజుండదు'' అన్నాడు వెంకన్న తాపీగా.

''అయితే?'' అంది సీతమ్మ ఆశ్చర్యంగా.

''నా పెళ్ళికి ముందునుంచీ యశోద యీ ఇంటి యెదురుగా కాపురముంటోంది. నన్ను చూసి ముచ్చటపడి ప్రతిరోజూ పిలిచి ముద్దిచ్చేది. ముద్దంటే నా కెప్పుడూ ఇష్టమే! నేను ముద్దు పెట్టుకున్నప్పుడల్లా అబ్బ—వెల్లుల్లి వాసన-అని నవ్వేది యశోద. పరవసం తప్ప స్పృహతప్పే లక్షణాలేమీ ఉండేవికావు. అప్పట్లో ఆమె ఇచ్చిన ముద్దులే ఈ రోజామె నేరాన్ని కూడా బయటపెట్టాయి'' అన్నాడు వెంకన్న.

''ఛీ-ఏం డిటెక్టివులో ముద్దులో కూడా నేరాలు పడతారు'' అంది రాజమ్మ.

''డిటెక్టివును ముద్దు పెట్టుకోకూడదు'' అంది సీతమ్మ.

వెంకన్న ఆలోచనాశక్తి వల్ల యిద్దరికీ అతను ముద్దు వస్తున్నాడు. అయినా వాళ్ళతనికి దూరంగానే వున్నారు. □

మారువేషం మర్మం

ప్రతాప రవిశంకర్

ఇంగ్లీషు డిటెక్టివ్ నవల చదువుతున్నాను. చేతిలో సిగరెట్టు పొగలు కక్కుతోంది.

మంచి సస్పెన్సులో వుంది నవల. ఛేజ్ నవల్స్ అన్నీ దాదాపు నాకు అలాగే అనిపిస్తాయి.

ఉదయం పది గంటలు కావస్తోంది. ఎందువల్లనో ఆ రోజు బద్ధకంగా వుంది. అందుకే బయటకు వెళ్ళలేదు. పనిమనిషిచేత టిఫిన్, కాఫీ గదికి తెప్పించుకున్నాను.

ఏదో అలికిడి వినిపించి తలెత్తి చూసాను.

బైట సైకిలు ఆగివుంది. లోపలకు వస్తున్న వర్ధనరావు కనిపించాడు.

అతని ముఖం ముడుచుకునిపోయివుంది.

వచ్చాడు.

"కూర్చో!" అన్నాను యెదురుగా వున్న కుర్చీ చూపుతూ.

కూర్చున్నాడు.... జేబులోనించి కర్చీఫ్ బయటకు తీసి మొహానికీ, చేతులకూ పట్టిన చెమటను తుడుచుకున్నాడు మవునంగా.

"ఏమిటి ఇలా వున్నావు?" అడిగాను నవలను చేతిలోనే వుంచుకుని.

"పద్మ కనిపించటం లేదు...." అన్నా డతను చిన్నగా.

"ఎవరూ.... పద్మా!" ముందుకు వొంగుతూ అడిగాను. పద్మ గురించి వర్ధనరావు అలా చెప్పటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"అవును."

"ఎప్పటినించీ?"

"నిన్నటినించీ.... నిన్న కాలేజీకి వెళ్ళిన పద్మ మళ్ళీ ఇంటికి రాలేదు."

చేతిలో వున్న నవలను టేబిల్ మీదకు విసిరాను.

"వివరంగా చెప్పు" మరో సిగరెట్టును ముట్టిస్తూ అడిగాను.

"నిన్న ఉదయం తొమ్మిదీ ఇరవై కి పద్మ కాలేజీకి బయ ల్దేరింది. రోజూ అంతే. అదే టైముకు బయల్దేరుతుంది. నిన్న కూడా టైముకు వెళ్ళింది. అలా వెళ్ళిన మనిషి నిన్న ఎంత రాత్రయినా తిరిగిరాలేదు. రోజూ ఆరూ పదికల్లా ఇంటికి వస్తుంది....ఎనిమిది గంటలకు నేను ఇంటికి వచ్చాను ఆఫీసునించి. అమ్మ చెప్పింది పద్మ రాలేదని.... పది గంటల వరకూ ఎదురుచూశాము. తెల్లవార్లూ చూశాము. ఇంతవరకూ రాలేదు" అన్నాడు వస్తున్న కన్నీళ్ళను బలవంతాన ఆపుకొంటూ.

వర్ధనరావుకి చెల్లెలంటే ఎంత ప్రేమో నాకు తెలుసు. వాళ్ళిద్దరే సంతానం. తండ్రి చిన్నతనంలోనే పోయాడు. అయినా తల్లి ఇద్దర్నీ బాగానే పెంచింది. అంతో ఇంతో ఆస్తి వుంది.

వర్ధనరావు నేను డిగ్రీలో క్లాసుమేట్సుం. అతనికి చదువు పూర్తికాగానే రైల్వేలో ఉద్యోగం వచ్చింది. నేను కంపెనీ సెక్రటరీస్ కోర్సు చదువుతున్నాను.

"అసలు కాలేజీకి వెళ్ళిందేమో కనుక్కున్నావా?"

"కనుక్కున్నాను. లంచ్ టైమ్ వరకూ వున్నదిట.... ఆ తర్వాత ఎవ్వరికీ కనిపించలేదు. పద్మ స్నేహితురా లింటికి ఇంతకు ముందే వెళ్ళి కనుక్కున్నాను....రాత్రే కనుక్కునేవాడిని. వాళ్ళ ఇల్లు నాకు తెలీదు."

"ఇంకెక్కడయినా ఎంక్వయిరీ చేశావా?"

"చేశాను. ఇంకా పద్మ స్నేహితుల ఇళ్ళకు వెళ్ళాను. ఎవ్వరూ ఇంతకుమించి చెప్పలేదు. మధ్యాహ్నం వరకే పద్మ క్లాసులో వున్నదిట....తర్వాత ఎక్కడికి వెళ్ళిందీ వాళ్ళు చెప్పలేకపోయారు."

"ఈ వూళ్ళో మీ బంధువులు ఎవరయినా వున్నారా?"

"ఇద్దరు వున్నారు. వాళ్ళ దగ్గరకూ్కడా పొద్దుటే వెళ్ళాను. పద్మ అక్కడికూ్కడా వెళ్ళలేదు."

"ఎక్కడికి వెళ్ళి వుంటుందని నీ అనుమానం?" అడిగాను సిగరెట్టును బయటకు విసురుతూ.

"నా కేమీ అర్థంకావటం లేదు. ఇలా జరగటం యిదే మొదటిసారి. ఒకవేళ ఎప్పుడయినా కాలేజీ వదలగానే యింటికి రాకపోయినా ఎనిమిది గంటల లోపలే ఇల్లు చేరు కునేది పద్మ....కాని ఈ సారి ఏం జరిగిందో? నాకు భయంగా వుంది" అన్నాడు వర్ధనరావు....ఈ సారి అతను కన్నీళ్ళను ఆపుకోలేకపోయాడు.

అతన్ని చూస్తే నాకూ బాధ కలిగింది. పద్మ అతనికే చెల్లెలుకాదు. నా కూ్కడా....

పద్మ నన్ను అన్నయ్యా అని పిలుస్తుంది.

"పోలీసు కంప్లయింట్ ఇచ్చావా?"

"ఇంకా ఇవ్వలేదు. నీ దగ్గరకు వచ్చిన తర్వాత ఇద్దా మనుకున్నాను."

"ముందు పోలీసు కంప్లయింట్ ఇద్దాం....తర్వాత కాలేజీకి వెళ్దాం. అక్కడ ఎంక్వయిరీ చేస్తే మనకు కొంత ఇన్ఫర్మేషన్ దొరకవచ్చు."

తల వూపాడు వర్ధనరావు.

గబగబా ప్యాంటు షర్టు వేసుకున్నాను. నా లోని బద్ధక మంతా ఎగిరిపోయింది. అతని సైకిలు లోపల పెట్టాడు. గదికి తాళంపెట్టి స్కూటరుతో బయటకు వచ్చాము.

వెనుక కూర్చున్నాడు వర్ధనరావు.

రివ్వున దూసుకుపోతోంది స్కూటరు.

పోలీసుస్టేషన్ ముందాగింది.

ఇద్దరం లోపలకు నడిచాము.

యస్.ఐ. వున్నాడు.

జరిగిందంతా అతనితో చెప్పాడు వర్ధనరావు. యస్.ఐ. ఏవో ప్రశ్నలు అడిగాడు. అన్నింటికీ చెప్పాడు వర్ధనరావు. వెంటనే ఈ విషయం గురించి ఆచూకీ తీస్తామని చెప్పాడు యస్.ఐ. పద్మ ఫోటో అడిగి తీసుకుని.

2

పోలీసు స్టేషన్లోంచి బయటకు వచ్చి పద్మ చదువుతున్న కాలేజీకి వెళ్ళాము.

క్లాసులు జరుగుతున్నాయి.

ప్యూను కాలేజీ యెదురుగావున్న క్యాంటీన్ నించి స్టాండుతో కాఫీ తీసుకువెళుతున్నాడు.

"పద్మ ఫోటో ఇంకోటి వుందా?" అడిగాను వర్ధనరావుని.

"ఉంది" అన్నాడు.

స్కూటర్ను కాలేజీ ముందు ఆపుతూ కాఫీ తీసుకెళుతున్న ప్యూన్ని ఆగమని చేత్తో సైగచేసాను.

ఆగాడు వాడు.

దగ్గరకు వెళ్ళాము.

పద్మఫోటో తీసుకుని ప్యూన్కి చూపించాను.

"ఈ అమ్మాయి తెలుసా?" అడిగాను.

"బలేవారే నా కెందుకు తెలీదూ. ఈ కాలేజీలోనే చదువుతోందిగా" అన్నాడు.

"నిన్న ఈ అమ్మాయిని చూశావా?"

"చూశానండీ."

"నిన్న సాయంత్రం కూడా చూశావా?"

"నిన్న సాయంత్రం యెట్లా చూస్తానండీ? మధ్యాహ్నమే వెళ్ళిపోయింది గదా."

"ఈ అమ్మాయి వెళ్ళటం నువ్వు చూశావా?"

"చూశానండి."

"ఒంటరిగా వెళ్ళిందా? ఎవరితో అయినా కలిసి వెళ్ళిందా?"

"నిన్న లంచ్ పైంకి కొంచెం ముందు కాఫీలకని క్యాంటిన్‌కి వచ్చాను. అప్పుడు నా దగ్గరకు ఒకతను వచ్చాడు. ఇప్పుడు మీరు చూపించిన ఫోటోనే చూపించి ఈ అమ్మాయి తెలుసా?అని అడిగాడు. తెలుసని చెప్పాను. వెంటనే జేబులోనించి చిన్నకాయితం తీసి నా కిచ్చి ఈ అమ్మాయికివ్వు అన్నాడు. ఆ కాయితంతోపాటు నాకో రూపాయికూడా యిచ్చాడు. లోపలకు వెళ్ళాను. లంచ్ బెల్ మోగింది. ఆ అమ్మాయి క్లాసులోనించి బయటకు వచ్చింది. ఆ కాయితాన్ని ఆ అమ్మాయి కిచ్చాను. చదువుకొని వెంటనే బుక్స్ తీసుకుని వెంటనే వెళ్ళిపోయింది."

నాలో ఆలోచనలు పరుగులు తీస్తున్నాయి. ఏం జరిగి వుంటుందో వూహిస్తున్నాను.

"నీకు కాయితం యిచ్చితనను యెలా వున్నాడు?" అడిగాను.

"మీ అంత పొడుగు వుంటాడు. కొంచెం సన్నగా వున్నాడు. వెడల్పాటి మొహం. మీసాలు లేవు. పైకి దువ్విన క్రాపు. నీలంరంగు ప్యాంటు, గళ్ళ షర్టు వేసుకున్నాడు."

"నీకు అతను యెలా అనిపించాడు?"

"చెప్పటం కష్టం సార్. మొహం చూస్తే బాగానేవుంది. కళ్లు బాగా చురుగ్గా వున్నాయి" చెప్పాడు ప్యూను.

"థాంక్స్ బ్రదర్. ఇదిగో ఈ పదీ వుంచు" అంటూ పర్సులోనించి పదిరూపాయల నోటు తీసి అతని చేతిలో

వుంచి వెనక్కి మళ్లాను.

"ఇంతకీ ఆ అమ్మాయికి ఏమయ్యింది?" అడిగాడు వాడు.

"తర్వాత చెబుతాను" అంటూ స్కూటరు స్టార్టు చేశాను.

"నాకు అంతా అయోమయంగా వుంది" అన్నాడు వర్ధనరావు వెనక కూర్చుంటూ.

"కంగారుపడకు. ముందు నే నడిగే ప్రశ్నలకు జవాబులు చెప్పు" అన్నాను.

"ఏమిటి?"

"పద్మ ఎవర్నయినా ప్రేమించిందా?"

"నాకు తెలీదు."

"పద్మ ప్రవర్తనలో ఈ మధ్య ఏమయినా మార్పు వచ్చిందా?"

"ఏమో! నాకు తెలిసి ఎలాంటి మార్పులేదు. ఎప్పటి లాగే వుంటోంది. నీకెందుకు వచ్చింది ఈ అనుమానం!"

"అనుమానం కాదు. నిజమే అయివుండాలి. పద్మ కోసం వచ్చిన మనిషి పద్మకు తెలిసే వుండాలి. లేకపోతే ఆ కాయితం చూసుకుని బయటకు పోదు. అతను తను ప్రేమించిన మనిషి అయివుండాలి. బహుశ ఇద్దరూ కలిసే వెళ్లి వుంటారు."

స్కూటరును ఆటోస్టాండు దగ్గర ఆపాను. పది ఆటోల వరకూ అక్కడ ఆగివున్నాయి. కాలేజీ దగ్గర్లో వున్న ఆటోస్టాండు అదొక్కటే.

ఆటో ముందు నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు ఒకడు. వాడి దగ్గరకు నడిచాడు.

పద్మ ఫోటో చూపించి "నిన్న మధ్యాహ్నం ఈ

అమ్మాయి నీ ఆటో ఎక్కిందా?" అడిగాను.

"లేదుసార్. చూళ్ళేదు అసలు."

ఇంతలోనే అక్కడ మిగిలిన ఆటోవాలాలు పోగయ్యారు. అందరూ ఫోటోను చూస్తున్నారు.

"నేను చూశాను సార్" అన్నాడు ఒకడు. నా ప్రాణం లేచివచ్చింది.

"ఎప్పుడు చూసావ్? పక్కన ఎవరయినా వున్నారా?" అడిగాను.

"అవున్సార్! నిన్న మధ్యాహ్నం నా ఆటోలోనే ఎక్కారు. ఈఅమ్మాయి పక్కనే ఇంకో అతను వున్నాడు" అని అతన్ని వర్ణించి చెప్పాడు. కాలేజీ ప్యూను చెప్పిన పోలికలే ఇతను కూడా చెప్పాడు."

"ఇంతకీ వాళ్ళ ఎక్కడ దించావ్?"

"సికింద్రాబాదులో వున్న కామత్ హోటల్ దగ్గర."

"థాంక్స్" అని అతనికో ఐదురూపాయలు యిచ్చి మళ్ళీ స్కూటర్ మీద ఇద్దరం బయల్దేరాం.

ఆలోచనలకు పదును పెడుతున్నాను. అనుమానంలేదు? పద్మ అతన్ని ప్రేమించింది. అతనితో హోటల్‌కి వెళ్ళింది. ఆ తర్వాత యెక్కడికి వెళ్ళి వుంటుంది? ఎక్కడికయినా వెళ్లి వుండవచ్చు. టాంక్‌బండ్ మీదకో..బిర్లాటెంపుల్‌కో.. ఇందిరా పార్కుకో..... లేకపోతే ఏదయినా సినిమాకో.

కామత్ ముందు ఆపాను స్కూటర్ని.

లోపలకు నడిచాము.

కౌంటర్‌లో కూర్చున్నాడు లావుపాటి అతను.

ముందుగా పద్మఫోటోని అతనికి చూపించి "నిన్న మధ్యాహ్నం చూసారా ఈ అమ్మాయిని?" అని అడిగాను.

ఫోటోని పరీక్షగా చూసి "గుర్తులేదు. చూళ్ళేదను



కుంటాను" అన్నాడు.

అతనికి థాంక్స్ చెప్పి టిఫిన్ హాల్‌లోకి నడిచాము. రెండు కుర్చీల్లో ఎదురెదురుగా కూర్చున్నాము.

సర్వర్ వచ్చాడు.

"రెండు కాఫీ" అన్నాను.

అతను వెళ్ళబోయాడు.

"వన్ మినిట్" అన్నాను.

ఆగిపోయేడు.

జేబులో నించి ఫోటోని తీసి అతనికి చూపి మామూలు ప్రశ్న అడిగాను.

"చూళ్ళేదు సార్" అన్నాడు.

"నువ్వు చూసి వుండకపోవచ్చు. మిగిలిని వాళ్ళకు కూడా చూపించు. ఎవరయినా చూచారేమో."

ఫోటోతో లోపలకు వెళ్ళాడు. రెండు నిమిషాల్లోనే ఒక సర్వర్ని తీసుకువచ్చాడు.

"ఇతను చూశాడుట."

"నేను చూసాను. ఈ అమ్మాయి పక్కనే ఒకతను వున్నాడు. ఇద్దరూ ఆ మూలగా వున్న టేబిల్ దగ్గర కూర్చున్నారు. నేనే సర్వ్‌చేసాను. ఇద్దరూ మీల్స్‌చేసారు. త్వరాత టీ తాగారు. బిల్ అతనే పే చేసాడు. టిప్‌కింద రూపాయి వదిలేశాడు సార్ అతను" చెప్పాడు.

"ఎలా వున్నాడతను?"

చెప్పాడు.

అతనే.

కాఫీతాగి బయటకు వచ్చాం.

ఎదురుగా అజంతా టాకీస్ వుంది. కొత్త సినిమా రన్నవుతోంది. జనం క్యూలో నిలబడ్డారు.

ఆ థియేటర్ని చూసిన తర్వాత నా మెదడులోకి ఓ ఆలోచన వచ్చింది. 'ఒకవేళ వాళ్ళిద్దరూ సినిమాకు వెళ్ళివుంటే.'

థియేటర్ ముందుకు నడిచాము నేను, వర్ధనరావు.

అతని మొహం బాగా పీక్కుపోయింది. భయం అతని కళ్ళలో స్పష్టంగా కనిపిస్తోంది.

"భయపడకు వర్ధనరావ్. పద్మ తప్పకుండా కనపడు తుంది" అన్నాను.

అతను మాట్లాడలేదు.

అప్పటికే టిక్కెట్లు ఇష్యూ చేస్తున్నారు.

వర్ధనరావుని అక్కడే వుండమని నేను అప్పర్‌క్లాసు గేటుకీపర్ దగ్గరకు వెళ్ళాను. నిన్న మధ్యాహ్నం షోకి కూడా అతనే వున్నాడట డ్యూటీలో .... పద్మ ఫోటో చూపించాను అతనికి. చూడలేదని ఖచ్చితంగా చెప్పాడు. అసలు నిన్న షోకి ఆడవాళ్ళు చాలా తక్కువమంది వచ్చా రట. ఇంకో గేటు కీపర్‌కి 'చూపించాను. అతనుకూడా

'ఇలాంటి మనిషి అసలు రాలేదు సార్' అన్నాడు.

నిరుత్సాహంగా బయటకు వచ్చాను.

"ఏమయ్యింది?" అడిగాడు వర్ధనరావు.

"ఎవ్వరూ చూడలేదుట. బహుశ సినిమాకు వెళ్ళ లేదేమో. ఆటోవాళ్ళను అడిగి చూద్దాం" అని అక్కడే రోడ్డువారగా ఆగివున్న ఆటోల వాళ్ళ దగ్గరకు వెళ్ళి పద్మ ఫోటో చూపి ఎంక్వయిరీ చేసాను.

ఉపయోగం లేకపోయింది. పద్మ, అతను అక్కడి ఆటోల్లో యెక్కలేదుట.

నీరస పడిపోయేను. నా పరిశోధన అప్పటికి అంత టితో ఆగిపోయింది.

స్కూటరు స్టార్టు చేశాను. వెనుక యెక్కాడు వర్ధన రావు.

"ఎక్కడికి ఇప్పుడు?" అడిగాడు.

"పోలీస్ స్టేషన్‌కి."

పావుగంటలో స్కూటర్ స్టేషన్ ముందాగింది. అప్పుడే యస్. ఐ. ఎక్కడికో వెళ్ళబోతున్నాడు.

అతనితో నేను జరిపిన పరిశోధనంతా చెప్పాను.

అతను ఆశ్చర్యపోయాడు.

"మీరు ప్రయివేట్ డిటెక్టివా?" అడిగాడు.

"లేదండీ. డిటెక్టివ్ కథా రచయితను.... అపరాధ పరి శోధనపట్ల ఇంట్రస్టు వుంది."

"గుడ్ .... ఇంప్రూవ్ ఇట్. ఇకమీరు వెళ్ళండి. మిగిలి నది మేము తెలుసుకుంటాం" అన్నాడు నాకు షేక్‌హాండ్ యిచ్చి.

'థాంక్స్' చెప్పి బయటకు వచ్చాము.

3

డ్రెస్ చేసుకుని బయటకు బయల్దేరబోతున్నాను. ఉదయం తొమ్మిది గంటలవుతోంది.

బయట ఏదో కారు ఆగిన చప్పుడయింది. చూచాను.

పోలీసు జీపు.

వర్ధనరావు కిందికి దిగి గది వయిపు వచ్చాడు. అతని కళ్లు ఎర్రగా వున్నాయి. ఏడుస్తున్నాడు సన్నగా.

"ఏమయ్యింది?"

"పద్మని ఎవరో హత్యచేసారు?" పూడుకుపోయిన గొంతుతో చెప్పాడు.

"మైగాడ్! యెక్కడుంది?"

"ఎక్కడో గదిలో వుందిట. నన్ను తీసుకువెళు తున్నారు. అమ్మకు యీ విషయం తెలియగానే స్పృహ తప్పి పడిపోయింది."

"వస్తున్నాను" అని గబగబ తాళంపెట్టి అతనితో వెళ్ళి జీపు యెక్కాను. అందులో యిద్దరు పోలీసులు వున్నారు.

యస్.ఐ. హత్య జరిగిన ప్రదేశంలో వున్నాడుట.

వర్ధనరావు ఏడుస్తున్నాడు. అతన్ని ఓదార్చలేక పోతున్నాను. ఒకే ఒక్క చెల్లెలు. హత్యచెయ్యబడింది. ఎవరికయినా బాధగా నే వుంటుంది.

నాకు ఆశ్చర్యంగా వుంది. ఇంతకీ యెలా హత్య చెయ్యబడింది? ఎవరు హత్యచేశారు? ప్రేమించిన అతనేనా? అతనెందుకు హత్యచేస్తాడు?? ఏమో!

జీపు ఓ యింటి ముందు ఆగింది.

దిగాము.

ఇద్దరు పోలీసులూ ఆ ఇంట్లో వెనక వైపున వున్న ఓ

గదిలోకి తీసుకువెళ్లారు.

యస్.ఐ. లోపల వున్నాడు.

గది మూలగా వున్న మంచంమీద వెల్లకిలా పడివుంది పద్మ శవం. భయంకరంగా వుంది.

శవాన్ని చూడటంతోటే పెద్దగా ఏడుస్తూ చెల్లెలిమీద పడబోయాడు వర్ధనరావు. అతన్ని గట్టిగా పట్టుకున్నాను.

యస్.ఐ. పక్కనే ఒకాయన నిలబడి మా ఇద్దరినీ చూస్తున్నాడు. ఎక్స్‌పర్ట్ వేలిముద్రలు తీస్తున్నాడు. ఫోటోగ్రాఫరు తన పని ముగించుకుని నిలబడ్డాడు. డాక్టరు శవాన్ని పరీక్షగా చూస్తున్నాడు.

పసిపిల్లాడిలా విలపిస్తున్నాడు వర్ధనరావు.

పద్మ కనుగుడ్లు బయటకు పొడుచుకు వచ్చాయి. జుట్టు రేగివుంది. గొంతుపిసికి చంపారు. దారుణమయిన హత్య.

"హత్య ఎప్పుడు జరిగివుంటుంది డాక్టర్?" నన్ను నేను పరిచయం చేసుకుని అడిగాను.

"మొన్న రాత్రి ఏడున్నర ప్రాంతంలో జరిగివుండవచ్చు."

"శవాన్ని యెవరు చూసారు?" యస్.ఐ.ని అడిగాను.

"ఈయన" అంటూ పక్కనేవున్న యాభై ఏళ్లాయన్ని చూపించాడు.

"ఈ గదిలో యెవరుంటున్నారో కనుక్కున్నారా?"

"చెప్పండి" అన్నాడు యస్.ఐ. ఆయనతో.

"వారం క్రితం నా దగ్గరకు ఒకతను వచ్చాడు. నల్లగా పొడుగ్గా వున్నాడు. బాగాలావు. పొడుగాటి గడ్డం వుంది. కళ్ళజోడు పెట్టుకున్నాడు. నెత్తిమీద టోపీ. తను యీ గదిని వారంరోజులకు అద్దెకు తీసుకుంటానన్నాడు. ఏదో వ్యాపారం చేస్తున్నాడుట. ఈ గదిలో ఏవో ప్యాకింగ్‌లు

పెట్టుకుంటానన్నాడు. ముందుగానే డబ్బంతా ఇచ్చాడు.

నిన్నటితో వారంరోజులు అయిపోయింది. అతను నా దగ్గరకు మళ్ళీ రాలేదు. గది తాళంచెవి ఇవ్వలేదు. అందుకే ఈ ఉదయం వచ్చి ఇంకో తాళంచెవితో తలుపులు తెరిచాను. ఎదురుగా ఈ శవం కనిపించింది. వెంటనే పోలీసులకు ఫోన్ చేసాను."

"మిగిలిన గదుల్లో యెవ్వరూ అద్దెకు వుంటల్లేదా?"

"లేరు. మిగిలిన గదులన్నీ బాగాలేవు. వాటిని రిపేర్ చేయించాలి. ఈ ఒక్కగదే కొంచెం బావుంది."

"మీరు ఎక్కడ వుంటారు?"

"నాలుగురోడ్ల అవతల నాకు వేరే ఇల్లు వుంది."

తర్వాత అతన్నేమీ అడగలేదు.

వర్ధనరావు ఏడుపు ఆపేశాడు.

అంబులెన్స్ వచ్చింది. శవాన్ని మార్చురీకి పంపారు.

ఆ గదికి సీలువేసారు. పద్మ హాండ్‌బ్యాగ్, బుక్స్ తీసుకుని బయటకు వచ్చారు.

"అవసరమయితే మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను" అన్నాడు యస్. ఐ. ఇంటాయనతో.

"తప్పకుండా" అన్నాడు ఆయన.

జీపులో బయల్దేరాము.

ఇంటాయన వర్ణించిన అతని గురించే ఆలోచిస్తున్నాను. అతను-పద్మకోసం కాలేజీకి వచ్చినతను ఒకరుకాదు.... హంతకుడు మరోమనిషి. పద్మను ప్రేమించినతను సన్నగా వున్నాడు. గెడ్డంలేదు కాని ఇతనికి గెడ్డాలు వున్నాయి. లావుగా, నల్లగా వున్నాడు.

అసలు పద్మ ఆ గదిలోకి ఎలా వచ్చింది?

ఆలోచనలతో మెదడు వేడెక్కిపోతోంది.

జీపు వెళుతోంది.

"ఇక్కడ ఆపండి. నేను దిగిపోతాను" అన్నాను. అక్కడకి నా గది దగ్గరే.

"మీరు స్టేషన్‌కి రారా" అడిగాడు యస్. ఐ.

"తర్వాత వస్తాను సార్. హంతకుడెవరో ఆలోచించాలి. నేను గదికి వెళతాను."

"మీ ఇష్టం" అన్నాడు.

జీపు ఆగింది.

వర్ధనరావు భుజం తట్టి "బాధపడకు వర్ధనరావ్. జరగకూడనిది జరిగింది. హంతకుడిని తప్పకుండా పట్టుకుంటాం" అన్నాను జీపు దిగి.

వర్ధనరావు కళ్ళనిండా నీళ్ళు వచ్చాయి.

జీపు వెళ్ళిపోయింది.

నడిచి గదికి వచ్చాను.

4

సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ అరగంట గడిపాను. ఏవో రకరకాల ఆలోచనలు వస్తున్నాయి, పోతున్నాయి.

'పద్మ అతను కామత్ హోటల్‌నించి ఎక్కడకో వెళ్ళారు. ఆ తర్వాత యెక్కడో ఇద్దరూ విడిపోయారు. పద్మ వంటరిగా ఇంటికి బయల్దేరింది. అప్పుడు ఆమెను యెవరో కలుసుకున్నారు. అతనూ పద్మకు తెలిసిన వాడే. అందుకే అతనితో గదికి వెళ్ళింది. అక్కడ యిద్దరికీ ఏదో గొడవ జరిగింది. హంతకుడు పద్మ గొంతు నొక్కి చంపేశాడు. తర్వాత గదికి తాళంపెట్టి వెళ్ళిపోయాడు.

ఇది ముందుగానే ప్లాను వేసుకుని చేసిన హత్య. అందుకే అతను వారం రోజులకు ఆ గదిని అద్దెకు తీసుకున్నాడు. బహుశ అతను మారువేషంలో ఇంటి యజ

మానిని కలుసుకుని వుండాలి. అతనికి ఆ మారువేషం లేకపోతే? అసలు అతను మారువేషం యెందుకు వేసుకున్నాడు?' ఇలా ఆలోచిస్తున్నాను.

నాకేదో స్ఫురించింది.

వెంటనే అల్మరాలో వున్న ఏడాదిక్రితం కాలేజీ మేగజైను బయటకు తీశాను. గబగబా పేజీలు తిప్పాను. నా చూపు ఒకచోట ఆగిపోయింది. పరీక్షగా చూశాను.

సంతోషంతో ఈల వెయ్యాలనిపించింది. నా ఆలోచన సరయినదయితే వీడే హంతకుడు.

గబగబా ఆ ఫోటోను బ్లేడుతో కోశాను. దాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాను.

స్కూటర్‌ను బయటపెట్టాను. గదికి తాళంపెట్టి స్కూటర్‌మీద బయల్దేరాను.

శరవేగంతో దూసుకుపోతోంది స్కూటరు. నా ఆలోచనలు స్కూటరుకంటె వేగంగా ప్రయాణిస్తున్నాయి. నా డిటెక్టివ్ కథారచయిత మెదడు బాగానే పనిచేస్తోంది. కథలు రాసేవాడిని స్వయంగా ఓ కేసు పరిశోధించటం నాకూ థ్రిల్లింగ్‌గానే వుంది.

స్కూటరు ఓ ఇంటిముందు ఆగింది.

లోపలకు నడిచాను. చిన్నడాబా. వరండాలోవున్న కాల్‌బెల్ నొక్కాను. తలుపులు తెరుచుకున్నాయి. ఎదురుగా ఆయనే—ఇంటి యజమాని.

"మీరా!" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును. చిన్న పనుండి వచ్చాను. ఈ ఫోటో చూడండి. ఇందులో ఆ గదిని అద్దెకు తీసుకున్న మనిషి వున్నాడేమో చెప్పండి" అన్నాను ఆ ఫొటోను ఆయనకు ఇచ్చి.



ఓ నిముషంపాటు చూసి "ఇదుగో ఇతనే నా దగ్గరకు వచ్చింది గది కోసం'' అన్నాడు వాడినే చూపించి.

"బాగా చూపి చెప్పండి'' అన్నాను.

"సందేహం లేదు. ఇతనే....ఎవరితను? ఈ ఫోటో మీకు ఎలా వచ్చింది?'' అనడిగాడు.

"తర్వాత చెబుతాను. చాలా థాంక్స్ మీ సహాయానికి'' అని బయటకువచ్చి మళ్ళీ స్కూటరు యెక్కి ముందుకు దూకించాను.

పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను.

యస్. ఐ. లేదు. ఎక్కడికో వెళ్ళాడుట. ఇంకో అరగంటలో రావచ్చునన్నాడు రైటర్.

మళ్ళీ బయటకు వచ్చాను.

వర్ధనరావు ఇంటికి వెళ్ళాను. అతనూ ఇంట్లోలేడు. తల్లి వుంది. ఆమె గుండెలు పగిలేలా ఏడుస్తోంది. పక్క ఇళ్ళవాళ్ళు ఆమెను సమదాయిస్తున్నారు. నన్ను చూడగానే

ఆమె ఏడుపు మరింత యెక్కువయింది.

ఎలాగో ఓదార్చాను.

"పద్మ బుక్స్ పెట్టుకునే పెట్టె ఏదయినా వుందా?" అనడిగా నామెను.

"ఉంది" అంటూ ఓ ఇనుప్పెట్టెను చూపించింది.

గబగబా దాన్లో పుస్తకాలన్నింటినీ వెతితాను. ఏమీ కనిపించలేదు. పెట్టె అడుగునవున్న న్యూస్‌పేపర్ని బయటకి తీసాను. నాలుగయిదు ఉత్తరాలు కనిపించాయి. అందులో మూడు పద్మను ప్రేమించినతను రాసినవి. ఇంకో వుత్తరము అతను రాసినది కాదు. దాన్ని చదివాను. ఆ వుత్తలన్నింటినీ మడిచి జేబులో పెట్టుకుని పెట్టె మూసాను.

"ఏం కావాలి నాయనా?" అడిగిందామె.

"ఏమీలేదు. మీరు కాస్త ధయిర్యంగా వుండండి. పద్మను పొట్టన బెట్టుకున్న వాడు తప్పకుండా ఈ రోజు దొరికి తీరుతాడు" అని బయటకు వచ్చాను.

మళ్ళీ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళాను.

యస్. ఐ. అప్పుడే వచ్చాడుట.

జరిగిందంతా ఆయనతో చెప్పాను. ఆ ఉత్తరాలు చూపించాను.

ఆయన షాకయ్యాడు.

"రియల్లీ యూ ఆర్ జీనియస్" అన్నాడు సంతోషంగా.

"థాంక్స్ సార్" అన్నాను.

"అయితే ఇప్పుడు మనం ఏం చేద్దాం?" అన్నాడు.

"వేలిముద్రలు వచ్చాయా?" అడిగాను.

"ఇంకా రాలేదు... వాటి కోసమే ఎదురు చూస్తున్నాను."

ఐదు నిముషాలు గడిచాయి.

ఓ పోలీసు ఆ గదిలో దొరికిన వేలిముద్రల ప్రింట్లు తీసుకొచ్చాడు.

''ఐతే ఇక మనం బయల్దేరవచ్చు'' అన్నాను.

''వర్ధనరావు రానవసరంలేదా?'' అడిగాడు యస్. ఐ.

''అవసరం లేదు. నాకు తెలుసు... పదండి....'' అన్నాను.

నా స్కూటర్‌ను అక్కడే వుంచి పోలీసు జీపులో యస్. ఐ. ఇద్దరు పోలీసులూ, నేనూ వరంగల్లుకు బయల్దేరాం.

5

'మెటల్ ఇండస్ట్రీస్' ముందు ఆగింది జీపు.

గబగబా అందరూ దిగాము. మాతోపాటు వరంగల్లు స్టేషన్ యస్. ఐ.ను కూడా తీసుకువచ్చాము. వేలిముద్రల నిపుణుడు కూడా వచ్చాడు.

బయటపని చేస్తున్న కొందరు మమ్మల్ని చూడగానే ఆశ్చర్యపోయారు.

''గణపతి వున్నాడా!'' ఒకతన్ని అడిగాను.

తల వూపాడతను.

ఆఫీసు లోపలకు వెళ్ళాం.

ఓ కుర్చీలో కూర్చుని ఏదో ఫైలు చూస్తున్నాడు గణపతి.

మమ్మల్ని చూడగానే కలవరపడ్డాడు.

''అతనే'' అన్నాను.

''అరెస్ట్ హిమ్'' అన్నాడు యస్. ఐ.

ఓ పోలీసు గణపతి చేతులకు బేడీలు వేశాడు.

గణపతి మొహంలో నెత్తురు చుక్కలేదు.

షాక్....

''ఏమిటిదంతా?'' అన్నాడు తేరుకుని.

''నటించకు గణపతీ'' అన్నాడు.

''యూ డెవిల్....నేనేం చేశాను?'' అన్నాడు.

"పద్మను హత్య చెయ్యలేదా?" అన్నాను.

"నేను కాదు."

"వేలిముద్రలు తీసుకోండి" అన్నాను.

ఫింగర్ ప్రింట్స్ ఎక్స్‌పర్ట్ గణపతి వేలిముద్రలు తీసుకున్నాడు.

ఇంతలో తన గదిలోనించి బయటకు వచ్చాడు మేనేజర్....

"గణపతి ఈ మధ్య సెలవు పెట్టాడా?" అడిగాను.

"యస్. వారం రోజుల్లు సెలవుపెట్టాడు. నిన్ననే డ్యూటీలో జాయినయ్యాడు. ఇదేమిటి? ఏం చేసాడితను" అడిగాడు మేనేజర్.

"హత్య చేసాడు."

"హత్యా!" నోరు తెరిచాడాయన.

ఎక్స్‌పర్ట్ గదిలో దొరికిన వేలిముద్రలతో గణపతి వేలిముద్రలను టాలీచేసాడు.

"నో డౌట్....రెండూ ఒక్కటే" అన్నాడు.

"ఇంక తప్పించుకోలేవు గణపతీ" అన్నాను.

"యూ బాస్టర్డ్" అన్నాడు పళ్లుకొరుకుతూ.

"షటప్" అరిచాడు ఎస్. ఐ.

బయటకు వచ్చాము.

"ఇప్పుడు వివరంగా చెప్పండి" అన్నాడు యస్. ఐ.

జీపులో యెక్కాము.

"గణపతి, నేను, వర్ధనరావు క్లాసుమేట్సుం. గణపతి పద్మకు బావ అవుతాడు. ఇతనికి తల్లి తండ్రీ లేరు. ఇక్కడే వుండి చదువుకున్నాడు. అప్పుడే పద్మను ప్రేమించాడు. కాని పద్మ మరొక యువకుడిని ప్రేమించింది. ఈ విషయం గణపతికి తెలిసింది పద్మ మీద పగబట్టాడు. అయితే ఈ విషయం బయట పెట్టలేదు. పద్మతో మంచిగానే వుంటున్నాడు.

చదువు అయిపోయిన తర్వాత అతనికి ఇక్కడ మెటల్ ఇండస్ట్రీస్‌లో వుద్యోగం వచ్చింది. ఇక్కడకు వచ్చిన తర్వాత చివరిసారిగా ఓ వుత్తరాన్ని పద్మకు రాశాడు. కాని పద్మ అతని ప్రేమను అంగీకరించలేదు. దాంతో పద్మ మీద పగ, కసి మరింత పెరిగాయి. ఆమెను హత్య చెయ్యాలనుకున్నాడు. ఒక ప్లాను రూపొందించుకున్నాడు.

ఆ ప్లాను ప్రకారం వారం రోజులు లీవుపెట్టి హైద్రాబాదు వచ్చాడు. మారువేషం వేసుకున్నాడు. ఈ మారువేషమే గణపతిని మనకు పట్టియిచ్చింది. గణపతి ఇలాటి వేషం వెయ్యటానికి కారణముంది.

మేము డిగ్రీ ఫైనలియర్‌లో వుండగా ఓ నాటిక వేసాం. అందులో గణపతి ఇలాంటి వేషమే వేసుకున్నాడు. ఆ వేషం అతనికి చాలా బావుందని అసలు అతన్ని గుర్తుపట్టలేక పోయామనీ చాలామంది పొగిడారు. అందుకే గణపతి తనని ఎవ్వరూ గుర్తుపట్టకుండా వుండటానికి ఆ వేషం వేసుకున్నాడు. ఆ వేషంతోనే అక్కడ ఓ గదిని అద్దెకు తీసుకున్నాడు.

పద్మ బయట యెక్కడయినా కనిస్తుందేమోనని వెతుకుతున్నాడు. ఆ రోజు తను ప్రేమించినతన్ని విడిపోయిన

తర్వాత పద్మ ఇంటికి బయలదేరింది. అప్పుడు గణపతి ఆమెను కలుసుకున్నాడు. ఏదో మాట్లాడాలని ఆ గదికి తీసుకు వెళ్లాడు. తనని ప్రేమించమని ఒత్తిడి చేసాడు. పద్మ వినలేదు. గొంతు నులిమి చంపి వెళ్ళిపోయాడు" చెప్పటం ముగించాను.

"జరిగింది ఇదేనా?" అడిగాడు యస్. ఐ. గణపతిని. గణపతి చిన్నగా తలవూపాడు.

"థాంక్స్ మిస్టర్ ప్రతాప్. ఈ కేసును పూర్తిగా మీరు పరిశోధించినట్లే. యూహావె బ్రయిట్ ఫ్యూచర్" ఎస్.ఐ. అన్నాడు నాతో కరచాలనం చేసి.

"థాంక్యూ సార్" అన్నాను గర్వంగా.

జీపు వరంగల్ పోలీస్ స్టేషన్ముందు ఆగింది. □

అదీ వరుస?

ఆర్డినరీ బస్సులో ప్రయాణంచేస్తూ, బస్సుప్రతిచోట ఆగటాన్ని భరించలేక, విసిగిపోయి నబాజీ ప్రక్కనున్న వ్యక్తితో యిలా అన్నాడు.

"చెత్తకుప్ప కనపడగానే మునిసిపాలిటీ ఎద్దుబండి ఆగిపోతుందట, అలావుంది దీనివరుస"

"అవును, నువ్వు కనిపించగానే ఈ బస్సు ఆగలేదూ మరి!" అన్నాడు కండక్టరు వెంటనే అందుకుంటూ.

—అంధవరపు మల్లిబాబు.

ఫస్ట్ నైట్

వాణిశ్రీ

సరాసరి పోలీస్ స్టేషన్‌లోకి వచ్చి విష్ చేసిన ఆ యువకుడి వంక ఎగాదిగా చూసాడు ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి.

"నా పేరు రాజారావు సార్. జిల్లాపరిషత్‌లో క్లర్కుగా పనిచేస్తున్నాను" అన్నాడు.

"చెప్పండి" అన్నాడు అసలు సంగతి ఏమిటన్నట్లు.

షర్టు జేబులోనుంచి బ్రౌనుకలరు కాగితపు కవరు బయ

టకు తీసి అందులోనుంచి ఒక ఫోటోతీసి ఇన్స్పెక్టర్‌కి అందించాడు రాజారావు.

అది ఒక యువతి ఫోటో.

మీనాల్లాంటి కళ్ళతో, గుండ్రటి ముఖంతో అందంగా వుంది ఆమె. వయస్సు ఇరవై యేళ్ళు దాటి వుండొచ్చు.

"ఆమె కమల. నా భార్య సార్" అన్నాడు రాజారావు.

"ఏమయింది?"

"రెండు రోజులనుంచి కనిపించడం లేదు సార్!" దిగులుగా అన్నాడు రాజారావు.

ఆశ్చర్యంగా చూసాడు ఇన్‌స్పెక్టర్.

"మెంటల్ రిజార్డర్ ఏమయినా వుందా?"

"అటువంటిది ఏమీలేదు సార్."

"ఒకవేళ ఆమె బంధువుల యింటికి గాని, పుట్టింటికి గాని వెళ్ళిందేమో?"

"ఈ వూళ్లో మాకు బంధువులు యెవరూ లేరు. మా అత్తగారి వూరికి ట్రంకాల్ చేసి మాట్లాడాను. అక్కడకి రాలేదని చెప్పారు. ఏం చెయ్యాలో తోచక మీ దగ్గరకు వచ్చాను." దీనంగా వుంది అతని ముఖం.

కృష్ణమూర్తికి అతన్ని చూస్తే జాలివేసింది. భర్తకి చెప్పకుండా వూరువిడిచి వెళ్ళే ఆడది యెటువంటిది. క్యారెక్టర్ మంచిది కాదేమో? ఇతను చూస్తే అమాయకుడిలా వున్నాడు.

"మీకు పెళ్ళయి యెంతకాలమయింది?"

"ఆర్నెల్లు."

"అంతేనా?"

"అంతేసార్?"

'కొంపదీసి పెళ్ళికాక ముందే ఎవరితోనయినా సంబం

ధము వుందేమో ఆమెకు. ఇప్పుడు భర్తని మోసంచేసి చెప్పకుండా లేచిపోయిందేమో?' ఆలోచిస్తోన్నాడు కృష్ణ మూర్తి.

- "మీ భార్య గురించి ఏం చెప్తారు?" ప్రశ్నించాడు ఇన్ స్పెక్టర్.

అయోమయంగా చూసాడు రాజారావు. ఇన్స్పెక్టర్ ప్రశ్నకు జవాబు ఏం చెప్పాలో స్ఫురించలేదు అతనికి.

"ప్లీజ్ డోంట్ మైండ్! ఆమె ప్రవర్తన మంచిదేనా?"

"పెళ్ళి అయిన తర్వాత నాకు ఏ తప్పూ కనిపించలేదు సార్. కాని...."

"కాని...."

"పెళ్ళికాకముందు వాళ్ల పక్కింట్లోవున్న అతనితో ఏదయినా సంబంధం వుందేమోనని నా అనుమానం" తల వంచుకుని అన్నాడు రాజారావు.

"ఎవరు అతను? మీ అత్తగారి తరపు బంధువా?"

"బంధువు కాదు సార్. బాగా చనువుగా వుండేవాడు మా అత్తగారి కుటుంబంతో. నా భార్య అతన్ని అంకుల్ అని పిల్చేది."

"అతనికి భార్యా పిల్లలు లేరా?"

"లేరు సార్. ఏదో యాక్సిడెంట్‌లో చనిపోయారట. విరక్తితో అతను మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు."

"ఎంత వుంటుంది అతని వయస్సు?

"ముప్పయి అయిదు వుండొచ్చు."

"అతని పేరు?"

"కైలాష్. సెంట్రల్ గవర్నమెంటులో వుద్యోగం చేస్తుండేవాడు. ఎందుకో బహూశా అవినీతి ఆరోపణల వల్ల కావచ్చు డిస్మిస్ చేసారు. ఏదో ప్రయివేట్ కంపెనీలో

పని చేస్తున్నాడు.”

తల వూపాడు ఇన్స్పెక్టర్ అతను చెప్పిన వివరాలన్నీ విని.

“అతని క్యారెక్టర్ మంచిది కాదని నా అనుమానం సార్!” అన్నాడు రాజారావు.

కృష్ణమూర్తి మరికొన్ని వివరాలు అతన్నించి తెలుసుకుని నోట్ చేసుకున్నాడు. తరువాత రాజారావు తన భార్య కనిపించడంలేదనీ, ఆమె జాడ తెలుసుకోవలసిందని పిటిషన్ రాసి ఇన్స్పెక్టర్‌కి ఇచ్చాడు.

“మీరుగూడా ట్రైచేస్తూ వుండండి” అన్నాడు యిన్స్పెక్టర్ కృష్ణమూర్తి.

“అలాగే!” అన్నాడు రాజారావు సెలవు తీసుకొని వెళ్ళిపోతూ.

2

‘రాజారావు భార్య కమల ఏమయివుంటుందా?’ అని తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు కృష్ణమూర్తి.

‘రాజారావు చెప్పిన సమాచారం ప్రకారం ఆలోచిస్తే ఆమె కైలాష్‌తో లేచిపోయి వుంటుందా? వాళ్ళిద్దరిమధ్య ప్రేమవుంటే ఆమె తలిదండ్రులను ఒప్పించి పెళ్ళిచేసుకునే వాడు గదా? ఇలా పెళ్లయిన ఆడపిల్లని తీసుకొని వెళ్ళిపోవడంవల్ల అతనికి సుఖం ఏముంది? అతను ఆమెను శాశ్వతంగా వుంచుకునే వుద్దేశ్యం లేనప్పుడుగూడా ఆమె పుట్టింటికి వచ్చినప్పుడు కలుసుకోవడానికి అవకాశం వుంది గదా?’

కృష్ణమూర్తికి ఏమీ తోచలేదు.

అతను ఇంటికివెళ్ళి భోజనం చేస్తూ వుండగా స్టేషన్ నుంచి ఫోన్ వచ్చింది. నారాయణపేటలో కృష్ణానది

ఒడ్డున ఎవరో ఒక ఆడమనిషి శవం కొట్టుకుని వచ్చినట్లు సమాచారం అందినట్లు చెప్పాడు కానిస్టేబుల్.

కృష్ణమూర్తి భోజనం ముగించి స్టేషన్‌కి వెళ్లాడు.

'ఆ శవం కమలది కాదుకదా!' అని అనుమానం వచ్చింది. తెలుసుకోవాలి వెంటనే అనుకున్నాడు.

నారాయణపేట పల్లెటూరు. టౌన్‌కి నాలుగు మైళ్ళు వుంటుంది.

పోలీస్ వ్యాన్ వేసుకొని నారాయణపేట వెళ్ళాడు.

రాత్రి తొమ్మిదయింది అప్పటికి. 'ఆకాశంలో నక్షత్రాలు తప్ప వెలుగులేదు. ఆరోజు అమావాస్య ఏమో!' అనుకున్నాడు.

ఊరి మధ్య ఆ వూరి కరణం, మునసబు మరికొందరు జనం వేపచెట్టుకింద అరుగుమీద కూర్చుని వున్నారు.

పోలీస్ వ్యాన్ చూసి అంతా లేచి వచ్చారు.

కృష్ణమూర్తి దిగగానే కరణం సుబ్రమణ్యం విష్‌చేసి శవం గురించి వివరాలు చెప్పాడు.

నది అక్కడికి ఫర్లాంగు దూరంలో వుంది. జీప్ వెళ్లదు. నడిచే వెళ్లాలన్నారు.

బ్యాటరీ లైట్లు వేసుకుంటూ వెళ్లారు నది దగ్గరకి.

సగం నీళ్లలోను సగం ఒడ్డున పడివుంది శవం. నీలం రంగుచీర అదేరంగు బ్లవుజు కట్టుకుంది. మెడలో బంగారు తాడు, మంగళసూత్రాలు వున్నాయి. చెవులకు తెల్లరాళ్ళ దుద్దులుగూడా వున్నాయి. శవం బాగా వుబ్బింది.

జేబులోనుంచి కమల ఫోటోతీసి పరీక్షగా చూసాడు. ఆ శవం కమలదే.

'ఓ మైగాడ్!' అని నిట్టూర్చాడు.

"ఈ శవం కమలదే" అన్నాడు ఇన్స్పెక్టర్, హెడ్ వెంకటస్వామితో.

3

కెమికల్ ఎగ్జామినర్ రిపోర్ట్ చూపి మతిపోయింది ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తికి.

కమల విషప్రయోగం వల్ల మరణించినట్లుంది ఆ రిపోర్టులో. ప్రమాదవశాత్తూ నదిలోపడి చనిపోలేదు.

కానిస్టేబుల్ని పంపించి రాజారావుని పిలిపించాడు.

అతను విచారంగా కనిపించాడు. పోస్ట్మార్టం రిపోర్టు చదివి ఆశ్చర్యపోయాడు.

"కమల విషం ఎందుకు తీసుకొంది?"

"అదే అర్థం కావడంలేదు. విషం ఆమె తీసుకున్నదా? లేక యెవరయినా విషం యిచ్చారా?" అన్నాడు యిన్స్పెక్టర్.

"నాకేమీ తోచడం లేదు. విషం తీసుకొని చనిపోదల్చుకుంటే అంతదూరం వెళ్ళడమెందుకు? ఆత్మహత్య చేసుకోవాల్సిన పరిస్థితులు ఆమెకు లేవు" అన్నాడు రాజారావు.

"మరి ఎవరయినా ఆమెకు విషం యివ్వాల్సినంత శత్రుత్వం వుందా? బాగా ఆలోచించండి."

రాజారావు తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తికి యెంత తీవ్రంగా ఆలోచించినా క్లూ దొరకడం లేదు.

'కమలను ఎవరో విషం ఇచ్చి చంపారు. సందేహం లెదు. ఆమె వంటిమీద బంగారం అలాగే వుంది కాబట్టి దొంగలు కారని స్పష్టమౌతుంది. కేవలం ఆమెను కావాలనే చంపారు యెవరో?'

కాసేపు కూర్చుని వెళ్ళిపోయాడు రాజారావు.



ఇన్‌స్పెక్టర్‌కి రాజారావుని చూస్తే జాలివేస్తోంది పాపం పెళ్ళయి ఆర్నెల్లుకూడా కాలేదు. అప్పుడే భార్య చనిపోవడము అదీ ఘోరంగా చంపబడటం.

అసలు కమల నారాయణపేట యెందుకు వెళ్ళింది? ఎప్పుడు వెళ్ళింది?

కమల శవం సోమవారం సాయంకాలానికి బయట పడింది. అంతకుముందు ఇరవయినాలుగు గంటల క్రితం ఆమె ప్రాణం పోయింది. అంటే శనివారం నాడు కమల నారాయణపేట వెళ్ళివుండాలి. లేదా ఆమెను మంచితనంగా యెవరో తీసుకెళ్ళి వుండాలి. లేదా ఆమె ప్రాణంపోయిన తర్వాత తీసుకెళ్ళి నదిలో పారేసి వుండాలి.

నారాయణపేట వెళ్ళడానికి సిటీబస్ ఒక్కటే మార్గం. కండక్టర్‌ని యెంక్వయిరీ చెయ్యాలి.

కృష్ణమూర్తి బులెట్ స్టార్ట్‌చేసి నారాయణపేట రోడ్డు మీద ఆపాడు. కాసేపటికి సిటీబస్ నారాయణపేట నుంచి వస్తూ కనిపించింది. చెయ్యెత్తి ఆపాడు. బస్ ఆగగానే హడలిపోతూ దిగాడు కండక్టర్. అతను దిగగానే భుజం

మీద చెయ్యివేసి కొంచెం దూరం తీసుకెళ్ళి చింతచెట్టు నీడలో ఆగాడు ఇన్స్పెక్టర్.

"శనివారంనాడు డ్యూటీచేసింది నువ్వేనా?" ప్రశ్నించాడు.

"అవును సార్."

"మీ ఓనర్ని అడిగితే నీపేరే చెప్పాడు" అంటూ జేబులోనుంచి కమల ఫోటోతీసి అతని చేతికి ఇచ్చాడు.

ఎవరో ఆడమనిషి ఫోటో తనకి ఇన్స్పెక్టర్ యెందుకిచ్చాడో అర్థంకాలేదు కండక్టర్‌కి.

"ఎవరు సార్?"

"ఆమె పేరు కమల. జాగ్రత్తగా జ్ఞాపకం తెచ్చుకో. శనివారంనాడు ఆమె టౌన్‌నుంచి నారాయణపేట వెళ్ళింది. ఆమెకు టిక్కెట్ కట్ చేసినవాడివి నువ్వే. బాగా గుర్తుకు తెచ్చుకో" అన్నాడు.

కండక్టర్ కాసేపు కళ్ళుమూసుకుని ఆలోచించి "అవును సార్!" అన్నాడు.

"జ్ఞాపకం వచ్చిందా?"

"వచ్చింది సార్! ఆమె నారాయణపేట మనిషికాదు. ఎవరింటికో చుట్టమై వుంటుందనుకున్నాను. ఎందుకుసార్? ఏం జరిగింది?"

"ఆమె మర్డర్ చెయ్యబడింది."

ఉలిక్కిపడ్డాడు కండక్టర్.

"ఇప్పుడు నా కొక ముఖ్యమైన సమాచారం కావాలి."

"ఏమిటి సార్?"

"ఆ రోజు ఆమెవెంట యెవరైనా వున్నారా?"

కండక్టర్ బాగా ఆలోచించి "మగవాళ్ళు యెవరైనా వున్నారేమో తెలియదు. కాని ఆమె ప్రక్కన ఆమె తరపు

ఆడవాళ్ళు మాత్రం యెవ్వరూ లేరు. ఒక్క టిక్కెట్టే తీసుకుంది" అన్నాడు.

విరాశపడ్డాడు ఇనస్పెక్టర్.

కండక్టర్ సెలవు తీసుకుని వెళ్ళిపోయాడు. బస్సు వెళ్ళిపోయింది టౌన్‌వైపు.

మళ్ళీ స్టార్ట్ చేసాడు బుల్లెట్. ఈ సారి నారాయణపేట వైపు సాగింది బండి. సరాసరి నది ఒడ్డుకి తీసుకెళ్ళి ఆపాడు. బండిదిగి అటూ ఇటూ పచార్లు చేసాడు.

ప్రశాంతంగా సాగిపోతూ వుంది నది. దూరంగా ఏదో పళ్ళతోట వుంది. ఫర్లాంగు దూరంలో నది ఒడ్డునే దేవాలయం వుంది. పూజారి దేవాలయం వైపు వెళ్తూ కనిపించాడు. గబగబా నడిచివెళ్లాడు.

గర్భగుడిలో నుంచి చిరుగంటలు మ్రోగుతున్నాయి. పూజారి మంత్రాలు చదువుతున్నాడు.

ఇన్‌స్పెక్టర్ ధ్వజస్తంభం దగ్గరే నిలబడిపోయాడు

కాసేపటికి పూజారి గర్భగుడిలో నుంచి బైటకు వచ్చాడు. పోలీస్ యిన్‌స్పెక్టర్ని చూసి నివ్వెరపోయాడు.

"నమస్కారం" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

పూజారి ప్రతినమస్కారం చేసాడు.

"లోపలకి రండి. స్వామి దర్శనం చేసుకోండి. మంత్ర పుష్పం యిస్తాను."

"నేను స్వామి దర్శనానికి రాలేదు. వచ్చింది మీ దర్శనానికే" అన్నాడు నవ్వుతూ.

అతను ఆశ్చర్యపోతూ దగ్గరికి వచ్చాడు.

కృష్ణమూర్తి కమల ఫోటో అతని చేతికి యిచ్చి "మొన్న నదిలో తేలిన శవం ఈ అమ్మాయిదే" అన్నాడు.

"నారాయణ...నారాయణ...ఎంత ఘోరం" అన్నాడు.

"ఆమె నదిలో పడి ఆత్మహత్య చేసుకుని వుంటుందని అందరూ అనుకున్నారు. కాని ఆమెకు విషయం యిచ్చి చంపి నదిలో పారేసారు."

"ఎవరో ఆ దుర్మార్గులు?"

"ఆ విషయమే తెలుసుకోవాలని తిరుగుతున్నాను. నా అంచనా ప్రకారం ఈ అమ్మాయి శనివారంనాడు టౌన్ నుంచి నారాయణపేట వచ్చింది. సాధారణంగా శనివారం నాడు దేవుడి గుడికి వస్తూ వుంటారు ఆడవాళ్ళు. ఈ అమ్మాయిని మీరు చూసారా? కాస్త గుర్తుకు తెచ్చుకోండి."

పూజారి కాసేపు తదేకంగా కమల ఫోటోవంక చూసాడు.

"మీరు అనుకున్నది నిజమే సార్. శనివారం మధ్యాహ్నం నేను గుడికి తాళంవేసి యింటికి వెళ్ళిపోయే సమయానికి ఆ అమ్మాయి, మరొక అతను మంటపంమీద కూర్చుని క్యారేజీలో తెచ్చుకున్న భోజనం చేస్తున్నారు."

ఇన్‌స్పెక్టర్ కళ్ళు మెరిసాయి.

"యస్. అతను యెవరు? ఎలా వుంటాడు?"

"నాకు సరిగా గుర్తులేదు. కాని అతనికి గడ్డం పెరిగి వుంది బాగా!" అన్నాడు.

"గడ్డం బాగా పెరిగి వుందా?"

"అవును. ఒక బెత్తెడు మందాన వుంది గడ్డం" అన్నాడు పూజారి.

4

అతనికి ఒత్తుగా పెరిగివుంది గడ్డం. అతను యెత్తుగా బలంగా వున్నాడు. తెల్లషర్టు, నల్లప్యాంటు వేసుకుని వున్నాడు. ఇన్‌స్పెక్టర్ ముందు దీనంగా నిల్చుని వున్నాడు.

"నిజం చెప్పు మిష్టర్ కైలాష్."

"నిజం ఇనస్పెక్టర్. నేను ఈ రోజే యింటికి తిరిగి వచ్చాను. పదిరోజుల నుంచి కాంప్‌లో వున్నాను" అన్నాడు కైలాష్.

"అందుకే నీ మీద అనుమానం బలపడుతోంది. శని వారంనాడు నువ్వు కమల ఇంటికి వెళ్ళావు. నారాయణ పేటలో గొప్ప దేవాలయం వుందనీ, మహిమగల దేవు డనీ, తప్పక చూడవలసిన స్థలమనీ ఆమెను నమ్మించి ఆ వూరు తీసుకెళ్ళావు. సాయంకాలం వరకూ వూరుకుని తినే పదార్ధంలో విషం ప్రయోగించావు. ఆమె ప్రాణం పొయ్యాక నదిలో పడేసి నీ దారిన నువ్వు పోయావు. చెప్పు. నువ్వెంత తెలివిగా హత్యచేసినా నిజాన్ని దాచ లేవు" తీవ్రంగా అన్నాడు ఇనస్పెక్టర్.

"కమలను నేను హత్య చేసానా? దారుణంగా మాట్లాడు తున్నారు ఇనస్పెక్టర్‌గారూ! కమల నా చెల్లెలులాంటిది" వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు కైలాష్.

"చెల్లెలులాంటిదేగాని చెల్లెలు కాదుగదా! నన్ను బుకా యించడానికి ప్రయత్నించకు. నువ్వు కమలని ప్రేమిం చావు. కాని ఆమె నిన్ను ప్రేమించలేదు. నువ్వు రెండో పెళ్ళి కమలని చేసుకోవాలని అనుకుని వుంటావు. ఆమె ఒప్పుకోలేదు. రాజారావుని పెళ్ళి చేసుకుని అత్తగారింటికి వెళ్ళిపోయింది. నువ్వు ఆమెమీద పగబట్టావు. ఆమె సుఖంగా వుండటం నువ్వు భరించలేకపోయావు. ఆమె బ్రతికివుండగా నీకు మనశ్శాంతి లేదని ఇంత దారుణం చేసావు!"

ఇనస్పెక్టర్ మాటలు వింటూ అతని ముఖం పూర్తిగా

పాలిపోయింది. దుఃఖం ఆగక ము ఖంమీద చేతులు వేసు కుని ఏడవసాగాడు.

"వృధాగా ఏడవకు. నీ కల్లిబొల్లి ఏడ్పులకు కరిగిపోయే వాళ్ళంకాదు. నీ లాంటి మేకతోలు పులుల్ని, నయవంచ కుల్ని లెక్కలేనంత మందిని చూసాను" ఇనస్పెక్టర్ కోపంతో అన్నాడు.

ఇంతలోకి ఒక వ్యక్తి హడావుడిగా లోపలకి వచ్చాడు. అతని వయసు దాదాపు అరవై ఏళ్లుంటాయి. తెల్లటి వెంట్రుకలు, గడ్డం మాపివుంది.

"ఇనస్పెక్టర్‌గారూ అతన్ని అనుమానించకండి" అన్నాడు వస్తూనే.

"మీ రెవరు?" అన్నాడు కృష్ణమూర్తి తీవ్రంగా.

"నేను కమల తండ్రిని" అన్నాడు అతను.

ఇనస్పెక్టర్ ఆవేశం తగ్గింది.

"కూర్చోండి. మీ పేరు?" అన్నాడు కుర్చీ చూపిస్తూ.

"నా పేరు పురుషోత్తం. ఇంటికి వెళ్తే తెలిసింది కైలాష్‌ని మీరు అరెస్ట్‌చేసి తీసుకొచ్చారని. తెలిసిన వెంటనే బస్‌లో వచ్చాను" అన్నాడు.

"మీరు కైలాష్‌ని అర్థం చేసుకోలేకపోతున్నారు. పురుషోత్తంగారూ!" అంటూ తను కైలాష్‌ని అరెస్ట్ చెయ్య డానికి గల కారణాలు, పూజారి చెప్పిన ఆనవాలు, తన అనుమానం అన్నీ వివరించాడు కృష్ణమూర్తి.

"మీ అనుమానాలన్నీ నిరాధారమైనవి ఇనస్పెక్టర్! కైలాష్ చాల స్వాతికుడు. అతను కేవలం చావలేక బ్రతుకు తున్నాడనే నిజం నాకు తెలుసు. అతని భార్య పిల్లలు ప్రమాదవశాత్తు ఒకేసారి మరణించడంతో జీవితంమీదే విరక్తి కలిగింది. ఆ విరక్తితో అవకతవకలు చేసి వుద్యోగం



పోగొట్టుకున్నాడు. ఎంతో కష్టంమీద ఒక కంపెనీలో వుద్యోగం ఇప్పించాను.

అతని తండ్రి మళ్లీ పెళ్ళిచేసి దారిలో పెట్టాలని ప్రయత్నించి విఫలుడై వెళ్ళిపోయాడు. అతని మంచితనం తెలిసిన నేను మొదట కమలను యిచ్చి పెళ్ళిచేయాలని అనుకున్నాను. కాని అతను ఒప్పుకోలేదు. కమలను తన చెల్లెలుగా భావిస్తున్నాననీ మళ్లీ పొరపాటునైనా ఆ ప్రసక్తి తీసుకు రావద్దని ఖచ్చితంగా చెప్పాడు."

కృష్ణమూర్తి అయోమయంగా తల వూపుతూ కూర్చున్నాడు తన అంచనాలన్నీ తారుమారై పోవడం చూసి.

"అటువంటి కైలాష్ కమలను హత్య చేస్తాడా? చెప్పండి సార్?"

పురుషోత్తం ప్రశ్నకి కృష్ణమూర్తి సమాధానం చెప్పలేకపోయాడు.

5

కమల హత్య జరిగి చాలా రోజులైంది. పోలీసుల ఇన్వెస్టిగేషన్‌లో హంతకుడు దొరకలేదు. ఇక కేసు మూసి

వెయ్యడం తప్ప గత్యంతరం తోచడంలేదు.

ఒకరోజు వుదయం అప్పుడే వచ్చిన వారపత్రిక తిర గేస్తున్నాడు ఇనస్పెక్టర్ కృష్ణమూర్తి.

ఒక పేజీలో పడిన ఫోటోగ్రాఫ్‌మీద అతని దృష్టి ఆగి పోయింది. రెప్పలు వెయ్యకుండా అలాగే చూసాడు.

అది తను నారాయణపేటలో చూపిన దేవాలయం. నది ఒడ్డున వాటర్ బ్యాగ్రౌండ్‌తో తీసాడు ఫోటో. అందులో లాంగ్‌షాట్‌లో ఇద్దరు మనుషులు. ఆడమగ. దంపతుల్లాగే వున్నారు. అతనికి గడ్డంవుంది. జాగ్రత్తగా చూస్తే ఆమె కమల అనిపించింది.

ఆ ఫోటోనే తదేకంగా చూస్తూ దీర్ఘంగా ఆలోచించ సాగాడు కృష్ణమూర్తి.

ఫోటోగ్రాఫర్ ఆర్. శశిభూషణ్ అని వుంది. ఆ వూరి వాడే అతను. కాని అడ్రస్ యెలా తెలుస్తుంది?

కృష్ణమూర్తి ఫోన్ ఎత్తి రంగూన్ ఫోటో స్టూడియోకి ఫోన్‌చేసాడు ఆర్. శశిభూషన్ అని ఫోటోగ్రాఫర్ ఎవరైనా ఈ వూళ్ళో వున్నారా? అని. వాళ్లు చెప్పలేకపోయారు.

వీక్లీలో ఆర్. శశిభూషణ్ పేరు తరచుగా చూస్తూనే వున్నాడు. అతను ఫోటోలు తీపి పత్రికలకు పంపడం హాబీగా పెట్టుకొని వుంటాడు. బహుశా అతనికి ప్రింట్స్ ఎన్లార్జిమెంట్స్ వేసుకోవడానికి స్వంత ఎక్విప్‌మెంట్ వుందేమో! అటువంటప్పుడు అతను స్టూడియోకి వెళ్ళవల సిన అవసరం ఏముంది?

'ఈ శశిభూషణ్ యెవరో తెలిస్తే బాగుండును' అను కున్నాడు.

చివరకి ఒక ఆలోచన వచ్చింది. పత్రికా ఆఫీసుకి ఫోన్ చేసి అతని అడ్రస్ తెలుసుకోవచ్చు.

టెలిఫోన్ డై రెక్టరీ వెతికి పత్రిక ఫోన్ నెంబర్ నోట్ చేసుకుని ట్రంకాల్ బుక్ చేసాడు.

అరగంత తర్వాత కాల్ వచ్చింది.

ఆర్. శశిభూషణ్, రెసిడెన్స్ ఆ వూళ్ళోనే కొత్త పేటలో మూడోలైను తొమ్మిదో నెంబర్ ఫ్లాట్ అని చెప్పారు పత్రిక వాళ్లు.

అడ్రస్ వెతుక్కుంటూ వెళ్ళాడు కృష్ణమూర్తి.

కాలింగ్ బెల్ నొక్కగానే తలుపు తెరిచాడు.

ఇనస్పెక్టర్ కృష్ణమూర్తిని చూసి ఒక్క క్షణం నివ్వెర పోయాడు అతను.

"శశిభూషణ్ మీరేనా?"

"అవును సార్!"

"మీరేం చేస్తుంటారు ఈ వూళ్లో."

"జూనియర్ కాలేజీలో జూనియర్ లెక్చెరర్ని సార్!"

"మీ ఫొటోలు తరచు పత్రికలలో చూస్తుంటాను" అన్నాడు కృష్ణమూర్తి.

"ఏదో హాబీ" నవ్వాడు.

"ఈ వారం వీక్లీలో నదీతీరాన దేవాలయం ఫొటో చూశాను. చాలా బాగుంది."

"అయ్యో! మీరు నిల్చునే వున్నారు. రండి....రండి లోపల కూర్చోండి" అంటూ ఆహ్వానించాడు.

కృష్ణమూర్తి కూర్చున్నాక లోపల్నుంచి కాఫీ వచ్చింది.

"ఆ ఫోటో గురించి కొంత విషయం కావాలి."

"అడగండి."

"దేవాలయం ప్రక్కగా నిల్చున్న జంట గురించి."

"వాళ్ళు ఎవరో సార్! నాకు పరిచయం లేదు. వాళ్ళని తియ్యాలని గూడా నా వుద్దేశ్యం గాదు. అది కాకతా

శయం." అన్నాడు.

"వాళ్ళని మీరు దగ్గరగా చూశారా?"

"లేదు సార్!"

"ఈ మధ్య ఒక మర్డర్ జరిగింది అక్కడ."

"గుళ్ళోనా?"

"కాదు ఆ సమీపంలో. కమల అని ఒకమ్మాయిని విషం ఇచ్చి చంపి నదిలో పడేశారు యెవరో. ఆరోజు ఆమెతో ఒక గడ్డం మనిషి వున్నట్లు సాక్ష్యం వుంది. అతను ఆ ఫోటోలో పడిన వ్యక్తి అని నా అనుమానం. ఆమె రూపం కమలలాగే వుంది గూడా!"

"కావచ్చు. అతనికి గడ్డం వుంది."

"మీరొక హెల్పు చెయ్యాలి."

"చెప్పండి సార్!"

"మీరా ఫోటో నెగిటివ్ తీసి వాళ్ళిద్దరూ వచ్చేటట్లు ఫుల్ సైజ్ ప్రింటు ఒకటి వేసివ్వాలి. అప్పుడు వాళ్ళని గుర్తుపట్టే అవకాశం వుండొచ్చు."

"తప్పకుండా వేస్తాను సార్! మీరు ఈజీగా గుర్తు పట్టొచ్చు. నాది చాల పవర్‌ఫుల్ కెమెరా! యాషికా 635 సార్. జపాన్‌ది." అన్నాడు శశిభూషణ్.

"నన్ను మళ్ళీ యెప్పుడు రమ్మంటారు?"

"మళ్ళీ ఎప్పుడో యెందుకు సార్! అరగంట కూర్చో గలిగితే నా డార్కు రూమ్‌లో ప్రింట్ వేసిస్తాను. నా దగ్గిర అన్నీ వున్నాయి సార్. పవర్‌ఫుల్ ఎన్లార్జర్ వుంది." అన్నాడు.

"అలాగైతే తొందరగా కానివ్వండి."

"ఈ రోజు ఆదివారం కదా సార్!"

"పోలీసులకి శనివారం ఆదివారం లేదు. ఇరవై

నాలుగు గంటలూ డ్యూటీయే!" అన్నాడు కృష్ణమూర్తి నవ్వుతూ.

శశిభూషణ్ ఆల్బం కృష్ణమూర్తి చేతికిచ్చి "చూస్తూ వుండండి సార్." అన్నాడు.

అతను ఫోటో ఆల్బం తిరగేస్తూ కూర్చున్నాడు.

6

"గడ్డం పెట్టుకుని నాటకం ఆడితే ఎవరూ కనిపెట్ట లేరనుకున్నావ్ గదూ! రాస్కెల్." రాజారావు చెంపమీద బలంగా కొట్టాడు కృష్ణమూర్తి.

రాజారావు ఏడుస్తూ "నన్ను కొట్టకండి సార్!" అన్నాడు.

"నిన్ను కొట్టడం కాదురా! చిత్రకథ చెయ్యాలి. అమ్మ రాస్కెల్. గడ్డం ఒకటి తగిలించుకుని పెళ్ళానికి విషం పెట్టి చంపి నదిలో తోసేసి ఏమీ ఎరగని వంగనాచిలా రిపోర్టు ఇస్తావా!" అంటూ వంగబెట్టి నాలుగు తగిలించాడు.

"నన్ను చంపకండి సార్! నిజం చెప్తాను సార్!"

"చెప్పు."

"కమలని నేనే చంపాను సార్!" ఏడుస్తూ చెప్పాడు రాజారావు.

"ఎందుకు చంపావు?"

"కమల మంచిది కాదు."

"ఎలా తెలుసు నీకు?"

"పెళ్ళికాక ముందు వాళ్ళింటి ప్రక్కన వున్న కైలాష్‌తో సంబంధం పెట్టుకుంది సార్!"

"అబద్ధం. కైలాష్ కమలను చెల్లెలుగా భావిస్తు న్నాడు.

"లేదుసార్! నిజం. వాళ్లిద్దరికీ సంబంధం వుంది. నేను కళ్ళారా చూశాను చనువుగా మసలడం."

"నువ్వు అనవసరంగా అనుమానించావు. నిజంగా వాళ్లిద్దరి మధ్య అటువంటి సంబంధం వుంటే పెళ్లి చేసుకునేవాడే గదా! నీ మామ కమలని ఇస్తానంటే గూడా తిరస్కరించాడు. ఆమె తన చెల్లెలు లాంటిదని అన్నాడు తెలుసా?"

"అదంతా నాటకం సార్! కమలతో ఎన్నో యేళ్లుగా అతనికి సంబంధం వుంది. ఆమె మీద అతనికి మోజు తీరి పోయింది. అందుకే పెళ్లి వద్దని చెల్లెలులాంటిదనీ బూటకపు కబుర్లు చెప్పాడు."

"నీ తెలివి ఏడ్చినట్టే వుంది. ఈ సంగతులు ఎలా నిర్ధారణ చేసుకున్నావు? కమల ఒప్పుకుందా పోనీ?" ప్రశ్నించాడు కృష్ణమూర్తి.

"నేను కమలని అడగలేదు యెప్పుడూ?"

"మరి వాళ్ళ సంబంధం నిజమేనని యెలా నిర్ణయించుకున్నావు?"

"అదంతా మొదటిరాత్రే తేలిపోయింది సార్!"

"మొదటిరాత్రా?" ఆశ్చర్యపోతూ అడిగాడు కృష్ణమూర్తి.

"అవును." తలవంచుకున్నాడు రాజారావు.

"ఎలా తెలుసుకున్నావు?"

"అప్పుడు కమల బాధపడలేదు."

"ఎప్పుడు?"

"మొదటి రాత్రి."

కృష్ణమూర్తి నివ్వెరపోయి చూశాడు అతన్ని.

"అంతేకాదు సార్! బట్టలు యెరుపు కాలేదు."

"మొదటిరాత్రి బాధపడతారనీ, బట్టలు ఎరుపు అవుతాయనీ ఎలా తెలుసు నీకు?"

రాజారావు తల యెత్తి "మంచివాళ్ళకి అలా జరుగుతుంది సార్!"

"అదే ఎలా తెలుసు నీకు? యెవరైనా బాధపడిన వాళ్లు నీకు తెలుసా?"

తల వూపాడు రాజారావు తెలుసునన్నట్లు.

"మా ఇంట్లో పని మనిషి వుండేది. దాని కూతురు పెద్దమనిషైంది. ఆర్నెల్ల తర్వాత మాకు సంబంధం కుదిరింది. మొదటిరోజు అది యెంతో బాధపడింది. ఏడ్చింది గూడా. బట్టలకు రక్తపు మరకలు అయ్యాయి సార్!"

అతను చెప్పే విషయం వింటుంటే కృష్ణమూర్తికి మతి పోయింది.

"ఒరేయ్ ఫూల్. అందరికీ అలా జరగదురా. నీ దంతా వుట్టి అనుమానం."

"లేదుసార్. మొదటిరాత్రి అలా జరుగుతుంది మంచి వాళ్ళకైతే. చెడిపోయిన వాళ్ళకి జరగదు. అలా అని నేను ఒక పత్రికలో కూడా చదివాను__"

"అందరికీ ఒకే పద్ధతి వుండదు. కమల చదువుకున్న అమ్మాయి. స్కూల్లో గేమ్స్ ఆడుతూ వుంటారు. ఆడ పిల్లలకి కన్నెపొరవల్ల రక్తం వస్తుంది. పెద్దమనిషై కొన్నేళ్లు గడిచాక, అదీ గేమ్స్ ఆడే పిల్లలకి యెప్పుడో చిరిగిపోతుంది." వివరించాడు యిన్‌స్పెక్టర్.

రాజారావు తలొంచుకున్నాడు.

'ఇటువంటి అజ్ఞానులు ఎందరున్నారో దేశంలో' అనుకున్నాడు కృష్ణమూర్తి బాధగా. □

బీచ్‌లో శవం

బొమ్మిడి అచ్చారావు

పాఠకుల పరిశోధన పోటీ-96

(బహుమతి రు. 50/-లు నగదు)

ఫోన్ గణ గణ మోగటంతో మెలకువ వచ్చింది డిటెక్టివ్ కిరణ్‌కి.

ఫోన్ ఎత్తి "హలో, ఎవరు?" అన్నాడు.

"హలో, యిన్‌స్పెక్టర్ శ్రీనివాస్ స్పీకింగ్! డిటెక్టివ్ కిరణేనా మాట్లాడేది?"

"ఎస్ మిస్టర్ శ్రీనివాస్! ఏ(ం)విటి యింత పొద్దుటే ఫోన్ చేసావు? సుప్రభాతమా?"

"మనకి చావు కబుర్లే సుప్రభాతాలు బ్రదర్! నువ్వు వెంటనే బయల్దేరి బీచ్‌కి రావాలి. హత్య జరిగింది. నీ సాయం కావాలి!"

"ఓ. కే! శవం సముద్రం నుంచి ఒడ్డుకు కొట్టు కొచ్చిందా? ఆడా మగా?"

"మగే? హతుడు యిరవయ్యేళ్ళ యువకుడు! హత్య సముద్రపొద్దునే జరిగింది, నిన్న రాత్రి ఎనిమిది ప్రాంతాల. కాలేజి కుర్రాడు. వివరాలు నువ్వొచ్చాక మాట్లాడుకుందాం. వెంటనే వస్తూన్నావు కదూ?"

"ఎస్! సరిగ్గా అరగంటలో బీచ్‌కొస్తాను." ఫోన్ పెట్టేసాడు కిరణ్.

మరో అరగంటలో కిరణ్ రాజ్‌దూత్ బీచ్‌లో వుంది.

కిరణ్‌ని చూడగానే విష్ చేసాడు యిన్‌స్పెక్టర్ శ్రీనివాస్. కిరణ్ ప్రత్యాభివాదం చేసాడు. శ్రీనివాస్ శవం వున్న చోటికి దారి తీసాడు అప్పటికే అక్కడ జనం గుమిగూడిపోయి వున్నారు. బీబీ వింగా కాలేజీ స్టూడెంట్సు గుంపులు గుంపులుగా వున్నారు.

జనాన్ని తప్పించుకొని హతుడి దగ్గరకు వెళ్లి పరీక్షగా చూసాడు కిరణ్. గుండెలవద్ద రెండు బలమైన కత్తిపోట్లు తగిలాయి: మొదటిపోటుకే, బహుశా, ప్రాణం పోయి వుండవచ్చు. చుట్టూ యిసకలో యెర్రటి నెత్తురు యింకిపోయింది.

"హతుడి దుస్తుల్లో యీ చీటీ వుంది, చూడు:" అని ఓ చిన్న ఉత్తరం లాంటి కాగితం కిరణ్ కందించాడు శ్రీనివాస్.

అందులో-"నా చెల్లెల్ని పాడు చెయ్యాలని చూస్తున్నావు. ఇకపై నా చెల్లితో కనిపిస్తే నిన్ను ప్రాణాలతో వదలను." అని వుంది. కింద సంతకం లేదు.

"ఈ చీటికి, యితని హత్యకు సంబంధముందని నా అనుమానం. ఈ చీటీ వ్రాసిందెవరో తెలియాలి:"అన్నాడు శ్రీనివాస్. కిరణ్ సాలోచనగా తల వూపాడు.

"ఈ కుర్రాడెవరో తెలిసిందా?" కిరణ్ అడిగాడు.

"తెలీకపోవడమేమిటి? స్థానిక కాలేజిలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ విద్యార్థులంతా అతని కోలీగ్స్:" అన్నాడు శ్రీనివాస్.

"హాస్టల్ రూంలో యితనితోబాటు యింకెవరైనా కలిసి వుంటున్నారా?" అడిగాడు కిరణ్.

శ్రీనివాస్ యిద్దరు కుర్రవాళ్ళని పిలిచాడు. "వీళ్లిద్దరు ప్రకాశ్ రూమ్మేట్సు. ఇతని పేరు రమేష్. యితని పేరు

నారాయణ" పరిచయం చేసాడు కిరణ్‌కి.

రమేష్, నారాయణ కిరణ్‌కి నమస్కారం చేసారు. కిరణ్ తన చూపులతో వాళ్ళిద్దర్నీ అంచనా వేసాడు. వాళ్లిద్దరు ప్రకాశ్ యీడు వాళ్ళు.

కిరణ్ వాళ్లని చూసి, "ప్రకాశ్‌ని మీరు చివరగా యెప్పుడు చూసారు?" అనడిగాడు.

"నిన్న సాయంత్రం అయిదు గంటలకి. బీచ్‌కి వెళ్తానని ఒక్కడూ బయల్దేరాడు. నేనుకూడా వస్తానంటే వద్దన్నాడు. అలా ఒక్కడూ వెళ్లటం మామూలే! అయితే రాత్రంతా రూంకి రాలేదు. ఉదయం, యిక పోలీసు రిపోర్టు యివ్వాలనుకుంటుండగా, హత్య జరిగినట్టు తెలిసింది. వెంటనే బీచ్‌కి వచ్చాం. శవాన్ని గుర్తు పట్టం," నారాయణ చెప్పాడు.

కిరణ్ రమేష్ వంక తిరిగి, "ప్రకాశ్‌కి అమ్మాయిలతో స్నేహం వుందా?" అనడిగాడు.

రమేష్ వెంటనే మాట్లాడలేదు. "నా కంతగా తెలీదు. ప్రకాశ్ నారాయణతో క్లోజ్‌గా వుండేవాడు. అతన్నడిగితే మీకు అన్ని విషయాలు తెలుస్తాయి" అన్నాడు.

కిరణ్ అదే ప్రశ్న నారాయణని అడిగాడు.

నారాయణ రెండు క్షణాలు తటపటాయించి. "ప్రకాశ్‌కి నిర్మల అనే అమ్మాయితో పరిచయముంది." అన్నాడు.

"ఆ అమ్మాయికూడా యితనితో చదువుకుంటోందా?"

"ఆ అమ్మాయి వుమెన్స్ కాలేజిలో డిగ్రీ ఫ్రిష్టియర్ చదువుతోంది."

శ్రీనివాస్, "శవాన్ని పోస్టుమార్టంకి పంపించనా, యింకా ఏమయినా పరీక్ష చేస్తావా?" అనడిగాడు కిరణ్‌నుద్దేశించి.

"ఒక్క నిముషం! యీ అబ్బాయిని కొన్ని ప్రశ్నలడిగి వస్తాను.... మిస్టర్ నారాయణా! ప్రకాశ్ ఆ అమ్మాయితో బాగా చనువుగా, అంటే.... సంబంధం పెట్టుకోవటం జరిగిందా?"

"నాకు తెలిసినంతవరకూ అదేం లేదు. అయితే వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకోవాలనుకున్నారు. బహుశా హద్దులు మీరే వుంటారని నా అనుమానం."

"ఇంకొక ప్రశ్న! నిర్మలకి అన్నయ్యలెవరైనా వున్నారా?"

"ఉన్నదే అన్న! ఆమెకు అతను తప్ప బంధువులు లేరు. అన్నయ్యతోనే వుంటోంది. అతనేదో ఉద్యోగం చేస్తుంటాడు."

"నిర్మల ప్రకాశ్‌తో తిరగటం అతనికి తెలుసా?"

"ఆ! ఓ సారి, బీచ్‌లో యిద్దరూ అతని కళ్ళబడ్డారట! అప్పుడేమీ గొడవ పెట్టకుండా, వాళ్ల చెల్లెల్ని యింటి కొచ్చాక బాగా హింసించి, కస్టడీలో వుంచాడట! కొన్నాళ్ల పాటు వాళ్ళిద్దరూ కల్సుకోలేదు."

"నిర్మలా వాళ్ళిల్లు మీకు తెలుసా?"

"ఓ సారి దూరంనించి చూపించాడు ప్రకాశ్. గుర్తు పట్టగలను" అన్నాడు నారాయణ.

"థాంక్యూ మిస్టర్ నారాయణ! మీరు కాసేపుండండి" అని కిరణ్ శవం దగ్గరకెళ్ళి ఓ సారి అపాదమస్తకం పరీక్షగా చూసాడు. మోకాళ్ల మీద వంగి, శవం చుట్టూ యిసకలో దేనికోసమో వెతుకుతున్నట్టు యిసకని కెలికాడు. ఏం ఆధారాలు కనిపించలేదు. ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీస్తున్నాడు. శవాన్ని బోర్లా తిప్పుతుండగా ఓ వస్తువు కిరణ్ దృష్టిలో పడింది. అది—తెల్లటి శిల్కు జేబురుమాలు. ప్లెయిన్‌క్లాత్ మీద చుట్టూ అందంగా లతలు కుట్టివున్నాయి. రుమాలుకి ఓ చివర ఏంగిల్‌లో "కె" (K) అనే ఇంగ్లీషు అక్షరం ఎర్రటి దారంతో కుట్టివుంది.

కిరణ్ ఆ రుమాలు తీసి జాగ్రత్త పెట్టాడు.

శ్రీనివాస్‌ని చూపి, "మిగతా పనులు పూర్తి చేయించు" అన్నాడు కిరణ్.

నారాయణని సమీపించి, "నిర్మల అన్న పేరేమిటి?" అనడిగాడు కిరణ్.

నారాయణ ఏదో గుర్తు చేసుకుని, "కృష్ణకుమార్! ఏదో ఆఫీసులో యు. డి. క్లార్కుగా పనిచేస్తోన్నాడు" అన్నాడు.

కిరణ్ సాలోచనగా తల పంకించి, "నాకు నిర్మల యిల్లు చూపించండి" అన్నాడు.

"అలాగే, పదండి!" బయల్దేరాడు నారాయణ.

కిరణ్ శ్రీనివాస్‌ని చూపి, "నీ పనులు అన్నీ పూర్తయాక, మా యింటికి రా! ఈ లోపల కొంత ఇన్ఫర్మేషన్ రెడీ చేస్తాను" అన్నాడు.

"అలాగే!" అంటూ శ్రీనివాస్ తన పనుల్లో మునిగి పోయాడు.

కిరణ్ నారాయణని వెనక కూచోబెట్టుకుని, రాజదూత్‌ని ముందుకు పరుగెత్తించాడు.

నారాయణ చెప్పిన గుర్తుల ప్రకారం రాజదూత్‌ని నడుపుతూ పదినిమిషాల్లో నిర్మలా వాళ్ళింటి దగ్గర ఆపాడు కిరణ్. అది రెండు పోర్షన్ల పెంకుటిల్లు.

"అదే సార్ నిర్మల వాళ్లుంటున్న యిల్లు" అన్నాడు నారాయణ.

"మిమ్మల్ని హాస్టల్‌వద్ద దింపుతాను. కాసేపు ఆ కిళ్లీ బడ్డీవద్ద వెయిట్ చెయ్యండి" అని చెప్పి, నిర్మల యింటి తలుపు తట్టాడు కిరణ్. తలుపు తట్టిన కాసేపటికి ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి తలుపులు తెరిచింది. ఎర్రగా పొడుగ్గా వుంది. చక్కటి ముఖవర్ఛస్సు. అబ్బాయిల్ని వెర్రెత్తించే చూపులు!

"ఎవరు కావాలండీ?" అనడిగింది, తననే దీక్షగా చూస్తున్న కిరణ్‌ని.

"నిర్మల మీరేనా?" అనడిగాడు.

"అవును, మీరెవరు?"

"నేను ప్రకాశ్‌కి కావలసినవాణ్ణి!"

"అలాగా. మీ పేరు? ప్రకాశ్ ఎప్పుడూ మీ గురించి నాతో చెప్పలేదే!"

"బహూశా చెప్పివుండకపోవచ్చు. నా పేరు కిరణ్. ప్రకాశ్ దూరపు బంధువు. అతని గురించి మీతో మాట్లాడాలని వచ్చాను" అన్నాడు కిరణ్.

ఆమె రెండు క్షణాలు ఏదో ఆలోచించి, "ఇలా కూచోండి" అని కుర్చీ జరిపింది.

కిరణ్ కూచుంటూనే యిల్లంతా ఓసారి పరీక్షగా చూసాడు. అతి సామాన్యమైన మధ్యతరగతి కుటుంబం. రెండు కుర్చీలు, మంచాలు తప్ప ఏ విధమైన ఫర్నిచర్ లేవు. ఇల్లు చాలా యిరుగ్గావున్నా, పొందికగానే వుంది.

కిరణ్ నిర్మల వంక చూసాడు. ఆమె ప్రశ్నార్ధకంగా అతన్నే చూస్తోంది. ప్రకాష్ మరణవార్త ఆమెకింకా తెలిసినట్టులేదు. తెలిస్తే షాక్ తింటుందేమో? మెల్లిగా సంభాషణలోకి దింపాడు.

"మీరీ రోజు కాలేజీకి పోలేదా?" అనడిగాడు.

"కాలేజీ లేదండీ! ప్రిపరేషన్ హాలిడేస్ యిచ్చారు."

"మీతో యీ యింట్లో యింకా ఎవరున్నారు?"

ఆమె అనుమానంగా అతనివంక చూసింది. "మా అన్నయ్య, నేను—అంతే! అమ్మ నాన్న చిన్నప్పుడే పోయారు. అన్నయ్య ఉద్యోగంచేస్తూ, నన్ను చదివిస్తున్నాడు."

"మీ వదినగారు, పిల్లలు...."

"అన్నయ్యకింకా పెళ్లికాలేదు. ఇంతకీ, యీ వివరాలన్నీ మీరెందుకడుగుతున్నారో అర్ధం కావడంలేదు."

"మిస్ నిర్మలా! ప్రకాశ్, మీరు వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్టు తెలిసింది. ఆ విషయం మాట్లాడాలనే వచ్చాను. మీ వివాహం మీ అన్నయ్య కిష్టమేనా?"

నిర్మల రెండుక్షణాలు మాట్లాడలేదు. "ఇష్టం లేదు. అతన్ని కల్సుకోవడం తన కళ్లబడితే, నన్నూ, అతన్ని కూడా నరికిపారేస్తానన్నాడు. నేనీ మధ్య ప్రకాశ్ ని కలవలేదు, అన్నయ్యకి భయపడి!"



"ఈ ఉత్తరం చూడండి! మీ అన్నయ్య దస్తూరియో కాదో జెప్పగలరా!" కిరణ్-శ్రీనివాస్ యిచ్చిన చీటీ ఆమె కందించాడు.

నిర్మల చీటీ పరీక్షగా చూసి, "అన్నయ్య దస్తూరిలానే వుంది. అయితే, యీ ఉత్తరం రాసినట్టు ప్రకాశ్ నా కెప్పుడూ చెప్పలేదు. బహుశా, యీ మధ్య వారం రోజుల లోపల రాశాడేమో, బెదిరించటానికి!" అంది.

"నిర్మలా! ధైర్యంగా వుండండి. మీకో దుర్వార్త!"

నిర్మల కళ్లు భయంతో టపటప కొట్టుకున్నాయి.

"ప్రకాశ్‌ని నిన్నరాత్రి యెవరో చంపేశారు!"

కెవ్వుమన్న కేక ఆమె గొంతులోనే ఆగిపోయింది. నిలువెల్లా ఒణికిపోతోంది. చెమట్లు పోశాయి. స్పృహ తప్పి పడిపోతుందేమోనని అనుమానించాడు కిరణ్.

"మీరలా కూచోండి. ధైర్యం తెచ్చుకోండి. మీ పరిస్థితి నేనూహించుకోగలను. పెళ్లి చేసుకోవాలనుకున్న ప్రేమికుడు హత్యచెయ్యబడటం మీకు తీరని సంతాపం కలిగిస్తుందని నాకు తెలుసు! మీ కీ వార్త చెప్పాల్సి వచ్చి

నందుకు సారీ!"

ఆమె చేతుల్లో మొహం దాచుకుని సన్నగా రోదించింది. కాసేపటికి కళ్ళు తుడుచుకుని, "ఈ ఘోరం చేసిందెవరు? వాణ్ణి ముక్కలు ముక్కలు చేసెయ్యండి?" అంది రోషంగా.

"వాడికోసమే మేము వెతుకుతున్నాం. ఇందులో మీ సహాయం కావాలి. ప్రకాశ్‌కి శత్రువు లెవరైనా వున్నారా?"

ఆమె దుఃఖాన్ని దిగమింగింది. "నాకు తెలిసినంత వరకు అతనికి శత్రువులెవరూ లేరు."

కిరణ్ చేతి రుమాలుని బయటికి తీసి, "ఈ రుమాలు యెవరిదో గుర్తుపట్టగలరా?" అనడిగాడు.

ఆమె రుమాలుని చూస్తూనే ఆశ్చర్యపడి, "ఇది మీకెలా దొరికింది! ఇది మా అన్నయ్యది. నేనే బోర్డరు కుట్టాను" అంది.

"ఇక్కడ 'కె' అని పొడి అక్షరం కుట్టారు. కె అంటే...."

"అది మా అన్నయ్య పేరుకి పొడి అక్షరం. మా అన్నయ్య పేరు కృష్ణకుమార్!"

"ఈ చేతిరుమాలు మీ రెవరికైనా యిచ్చారా?"

నిర్మల తల వంచుకుని, "చానాళ్ళ క్రితం ప్రకాశ్ రూంలో దీన్ని మర్చిపోయాను. ఆ రోజు చేతిరుమాళ్ళు ఏవీ లేక పైనేవున్న అన్నయ్య కర్చీఫ్ తీసుకెళ్లాను. తర్వాత వెతుక్కుంటే కనిపించలేదు" అంది.

"నిన్న రాత్రి మీ అన్నయ్య యెక్కడికైనా బయటికి వెళ్లాడా?"

ఆమె కిరణ్‌వంక అనుమానంగా చూసింది. "మీరు

మా అన్నయ్యని అనుమానిస్తున్నారా?"

"ఈ ప్రశ్నకి సమాధానం చెప్పండి!"

"నాకు తెలిసి నిన్న సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చి నప్పట్నుంచీ అన్నయ్య ఎక్కడికీ వెళ్ళలేదు."

"అంటే, ఆఫీసు నుండి యెన్ని గంటలకొచ్చాడు?"

"మామూలుగానే. ఏడుగంటలు దాటుతుండగా! మా అన్నయ్య తత్వం నాకు బాగా తెలుసు. జాలి గుండె! కాలికి దెబ్బ తగిలి రక్తం చిందితేనే కళ్ళు తిరిగి పడి పోతాడు. అంత సున్నితమైన మనసు కలవాడు."

"మరి, ప్రకాశ్‌ని చంపుతానని ఉత్తరం రాశాడు, మీ యిద్దరు కలిస్తే నరికిపారేస్తానన్నాడు?...."

"అన్నయ్య ఆత్మాభిమాని! పరువుకోసం ప్రాణం పెడ తాడు. నేను చెడిపోతానని, తనకి చెడ్డపేరు తెస్తానని, కోపంతో అలా బెదిరించాడు."

"ఆవేశపడకండి. మీ అన్నయ్య కనిపించరు, ఎక్కడికి వెళ్ళారు?"

"ఇప్పుడు పదకొండు దాటింది. ఆఫీసుకు వెళ్ళి గంట పైగా అయింది."

"ఆల్‌రైట్! మిమ్మల్ని మరెవరైనా ప్రేమించటం జరిగిందా?"

"ప్రకాశ్ రూమ్‌మేట్ రమేష్ కూడా నన్ను ప్రేమి స్తున్నట్లు ఒకసారి ప్రస్తావించాడు. కాని అతని ప్రేమను సున్నితంగా తిరస్కరించాను."

"ఓకే. థాంక్యూ వెరీమచ్! అవసరమైతే మళ్ళీ కలు స్తాను" లేచాడు కిరణ్.

"చూడండి!" పిలిచింది నిర్మల. "వీలయినంత వరకు

నన్ను బయట పెట్టకండి, ప్లీజ్! పదిమందికీ తెలిసి పరువు బజారుకెక్కితే అన్నయ్య ఆత్మహత్య చేసుకుంటాడు" అంది ప్రాధేయపూర్వకంగా.

"అలాగే....ప్రయత్నిస్తాను" అని డిటెక్టివ్ కిరణ్ బయటికి నడిచాడు.

*　　*　　*

[ఇదీ కథ. జరిగిన పరిశోధన ఆధారంగా ప్రకాశ్‌ను చంపిన దెవరో కనుగొని మాకు వ్రాయండి. మీ సమాధానం 7-5-'8 తేదీలోగా మాకు చేరాలి. హో౦. డె. సభ్యులు కానివారు తమ సమాధానంతో 50 పైసలు పోస్టుస్టాంపులు జతపరచాలి. అత్యుత్తమ పరిశోధన చేసిన ఇరువురు పాఠకులకు చెరొక రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది. ఫలితాలు జూలై '80 నెల సంచికలో చూడండి. —ఎడిటర్.]

ఖైదీ మరణం?

కానిస్టేబుల్: సార్....సార్.... సెల్‌లో ఏదో నంబరు ఖైదీ చచ్చి పడున్నాడు!!

ఇన్స్‌పెక్టర్: నువ్వు వాడికి సక్రమంగా అన్నం పెట్టావా? (కోపంతో ఎగిరిపడ్డాడు.)

కానిస్టేబుల్: పెట్టానుసార్! అన్నం తిన్న తరువాతనే చచ్చాడు వాడు!!

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

నిప్పులేని పొగ

వి. లక్ష్మీదేవి

నీలిమ తన ఎదురుగా నున్న అతనివైపు చూసింది.

అతడికి సుమారు ముప్పయ్ అయిదు సంవత్సరాలుంటాయి. మనిషి యెర్రగా, దృఢంగా వున్నాడు. మల్లెపూవు లాంటి తెల్లని షర్టు, పాంటు వేసుకున్నాడు. అతను దేనిగురించో ఆందోళన పడుతున్నట్లుంది. నుదుట చిరుచెమట, మొహంలో అలసట స్పష్టంగా కన్పిస్తున్నాయి.

మరో రెండు రోజులు వారిరువురిమధ్య నిశ్శబ్దం చోటు చేసుకుంది. చివరికి గొణుగుతున్నట్లుగా అన్నాడు.

"మేడమ్! నేనెంతో ఆశతో వచ్చాను డిటెక్టివ్ రాబర్ట్ గారిని కలవాలని. ఇప్పుడు ఏమి చేయాలో నాకు తోచటం లేదు," నిరాశగా అన్నాడు.

నిట్టూర్చింది నీలిమ. "అయామ్ వెరీ — వెరీ సారీ! నిజానికి రాబర్టు ఈ రోజు ఉదయమే ఢిల్లీనుండి రావాల్సింది. అయినా ఫరవాలేదు. ఆయన అసిస్టెంట్లమయిన గ్లోరియా, నేనూ ఉన్నాము. మీకు వచ్చిన కష్టం ఏమిటో చెప్పండి. మాకు చేతనైనంత సహాయం చేస్తాం."

"అదే ఆశతో వచ్చాను" శ్రీనివాస్ చెప్పటం మొదలు పెట్టాడు. "దయచేసి ఈ విషయం పోలీసులకి తెలియ జేయవద్దు. ఒకవేళ తెల్సినా, నాకు వారు ఏ విధమైన సహాయమూ చేయలేరు. రోజులు గడిచేకొద్దీ నా బ్రతుకు మరింత అసహ్యకరంగా తయారవుతున్నది. ఏం చేయాలో అర్థం కావటంలేదు."

"ఏ విషయంలో?"

"వదంతులవల్ల. సారీ! టూకీగా చెప్తాను. సంవత్సరం క్రితం నా భార్య పోయింది. ఆమె కొంత కాలంగా మంచంలో తీసుకుని పోయింది. కానీ, లోకులంతా ఆమెని నేనే చంపానని, అంటున్నారు. విషం పెట్టి చంపానని లోకం కోడై కూస్తూంది."

"డాక్టర్! మీరు నిజంగా ఆమెకి విషంపెట్టి చంపారా?"

"మిస్ నీలిమా." హఠాత్తుగా డాక్టర్ శ్రీనివాస్ కుర్చీ లోంచి ముందుకు వంగాడు కోపంతో.

"ప్లీజ్! రిలాక్స్ యువర్ సెల్ఫ్! నేనూహించగలను డాక్టర్ మీ పరిస్థితి. ఇలాగే ప్రతి ఒక్కరూ, అంటుంటే,

మీరు పొందే ఆవేదన నాకు అర్థమైంది."

"థాంక్స్! మీరు చెప్పింది నిజం. ప్రాక్టీసు పెట్టాలన్న ఆలోచన రాగానే, నేను పల్లెటూరులో ప్రాక్టీసు పెట్టాలనుకున్నాను. వెంటనే వేటపాలెంలో డిస్పెన్సరీ తెరిచాను.

కానీ .. నా భార్యపోయిన తర్వాత, యెవ్వరూ నాతో స్నేహభావంతో వుండటం లేదు. అంతా నన్ను హంతకుడిని—దోషిని చూసినట్టుగా చూస్తున్నారు. నా ప్రాక్టీసు కూడా పడిపోయింది. సంపాదన తగ్గిపోయింది. డబ్బు సంగతి కాదు—నాకు డాక్టరుగా చెడ్డపేరు వస్తుందని దిగులు. నేను ఎక్కడికి వెళ్లినా ఒకటే గుసగుసలు. భార్యకి విషంపెట్టి చంపానని," డాక్టర్ శ్రీనివాస్ కళ్లలో నీళ్లు తిరిగాయి.

"ఈ పరిస్థితిని యెలా యెదుర్కోవాలో నాకు అర్థం కావటంలేదు." ముగించాడు.

నీలిమ జాలిగా శ్రీనివాస్ వంక చూసింది.

"నిజమే! వదంతులు సామాన్యమైనవి కాదు. వాటివల్ల మనిషి విసిగి—విసిగి పిచ్చివాడై పోయే అవకాశం వుంది. వదంతులు చాలా ప్రమాదకరమైనవి. ఏది ఏమైనా మీ కేసు నాకు చాలా కుతూహలం కలిగిస్తున్నది. ఈ వదంతులవి రూపుమాపగల శక్తి నాకు వుందో, లేదో తెలీదు. అయినా ప్రయత్నిస్తాను. మీరు నాకు అన్నీ వివరంగా చెప్పాలి. మీ భార్య పోయిందన్నారు—సంవత్సరం క్రితం. ఆమె చావుకి కారణం ఏమిటి?"

"గ్యాస్ట్రిక్ అల్సర్!"

"శవ పరీక్ష జరిగిందా!"

"లేదు. ఆమెది సహజమైన మరణం. ఆమెకి గ్యాస్ట్రిక్

అల్సర్‌వల్ల మరణం సంభవించింది."

నీలిమ తల వూపింది. "కానీ డాక్టర్! గ్యాస్ట్రిక్ అల్సర్‌తో పోయినప్పుడు శరీరంలో కలిగే రసాయన మార్పులు, ఆర్సనిక్ పాయిజన్‌వల్ల పోతే, శరీరంలో కలిగే మార్పులూ ఇంచుమించు ఒక్క టే. ఈ విషయం మీకు తట్టలేదా?"

"నాకు నిజంగా ఆ ఆలోచన రాలేదు. కారణం నేను ఆమెది సహజమైన చావని అనుకోవటం." చెప్పాడతను.

"ఆమెకీ—మీకూ వయస్సులో తేడా వుందా?"

"బహుశా నా కంటె నాలుగు సంవత్సరాలు చిన్నది."

"మీ పెళ్లి అయి యెన్ని సంవత్సరాలైంది?"

"ఎనిమిది సంవత్సరాలు."

"ఆమె పోయినందువల్ల, ఆమె ఆస్తి మీకేమయినా వచ్చిందా?"

తలూపాడతను.

"ఎంత?"

"దాదాపు యెనిమిది లక్ష లనుకుంటాను."

"గుడ్! చాలా పెద్ద మొత్తమే! అంటే—ఆమె వీలు నామా వ్రాసిందా?"

"అవును."

"డాక్టర్ శ్రీనివాస్! మీరు, మీ భార్యా సఖ్యతగా వుండేవారా?" తీక్షణంగా చూస్తూ అడిగింది నీలిమ.

"అవును."

"అంటే యెలాంటి కలతలు లేకుండా...."

"వెల్!" చెప్పసాగాడు డాక్టర్. "నా భార్య గురించి ఇక్కడ ఓ విషయం చెప్పాలి. ఆమె ఆరోగ్యం పూర్తిగా క్షీణించిన తర్వాత, ఆమె మంచంలోనే ఉండాల్సిన పరి

స్థితి ఏర్పడింది. ఆమెకి నాపైన అపనమ్మకం యెందుకు కల్గిందో నాకే అనూహ్యం. ఆమెని సంతోషపెట్టాలంటే, తాతలు దిగివచ్చేవారు. ఎంత నచ్చచెప్పినా, ఆమె మొహంలో అసంతృప్తి—మొండి వాదనకి దిగేది. కొన్ని కొన్నిసార్లు నేను ఏమి చెప్పినా విన్పించుకునేది కాదు."

"అవును. ఆమెని మీరు నిర్లక్ష్యం చేస్తూన్నారని కోపం కావచ్చు బహుశా!"

"థాంక్‌గాడ్! మీరు అర్థం చేసుకున్నారు."

నీలిమ తలవూపుతూ అంది. "ఆమెని యింటి దగ్గరే వుంచారా?"

"అవును."

"మీ డిస్పెన్సరీ...."

"అదీ మా యింట్లోనే."

"ఐ. సీ! మీ భార్య విషయాలు మీరే స్వయంగా చూసుకునేవారా?"

"లేదు. నర్స్‌ని పెట్టాను."

"ఎలాంటిది ఆమె?"

"చాలా తెలివయినది. పైగా నెమ్మదస్తురాలు."

"ఈ వదంతులు పుట్టటానికి కారణం ఆమె అయి వుంటుందా?"

"నో! నో! ఆమె అలాంటిది కాదు."

"నా ప్రశ్న మీరు సరిగా అర్థం చేసుకున్నట్లు లేదు. ఈ వదంతులు ఇలా వ్యాపించడానికి కారకులు యెవరయినా కావచ్చు. మీ నర్స్ కావచ్చు. మీ దగ్గిర పని చేస్తున్న పని మనుష్యులు కావచ్చు. పుకార్లు పుట్టాయంటే, దేనికయినా కారణం వుంటుంది."

డాక్టర్ శ్రీనివాస్ వింటున్నాడు.

"ఎవరామె?"

"ఇందులో ఓ స్త్రీ పాత్రకూడా వుందని మీరెందుకు అనుకుంటున్నారు?" అడిగాడు శ్రీనివాస్.

నవ్వింది నీలిమ. "డాక్టర్! ఒక వ్యక్తి తన భార్యకు విషంపెట్టి చంపాడు అని లోకం అంటే, దానికి రెండే రెండు కారణాలు కన్పిస్తాయి. తన భార్య చనిపోతే, తను కోరిన యువతిని పెళ్ళి చేసుకోవటం మొదటిది. తనభార్య పోతే, ఆమె పోయినందువల్ల తనకు సంక్రమించే ఆస్తిని అనుభవిస్తూ జల్సాగా గడపాలన్న కోరిక రెండో కారణం. మీరు చదువుకున్న వారు. వైద్య వృత్తిని చేపట్టిన వారు డబ్బుకి కొదువలేదు. కాబట్టి రెండవ కారణం కొట్టివేయవచ్చు. పోతే, మొదటి కారణం కావచ్చు. అందుకే ఈ వదంతులు వ్యాపించి వుంటాయి. నాకు ఆడ వారి మనస్తత్వం బాగా తెల్సు. ఇటీజ్ ఆల్ సైకాలజీ!"

"నిజమే నీలిమగారూ! బహుశా వాళ్ళు గోమతిని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రచారం ప్రారంభించి వుండవచ్చు."

"గోమతి? ఎవరామె?"

"నా అసిస్టెంట్."

"ఎంతకాలం మీ దగ్గర పని చేసింది?"

"మూడు సంవత్సరాలు."

"మీ భార్యకి యిష్టమేనా, ఆమె మీ దగ్గర పని చేయడం?"

"లేదు__లేదనుకుంటాను."

"ఎందుకు? అసూయా?"

"ఏమో నాకు తెలీదు."

"గోమతి మీ భార్యకంటే, అందంగా వుంటుందా?"



"ఎందుకు ఈ వివరాలు మీకు?"

"డాక్టర్ సహజంగా స్త్రీని చూస్తే స్త్రీకి పడదు. ఓర్వలేనితనం కొన్ని విషయాల్లో. గోమతి మీ దగ్గిర పని చేయటం మీ భార్యకి యిష్టంలేదని మీరు చెప్పారు. అయినా ఆమె మీ దగ్గిర మూడు సంవత్సరాలు పని చేసింది. కారణాలు ఏవైనా వుండవచ్చు. డాక్టర్! మీరు పూర్తిగా నిజం చెప్పటంలేదు. నిజం చెప్పండి. మీరు మీ భార్యని మనస్ఫూర్తిగా ప్రేమించారా?"

నుదురు రాసుకుంటూ, అన్నాడు శ్రీనివాస్.

"ఈ విషయం అనుక్షణం నన్ను చంపుకుతింటున్నది. మీరు అన్నది నిజమే! నేను నా భార్యని యెప్పుడూ ప్రేమించలేదు. ఆమె అంటే నాకు అస్సలు యిష్టం లేదు. కానీ—ఆమెకి నేను యెలాంటి లోటు చేయలేదు. అన్నీ సమకూర్చేవాడిని."

"మరి గోమతి మిమ్మల్ని అడిగితే పెళ్లి చేసుకునే వారేనా?"

"ఆ ప్రశ్న నేను గోమతిని అడగాలి. ఆమె వుద్దేశ్యం నాకు తెలీదు."

నీలిమ ఏదో ఆలోచిస్తూ అంది. "ఇప్పటికి మీరు అంతా నిజమే చెప్పారని ఆశిస్తాను. ఈ విషయం నేను విచారిస్తాను డాక్టర్! కానీ—ఓ విషయం. నేను యెప్పుడూ నిజాన్ని నిరూపించి, నిర్దోషిని రక్షించాలని ప్రయత్నిస్తాను. నా ప్రయత్నంలో మీరు దోషి అయితే మాత్రం తప్పించు కోలేరు."

"మీ పరిశోధన నన్ను దోషిగా నిరూపించటానికి నేను ఏదైనా నేరం చేస్తే కదా!" నవ్వాడు డాక్టర్ శ్రీనివాస్.

2

కారు నెమ్మదిగా పోతున్నది. వున్నట్లుండి హఠాత్తుగా అంది గ్లోరియా. "డియర్ నీలూ! నీ ధైర్యం ఏమిటో నాకు అర్థం కావటంలేదు. డాక్టర్ తన భార్యని హత్య చేయలేదని యెలా నిరూపించగలవ్? ఈ పచ్చి పల్లెటూరులో మనకు కావాల్సిన విషయాలు యెవరు చెబుతారు?"

నీలిమ సమాధానం చెప్పలేదు. సీరియస్‌గా కారు నడుపుతూంది.

గ్లోరియా ఆమె వాలకం చూసి, ఇక యేమీ మాట్లాడ లేదు.

కారు ఓ యింటిముందు ఆగింది. "అవును. ఇదే" నన్నట్లుగా తలూపింది గ్లోరియా.

"రైట్! నీవు కారు తీసుకుని మనకు డాక్టరు ఏర్పాటు చేసిన గదికి వెళ్లు. నేను విచారించి వస్తాను." అంటూ నీలిమ కారు దిగింది.

గ్లోరియా వెళ్లిన తర్వాత, నీలిమ మెట్లు యెక్కి తలుపు తట్టింది. దాదాపు రెండు నిమిషాల తర్వాత తలుపులు

తెర్చుకున్నాయి.

తలుపు తెరిచిన స్త్రీని గోమతిగా గుర్తించింది నీలిమ. తనని తాను పరిచయం చేసుకుంది.

"అవునవును! శ్రీనివాస్ చెప్పాడు మిమ్మల్ని కల్సుకున్నట్టుగా. రండి!" లోపలికి ఆహ్వానించింది.

"ఏం? డాక్టరు నన్ను కల్సుకోవటం మీకు యిష్టం లేదా?"

"ఉన్నా, లేకపోయినా, మీ సహాయం కోరటం జరిగి పోయింది కదూ?"

"గోమతిగారూ! మీ ధోరణి చూస్తే నాకు నవ్వు వస్తున్నది. డాక్టరుగారిపైన లేనిపోని పుకార్లు బయలు దేరాయి. ఆయన మీకోసం తన భార్యని హత్య చేశాడని ఈ ఊరంతా అనుకోవటం మీరు వినలేదా? దానికి మీరు చేసింది యేమిటి?"

"ఏమి చేయాలి? అందరి దగ్గరకి, వదంతులు—లేనివన్నీ కొండలు చిలువలుగా కల్పించి చెప్పేవారి దగ్గరికి వెళ్ళి బ్రతిమాలమంటారా? 'దయచేసి మీరు అలా అనుకో వద్దు. శ్రీనివాస్‌కీ నాకూ ఎలాంటి సంబంధం లేదు. మీరు అపోహ పడుతున్నారు. ప్లీజ్! దయచేసి ఈ ప్రచారాన్ని ఆపేయండి' అని వాళ్ళ కాళ్లు పట్టమంటారా? నా మాట విని వాళ్లు ఈ గుసగుసలు మానేస్తారా? చెప్పండి నీలిమా?" అవేశంగా అంది గోమతి.

నీలిమ గోమతిని చూస్తూ నిట్టూర్చింది. తిరిగి గోమతి అంది.

"అఫ్‌కోర్స్! నేను ఇవ్వన్నీ నమ్మటంలేదు. శ్రీనివాస్ తన భార్యకి విషంపెట్టి చంపాడంటే నేను నమ్మలేను. అతను అలాంటివాడు కాదు. అయినా డాక్టరు మాత్రం

ఏమి చేయగలడు. ఈ పుకార్లని లక్ష్యపెట్టకుండా ఉంటే సరి."

క్షణం తర్వాత నీలిమ అంది. "మీరు డాక్టర్‌ని పెళ్ళి చేసుకోబోతున్నారా?"

ఈ ప్రశ్న విని గోమతి ఆశ్చర్యం ప్రకటించలేదు. కను రెప్పలు నిమిషంపాటు ఆడించి "ఆయన యిష్టపడితే తప్పక చేసుకుంటాను" అంది.

"అయితే ఆయన భార్య చనిపోవటం మీకు బాగా అనుకూలించినదనుకుంటాను?"

"నిజానికి ఆమె చనిపోయిన రోజున నేను చాలా సంతోషపడ్డాను. ఆమెకు కృతజ్ఞత లేదు, అతను యెంత చేసినా?"

"మీరు నిర్మొహమాటంగా అడిగినదానికి సమాధానం యిస్తున్నందుకు థాంక్స్! మీరు పెళ్ళి చేసుకున్నంత మాత్రాన ఈ ప్రచారం ఆగిపోదు. నాదో చిన్న సలహా."

"చెప్పండి."

"మీపెళ్ళి యెలాంటి అవాంతరాలు లేకుండా జరగాలంటే, ఈ విషయం మీరు వెంటనే పోలీసులకి చెప్పండి."

"వాళ్ళుమాత్రం ఏం చేయగలరు?"

"సహాయం చేయగలరనుకుంటాను."

"ఎలా?"

"డాక్టర్‌భార్య శవం పాతిపెట్టారు కదూ?"

"అయితే?"

"శవ పరీక్షచేసి, విషంవల్ల చావలేదని తెలిస్తే,అందరి నోర్లూ మూతపడిపోతాయి."

ఉలిక్కిపడింది గోమతి. ఆమె కళ్ళు భయంతో రెపరెపలాడాయి. ఆమె పెదాలు విచ్చుకున్నాయి. ఆశ్చర్యంతో

"నో. నేను ఒప్పుకోను" పిచ్చిగా అర్చింది.

"ఎందుకని గోమతీ! ఒక్క ఈ శవపరీక్షతో సమస్య లన్నీ పటాపంచలయిపోతాయి."

"మీ ఉద్దేశ్యం నా కర్థమయింది. గ్యాస్ట్రిక్ అల్సర్‌వల్ల పోయినప్పుడు శరీరంలో జరిగే మార్పులూ—అర్సనిక్ పాయిజన్‌వల్ల పోయినప్పుడు జరిగే మార్పులు ఇంచుమించు ఒక్కటేనని మీరు డాక్టర్‌తో అన్నారుట. అయినా మీరు అనవసరంగా తాపత్రయ పడుతున్నారనుకుంటాను. ఆమె అర్సనిక్‌వల్ల చనిపోయిందని యెందుకనుకోవాలి? ఎన్నో పాయిజన్స్ వున్నాయి. నాకు నమ్మకంలేదు శరీరంలో అర్సనిక్ వుందని. మీరు కనుక్కోలేరు. శవపరీక్ష చేయటానికి ఏమి దొరుకుతుందని అస్తిపంజరం తప్ప."

నీలిమ సమాధానం చెప్పలేదు.

3

దమయంతికి సుమారు ఇరవై యెనిది సంవత్సరాలు వుంటాయి. అద్భుతమైన అందం కాదుకానీ, అనాకారి మాత్రం కాదు.

నీలిమ ఓ ప్రయివేటు డిటెక్టివ్ అని తెలియగానే, బెదురుతుందని ఊహించిన నీలిమకి దమయంతిలో ఎలాటి మార్పు కన్పించలేదు.

"అయితే, దమయంతిగారూ! మీరు డాక్టర్ శ్రీనివాస్ గారి దగ్గర నర్స్‌గా పనిచేసారు?"

"అవును. ఆయన భార్య పోయిన క్షణంవరకూ, ఆవిడకు సేవ చేసాను."

"డాక్టరుగారిపై ఈ ఊళ్ళో వున్న ప్రచారం ఎంతవరకు వర్తిస్తుంది?"

"యస్! నేనూ విన్నాను. అది చెడు ప్రచారమనే నేను

నమ్ముతున్నాను. కాని నేను ఏమి చేయగలను చెప్పండి."

"ఎందుకు ఇలా ప్రచారం జరిగింది అంటారు?" అడిగింది నీలిమ. "నిప్పులేనిదే పొగ రాదు కదండీ. డాక్టర్ గారు ఆయన భార్యని సరిగా చూసుకునేవారా?" అడిగింది తిరిగి.

దమయంతి వెంటనే సమాధానం చెప్పలేదు. "అదే అర్థం కావటంలేదు యెవరు పుట్టించారోగానీ, ఆయన తన భార్య విషయంలో చాలా జాగ్రత్తగా వుండేవారు. ఆమె మనస్సు కష్టపెట్టకుండా, విసుగు కల్గించకుండా...."

"అయివుండవచ్చు. కానీ డాక్టర్ తన భార్యకి విషం యెందుకు పెట్టి వుండకూడదు. ఆమె చనిపోయిన తర్వాత సహజ మరణం అని అందరికీ చెప్పి...." ఆగింది నీలిమ.

నవ్వింది దమయంతి. "బావుంది. ఒకవేళ నేను కాదంటే, మీరు అహనంటారా? ఒప్పుకుంటారా?"

"అందుకే ఓ పని చేయాలనుకుంటున్నాను" అంది నీలిమ.

"ఏమిటి?"

"శవాన్ని త్రవ్వి-తీసి పరీక్ష చేయిస్తే, అంతా బయట పడిపోతుంది. నా అనుమానమే నిజమైతే....!"

కలవరంగా నీలిమవైపు చూసింది దమయంతి. "మై గాడ్! మీరు యేదో వూహిస్తున్నారు. శవాన్ని తీసి శవ పరీక్ష చేస్తారా? విషప్రయోగం జరిగిందని మీ అనుమానమా?" నిటారుగా కూర్చుని అడిగింది.

"పాజిబులిటీస్ చూస్తోన్నానంతే! అన్నట్లు డాక్టర్— గోమతిగారి గురించి మీ అభిప్రాయం యేమిటి?"

"ప్రత్యేకంగా నేను చెప్పేది యేముంది? అందరూ అనుకుంటున్నదే! అది నిజం—కాదని నేను అనలేను.



ఓసారి డాక్టర్-గోమతి మాట్లాడుకుంటుంటే, విన్నాను."

"దయచేసి వివరిస్తారా?"

"ఇందులో దాచటానికి ఏముంది? డాక్టర్‌గారి భార్య విపరీతమైన నొప్పితో బాధ పడుతున్నది. ఈ విషయం ఆయనకి చెప్పాలని డిస్పెన్సరీలో అడుగుపెట్టబోయి అప్రయత్నంగా ఆగిపోయాను. గోమతి డాక్టర్ ప్రక్కన కూర్చుని అంటున్నది—

"ఇంకెంత కాలం శ్రీనూ! మన విషయం వీలయినంత త్వరలో తేల్చేయ్."

డాక్టర్‌గారు సమాధానం చెబుతున్నారు. "ఇంకెంత కాలమో లేదు గోమతీ! మనం అనుకున్న సమయం— యెదురుచూసిన క్షణం త్వరలో రాబోతున్నది."

"అంతా మనం అనుకున్నట్లే జరుగుతుందా?"

"ఎందుకు జరగదు? పొరపాటు చేయకుండా యింత వరకూ జరుగుతున్నది కదా?"

ఆ తర్వాత గోమతి మాట్లాడలేదు.

"ఇదీ సంగతి నీలిమగారూ! నేను విన్న విషయం. కానీ, ఈ సంభాషణకి నేను అంత ప్రాముఖ్యత యివ్వ లేదు. కారణం డాక్టర్, గోమతీ చాలా మంచి ఫ్రండ్స్. గోమతి చాలా కాలంగా నాకు తెల్సు. ఆమెది అతి సున్నిత హృదయం. ఏదయినా నిర్మొహమాటంగా మాట్లాడు తుంది."

"మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే డాక్టర్ తన భార్యకి విషప్రయోగం చేసాడని తెలుస్తోంది కదూ?"

నవ్వింది దమయంతి. "ఏమో ఆయన విషం పెట్టాడని నేను అనలేదే."

దమయంతి చాలా తెలివయినదానిలా కన్పించింది.

"మీరు నాకేమయినా చెప్పటం మర్చిపోయారా? జ్ఞాప కము తెచ్చుకోండి" అడిగింది నీలిమ.

"నాకు తెల్సింది చెప్పాను. అంతకుమించి యేమీలేదు."

"అయితే నా ప్రయత్నం ఫలించేట్లు లేదు. వెంటనే శవాన్ని తీయించి పరీక్ష చేయించాలి."

"నిజంగా చేయిస్తారా? మైగాడ్! పాపం చచ్చి నరకం అనుభవించాల్సిన గీత వ్రాసివుంది. శవంలో విషం వుంది అని నిర్ధారణ అయితే, హంతకుడు దొరికినట్లేనా?" ఈ మాటలన్నప్పుడు ఆమె మొహం పాలిపోయింది.

"ముందు విషప్రయోగం జరిగిందని నిర్ధారణ కావా లిగా" అంటూ లేచింది నీలిమ.

ఆ తర్వాత దమయంతి దగ్గర్నుండి నీలిమ తిన్నగా పోస్టు ఆఫీసుకి వెళ్ళి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శివపాదానికి ఫోన్ చేసింది.

"మిస్ నీలిమా! ఆర్‌యూ ష్యూర్! లేకపోతే నాకు చాలా చెడ్డపేరు వస్తుంది. అనవసరంగా అందర్నీ శ్రమ

పెట్టాననీ, వాళ్ళ సమయం వృధాచేశాననీ....” ఇంకేదో చెప్పబోతున్నాడు శివపాదం:

“నథింగ్ టు వర్రీ ఇన్‌స్పెక్టర్! నా అంచనా తారుమారు కావటం జరగదు. మీరు కొంచెం త్వరగా యీ విషయాలు....”

“ఆల్‌రైట్! ఆల్‌రైట్! మీ డిటెక్టివ్ ఏజన్సీ అనవసరంగా ఏదీ కోరదని తెల్సు. నేనే స్వయంగా చూస్తాను యేర్పాట్లు” చెప్పాడు శివపాదం.

4

శివపాదం నవ్వుతూ ‘యూ ఆల్‌రైట్ మిస్ నీలిమా! మానవ ప్రయత్నం ఎప్పుడూ వృధాపోదు.”

నీలిమ నవ్వలేదు. సీరియస్‌గా ఆలోచిస్తోన్నది. ఉన్నట్లుండి ఆమె కనుబొమ్మలు ముడిపడ్డాయి. ఎదురుగా నర్స్ దమయంతి హడావిడిగా లోనికి వస్తున్నది

“నిజమా? నమ్మలేకుండా వున్నాను. ఆమెకి విష ప్రయోగం జరిగిందా? ఇప్పుడే డాక్టర్ శ్రీనివాస్ చెప్పారు. మీరు ఆయనకి ఫోన్ చేసారుట కదూ?”

“శవపరీక్ష జరిగి గంట అయింది. శ్రీనివాస్‌కి తెలియపర్చాము. మనిషి చావటానికంటే, యెక్కువ మోతాదులో ఆమెకి ఆర్సనిక్ ఇచ్చారు.”

“అయితే డాక్టరుకి శిక్ష తప్పదా?

“ఏమో! నిరూపించాలిగా. ఇంకా మా ప్రయత్నాలు పూర్తికాలేదు. ఏ విధంగా ఆమె శరీరంలో ఆర్సనిక్ ప్రవేశపెట్టబడిందో తెల్సుకోవాలి. ఎవరు చేసారో తెల్సుకోవాలి?”

“నీలిమగారూ! నిన్న మీరు నన్ను కల్సుకున్నప్పుడు నేను ఓ విషయం చెప్పాల్సింది. అది అంత అవసరం అనుకోలేదు. దానికి కారణం గోమతి కూడా డాక్టర్ దగ్గర

పని చేస్తూంది."

"దమయంతీ! మీరు యేదో దాస్తున్నారని నాకు నిన్ననే తెల్సింది. మీరు యిప్పటికయినా నిజం చెప్పటం మంచిది"

"అది అంత అవసరమైంది అనుకోలేదు. క్షమించండి. డాక్టర్‌గారి భార్య పోవటానికి ముందురోజు, డాక్టరుగారు డిస్పెన్సరీలో లేనప్పుడు గోమతి చేసిన చిన్నపని నా కంట బడింది."

"ఊఁ!"

"అల్మారాలో ంచి ఓ బాటిల్ తీసి, అందులో వున్న పదార్థాన్ని, తన బాగ్‌లో వున్న నీలంరంగు పౌడర్ డబ్బాలో వేసుకుంది. ఈ విషయం నేను డాక్టర్‌గారితో చెప్పలేదు. కారణం ఇంతకుముందే చెప్పాను. ఆమెకి అన్నిహక్కులూ వున్నాయి డాక్టర్‌గారి అసిస్టెంటుగా ప్రతీదీ ముట్టుకోవటానికి."

నీలిమ వెంటనే శివపాదానికి సైగచేసింది. ఆ తర్వాత గ్లోరియాకి ఫోన్‌చేసి యేదో అడిగింది.

దాదాపు గంట గడిచింది.

మరో పావుగంట తర్వాత శివపాదం హడావిడిగా లోనికొచ్చాడు అతని చేతిలో, రుమాలులో చుట్టబడివున్న దాన్ని తీసి బల్లపై వుంచాడు. అది నీలం రంగు పౌడరుడబ్బా!

"దీనిపైన వేలిముద్రలు వుంటాయి. జాగ్రత్తకోసం.. మీరు చెప్పినట్లు ఈ డబ్బా గోమతి పడకగదిలో వున్న బీరువాలో దొరికింది. ఆమె లేదు. గదికి తాళంవేసి వుంది. బహుశా పారిపోయి వుంటుంది."

అంటుడంగా గ్లోరియా, డాక్టర్ శ్రీనివాస్ లోనికి వచ్చారు.

గ్లోరియా, నీలిమకి ఏదో చెప్పింది. నీలిమ తల ఊపింది. అందరూ వాళ్ళిద్దర్నీ చూస్తున్నారు.

"ఇన్స్పెక్టర్ ఈమె గ్లోరియా. మీకు పరిచయం చేయాల్సిన అవసరం లేదనుకుంటాను" అని గ్లోరియా వైపు తిరిగి "ఈ నీలం రంగు పౌడర్ డబ్బాని యింతకుముందు నీవు యెప్పుడయినా చూసావా గ్లోరియా?"

"యస్ మేడమ్! నీవు చెప్పినట్లు నేను దమయంతిని నీడలా వెంటాడాను. ఆమె నిన్న సాయంత్రం ఈ వూళ్ళో వున్న షాపుకివెళ్ళి ఈ పౌడర్ డబ్బా కొన్నది. ఆ తర్వాత యింటికివెళ్ళి పౌడర్ అంతా మరోడబ్బాలో జేర్చి, తన బాగ్‌లోవున్న మరో పొట్లాంలోని తెల్లని పదార్థాన్ని పౌడర్ డబ్బాలో చేర్చింది.

చీకటి పడ్డ తర్వాత ఆమె గోమతి యింటికి బయలు దేరింది. నీవు చెప్పినట్లు గోమతిని బయటకి పంపేసాను. నన్నులోపల వుంచి, గోమతి తాళంవేసుకుని వెళ్ళిపోయింది.

దమయంతి మారుతాళం చెవులతో లోనికి ప్రవేశించి సరాసరి పడక గదిలోనికి వెళ్ళి యీ డబ్బాని బీరువాలో వుంచి వెళ్ళిపోయింది. ఆ తర్వాత గోమతి వచ్చి తలుపు తియ్యటం, నేను బయట పడటం జరిగాయి. మరో విషయం. మేడమ్! నీలంరంగు పౌడరు డబ్బాలు గత రెండు వారాలుగా మాత్రమే వస్తున్నాయని షాపతను చెప్పాడు" ముగించింది గ్లోరియా.

"దమయంతీ దీనికి నీ యెక్స్‌ప్లెనేషన్."

తన చేతులతో మొహం కప్పుకొంది దమయంతి "అవును. అంతా నేనే చేసాను" అంటూ.

* * *

"శ్రీనివాస్ మా సహాయం కోరగానే, యీ వదంతి యెక్కడనుండి ప్రారంభ మయిందో తెలుసుకోవాలని ప్రయత్నం చేసాను. గోమతికి ఈ వదంతులు పుట్టించ

వలసిన అవసరంలేదు. డాక్టర్‌పైనా, గోమతిపైనా అప్ప టికే మంచి ప్రచారం వుంది.

చివరి ప్రయత్నంగా నర్స్ దమయంతిని కల్సుకున్నాను. దమయంతి చాలా తెలివయినది. తను చాలా తెలివిగా మాట్లాడాననుకుంది. కానీ పప్పులో కాలేసింది. గోమతి డాక్టర్‌ల మధ్య జరిగిన సంభాషణ వివరించింది.

యెవరయినా హత్య చేయాలనుకున్నప్పుడు యిలాంటి విషయాలు మాట్లాడుకున్నప్పుడు రహస్యంగా వుండాలని, మాట్లాడాలని ప్రయత్నిస్తారు. అంతేకానీ, దమయంతి చెప్పినట్లు నల్గురూ వినేచోట కూర్చుని, డిస్పెన్సరీ తలుపులు వేసుకోకుండా వాళ్ళు యిలాంటి సంభాషణ జరిపారంటే నాకు ఆశ్చర్యం కల్గింది. అప్పుడే దమయంతిపైన అనుమానం కల్గింది.

అందరికీ చెప్పినట్లే, దమయంతికీ చెప్పాను శవపరీక్ష చేయిస్తామని. దాంతో ఆమె బెదిరిపోయింది. నేరం చేసినట్లయితే దాన్ని కప్పిపుచ్చటానికి మరికొన్ని తప్పటడుగులు వేస్తారు ఏదో చేయబోయి. ఇది నేరస్తుల సహజ గుణం. అందుకే గ్లోరియాని నియమించాను, అనుక్షణం దమయంతిని నీడలా వెంటాడమని. చివరికి నేను ఊహించినదే నిజమైంది."

అని క్షణమాగి శివపాదంవైపు తిరిగి "ఆమె తన వాఙ్మూలం యిచ్చి వుంటుంది. యెందుకు యీ హత్య చేసిందో చెప్పిందా?" అడిగింది.

"డాక్టర్ భార్యపోయిన తర్వాత, డాక్టర్ని తనవైపు త్రిప్పుకుందామనుకుంది. కానీ గోమతి అడ్డువచ్చే సరికి భరించలేక పోయింది. అందుకే ఈ ప్రచారం ప్రారంభించింది" అంటూ నవ్వాడు శివపాదం. □

నిశ్శబ్ద నేరం ౧

మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఆ రోజు ఆలస్యంగా వచ్చాడు హరిశ్చంద్ర ఆఫీస్‌కి.

నిజానికి వచ్చేవాడే కాదు. కాని ఇంట్లో ఊరికే కూర్చుంటే మాటిమాటికీ భార్య గుర్తు వస్తుంది. పైగా కొన్ని చెక్కులమీద సంతకం చేయాలి.

ఉదయం పదకొండున్నరకి వచ్చాడు. సరాసరి టెక్స్‌టైల్ మిల్స్‌లోని తన గదిలోకి వెళ్లాడు.

హరిశ్చంద్ర సెక్రటరీ రెండు నిమిషాల తర్వాత లోప లకి వచ్చాడు.

"సర్. మాలేశావ్ నించి...."

"ప్లీజ్. ఇవాళ' నా మనసేం బాగాలేదు, నన్ను డిస్టర్బ్ చేయకండి" చెప్పాడు హరిశ్చంద్ర.

"ఒకే సర్."

సెక్రటరీ బయటకి వెళ్ళడానికి వెనక్కి తిరిగాడు. తలుపు దాకా వెళ్ళి అడిగాడు.

"ఇవాళ లెటర్స్ రేపు పంపుతాను. వాటిలో ముఖ్య మయినవేమీ లేవు."

సరేనన్నట్లుగా తల వూపాడు హరిశ్చంద్ర.

ఏమయివుంటుంది?

ఇదివరకెప్పుడూ సుగుణమణి అలా అకస్మాత్తుగా అదృశ్యమవలేదు. ఇదే మొదటిసారి. కారేమయినట్లు? డ్రయివర్ ఏమయినట్లు? కనీసం టెలిఫోను చేసి చెప్పచ్చుగా?

రిసీవర్ అందుకుని, జేబులోంచి పాకెటుబుక్ తీసి, అందులో రాసుకున్న ఓ నంబర్ డయల్ చేసాడు. అవతల వైపు రిసీవర్ ఎత్తారు.

"హలో...."

"హరిశ్చచంద్ర దిస్ సైడ్ ప్లీజ్. ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడాలి."

"గుడ్ మార్నింగ్ సర్. నేనే మాట్లాడేది? చెప్పండి."

"సుగుణమణి గురించి తెలిసిందా?"

"ఇంకాలేదు. దర్యాప్తు చేస్తున్నాను."

"కారు?"

"మీ కారు నంబర్ ట్రాఫిక్ పోలీసులందరికీ పంప

బడింది. ఎక్కడయినా కనబడితే మీకు తెలియచేస్తాను....
మీ భార్య ఎవరయినా తెలిసిన వాళ్ళింటికి వెళ్ళిందేమో కనుక్కున్నారా?"

"అందరికీ పొదయం ఫోన్ చేసాను. ఎవరింటికీ వెళ్ళ లేదు. నా కెందుకో భయంగా వుంది. ఏదైనా ఏక్సిడెంటు జరిగిందేమో కనుక్కున్నారా?"

"కంగారు పడకండి. ఏక్సిడెంటులాంటిదేం జరగ లేదు."

"ఉంటానయితే."

"ఏదయినా కొత్త సమాచారం తెలిస్తే మీకు ఫోన్ చేస్తాను."

"థాంక్స్."

"మీరేం అధైర్యపడకండి."

హరిశ్చంద్ర రిసీవర్ క్రేడిల్ మీద వుంచాడు. తర్వాత పెద్దగా నిట్టూర్చాడు. క్రితం సాయంత్రం షాపింగ్‌కి కారులో డ్రయివర్‌తో వెళ్ళిన సుగుణమణి ఇంతదాకా తిరిగిరాలేదు!

సెక్రటరీ లోపలకి వచ్చాడు.

"సారీ ఫర్ ది డిస్టర్బెన్స్ సర్. ఇప్పుడే మీకో పర్సనల్ లెటర్ వచ్చింది. రిజిష్టర్ట్ పోస్ట్‌లో."

ఓ పొడుగాటి బ్రవున్‌రంగు కవర్ అందించి బయటికి వెళ్ళిపోయాడు. ఆ కవరుమీద హరిశ్చంద్ర చిరునామా టైప్ చేసివుంది. 'స్ట్రిక్ట్‌లీ పర్సనల్' అని రాసి వుంది.

కవరు చింపి దాంట్లోంచి మూడు మడతలు పెట్టివున్న ఓ కాగితం బయటకి తీసాడు. విప్పి చదివాడు.

"మిష్టర్ హరిశ్చంద్ర,

నీ భార్య సుగుణమణి గురించి కలత పడుతున్నావు

కదా? త్వరపడి పోలీసులకి రిపోర్ట్ ఇచ్చావా? ఇస్తే ఈ ఉత్తరం గురించి మాత్రం వాళ్ళకు చెప్పకు.

నీ భార్య ప్రాణాలతో సురక్షితంగా తిరిగి నీకు చేరాలంటే ఏభై వేల రూపాయలు మాకు అందచేయాలి. మిగతా వివరాలన్నీ మళ్ళీ రేపు తెలియచేస్తాము...."

క్రింద సంతకం లేదు.

కిడ్నేపింగ్!

తన భార్యని కిడ్నేప్ చేసారు యెవరో దుర్మార్గులు.

భయంతో ఒళ్లు జలదరించింది హరిశ్చంద్రకి. ఆంగ్ల చిత్రాల్లో, క్రయిం నవలల్లో కిడ్నేప్ గురించి అనేకసార్లు చూసాడు. చదివాడు. కాని తన జీవితంలో ఇలా దాని నీడ పడుతుందని ఎప్పుడూ అనుకోలేదు.

ఈ సంగతి ఇన్స్పెక్టర్‌కి తెలియచేయాలా?

హరిశ్చంద్ర అయిదారు నిముషాలసేపు కళ్లు మూసుకుని ఆలోచిస్తూండిపోయాడు.

తనకి ఏభై వేల రూపాయలు ముఖ్యమా?

లేక సుగుణమణి ముఖ్యమా??

ఆరు సంవత్సరాలుగా కాపరం చేస్తున్న భార్యవైపే మొగ్గింది మనసు.

డబ్బు పోతే మళ్ళీ సంపాదించుకోవచ్చు. కాని తన భార్య తిరిగి తనకు దక్కదు. డబ్బివ్వకపోతే తిరిగి ప్రాణాలతో సుగుణమణిని తను చూడలేడు.

ఆ సంగతి ఇన్స్పెక్టర్‌కి చెప్పదలచుకోలేదు హరిశ్చంద్ర.

మర్నాడు పుదయం మరో వుత్తరం వచ్చింది హరిశ్చంద్రకి, రిజిష్టర్డ్ పోస్ట్‌లో. సెక్రటరీ బయటకి వెళ్ళిపోగానే



ఆత్రంగా కవరు చింపి దాంట్లోంచి కాగితం బయటకి తీసాడు.

"మిష్టర్ హరిశ్చంద్ర,

వెంటనే ఏభై వేలరూపాయలు బేంక్‌నించి విత్‌డ్రా చెయ్యి. (స్టేట్ బేంక్ ఆఫ్ హైద్రాబాద్‌లోని నీ పర్సనల్ ఎకౌంట్‌లో వుంది ఆ డబ్బు) ఆ డబ్బుతో ఏభై స్టేట్ బేంక్ ట్రావెలర్స్ చెక్స్, వెయ్యిరూపాయల ఖరీదువి కొను. ఆ చెక్స్ అన్నిటి మీదా రెండోచోట కూడా సంతకం పెట్టు. అప్పుడే వాటిని మేం కేష్ చేసుకోగలం.

ఆ ఏభై ట్రావెలర్స్ చెక్స్ నీ జేబులో ఓ కవర్లో వుంచుకుని అబిడ్స్‌లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ నుంచి, చార్‌మినార్‌దాకా నడు. సరిగ్గా ఇవాళ సాయంత్రం ఆరింటికి బయలుదేరాలి జి.పి.ఓ. నుంచి. ఎనిమిదిలోగా, అంటే నువు చార్‌మినార్ చేరేలోగా, దారిలో ఎక్కడో ఓ చోట నీ దగ్గరకి ఓ మనిషి వచ్చి "సుగుణమణి పంపించింది" అంటాడు. అతనికి ఆ కవరు ఇవ్వు.

తర్వాత ఇంటికి వెళ్లు. సుగుణమణి నీకు క్షేమంగా

చేర్చబడుతుంది. మమ్మల్ని ఏదయినా మోసం చేసి పట్టిం చాలనుకుంటే సుగుణమణి ఘోరంగా హత్య చేయబడు తుంది.

ఎలాగో తెలుసా?

కళ్ళు, చేతులూ కట్టబడ్డ నీ భార్యని ఆమె అంబాసిడర్ కారులో పడుకోబెట్టి, ఆకారు నిండా పెట్రోల్ పోసి అంటించి కాల్చి చంపుతాము. సజీవదహనం అన్నమాట. అలా చేయమని అనుమానమా?

అయితే ఆగిచూడు.

లేదా పైన చెప్పినట్లుగా చెయ్యి.

గుడ్ బై అండ్ గుడ్ లక్!"

హరిశ్చంద్ర ముఖంమీద చమటలు పోసాయి. వణికే చేతులతో జేబులోంచి కర్చీఫ్ తీసి మొహం తుడుచు కున్నాడు.

భారతదేశంలో, ఇంగ్లీష్ నవలలలో లాగా ప్రయివేటు డిటెక్టివ్‌లు కూడా లేరు. తనకీ ఛాయస్ లేదు.

డబ్బివ్వాలి.

ఇవ్వకపోతే సుగుణమణి మరణం, ముపై అయిదు వేల రూపాయలు ఖరీదుచేసే కారు దహనం తప్పదు.

ఇస్తే సుగుణమణి క్షేమంగా రావచ్చు. తనకి ఏ బేంక్‌లో కరెంటు ఎకౌంట్ వుందీ, ఎంత వుందీ కూడా తెలుసు కిడ్‌నేపర్స్‌కి. కాబట్టి వాళ్లు కోరింది యిచ్చాక మళ్లీ మళ్ళీ అడగకపోవచ్చు.

హరిశ్చంద్ర ఓ నిశ్చయానికి వచ్చి లేచి నిలబడ్డాడు. క్రితంరోజు, ఆ రోజు వచ్చిన ఉత్తరాలనీ వేస్ట్ బాస్కెట్‌లో పడేసాడు.

తర్వాత డ్రాయర్ తెరచి చెక్ బుక్ తీసుకుని బయటికి



నడిచాడు.

"కొద్దిగా అర్జెంటు పనిమీద బయటకు వెళ్తున్నాను. మళ్ళీ రేపు వస్తాను. ఇవాళ రాను" చెప్పాడు బయట గదిలో టైప్‌రైటర్ ముందు కూర్చుని ఏదో వుత్తరం టైప్ చేస్తున్న తన సెక్రటరీకి.

తన కారులో కూర్చుని డ్రయివర్‌కి చెప్పాడు.

"స్టేట్ బేంక్ ఆఫ్ హైదరాబాద్."

పావుగంటలో బేంక్‌కి వెళ్ళి, ఏభై వేల రూపాయలు తన అకౌంటునుంచి విత్‌డ్రా చేసి, ఆ డబ్బుతో ఏభై ట్రావెలర్స్ చెక్స్ కొన్నాడు. ఒక్కొక్క దాని విలువ వెయ్యిరూపాయలు. ఒంటిగంట అయింది దాదాపు.

"ఇంటికి పోనీ."

డ్రయివర్‌తో చెప్పాడు నీరసంగా కారులో కూర్చుని.

మరో అయిదు గంటలు ఆగాలి ఆరవడానికి.

"రాత్రి అమ్మగారికి కూడా వండనాండి?" అడిగాడు వంటమనిషి.

"వద్దు. నేనూ బయట తింటాను."

వంటవాడు వెళ్ళిపోయాడు. వాడికీ, అమ్మగారు ఎక్కడికి వెళ్ళారో తెలియదు. హరిశ్చంద్రని అడిగే చొరవా, ధైర్యం లేవు.

ఆ రోజు వచ్చిన వుత్తరాలు నీట్‌గా టెలివిజన్ మీద వున్న లెటర్‌బాక్స్‌లో వుంచాడు సర్వంటు.

అన్యమనస్కంగా వాటిని అందుకున్నాడు. సుగుణమణి చేరిన చిట్‌ఫండ్ కంపెనీ నుంచి ఆ నెల యెంత డబ్బు కట్టాలో తెలియచేసే కార్డ్, హరిశ్చంద్రకి రోటరీ క్లబ్ మీటింగ్‌కి సంబంధించిన అజెండా, పోస్ట్‌లో వచ్చిన రీడర్స్ డైజెస్ట్ మాసపత్రిక, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రచురించే బులెటిన్.... అన్నీ రొటీన్ ఉత్తరాలే.

సుగుణమణి పేరు మీదవచ్చిన ఓ కవర్ మాత్రం హరిశ్చంద్రని ఆకర్షించింది. ఆ కవరుమీద 'సెకండ్ రిమైండర్' అన్నపదం చూడగానే దాన్ని అందుకున్నాడు వెంటనే.

కొన్ని క్షణాలు ఆలోచించి దాన్ని చింపి లోపల నుంచి కాగితం బయటికి లాగాడు.

కాగితంలోంచి రెండు ఫోటోలు నేలమీద పడ్డాయి. వంగి వాటిని అందుకుని చూసాడు.

ఉలిక్కిపడ్డాడు. కళ్ళు తిరిగినట్లయ్యాయి. ఊపిరి పీల్చుకోవడం ఎలాగో మర్చిపోయినట్లుగా వూపిరి అందక అవస్థపడ్డాడు కొన్నిక్షణాలు.

ఆ ఫోటోల్లో తన భార్య సుగుణమణి, తన కంపెనీకి రా కాటన్ సప్లై చేసే ఓ వ్యక్తి చేతుల్లో కళ్లు మూసుకుని ఆనందాన్ని అనుభవిస్తూ కనబడింది. ఇద్దరూ నగ్నంగా వున్నారు.

పళ్ళు పటపట కొరికాడు హరిశ్చంద్ర. తర్వాత ఆ

ఫోటోలతో వచ్చిన వుత్తరాన్ని విప్పి చదివాడు. ఎవరిదో చేతివ్రాత.

"సుగుణమణిగారికి,

ఇదివరకు వచ్చిన వుత్తరాన్ని నిర్లక్ష్యం చేసారు. ఈ నెల ఇంతదాకా డబ్బు అందలేదు. నెలకి అయిదు వందలు మీకో లెక్కలోది కాదు. మరు బేరం ఆడటం నాకు నచ్చదు. ఓ సారి షాపింగ్‌కి వెళితే పదివేల రూపాయలు వృధాచేసే మీరు నెల నెలా అయిదువందలు మాకు వినదచేయకపోతే యెలా? నిజంగా ఆ ఫోటోలు మీ భర్త హరిశ్చంద్రకి పంపితే మీ బ్రతుకేమవుతుందో మర్చిపోతున్నారు.

మళ్లీ మేం తీసిన క్రొత్త ఫోటోలు జతచేస్తున్నాము. సరిగ్గా వారం రోజుల్లో మీరు డబ్బు పంపకపోతే ఆ తర్వాత బాధపడతారు."

కింద ఎవరిదో సంతకం వున్నది కాని అర్థం కాలేదు హరిశ్చంద్రకి. కవర్లో ఆ వుత్తరం ఆ రెండు ఫోటోలు వుంచి వాటిని జేబులో వుంచుకున్నాడు.

ఫ్రిజ్ డోర్ దగ్గరకి వెళ్లి, తెరచి, ఓ గ్లాసులోకి రెండు పెగ్గులు విస్కీ వంచుకుని, నీళ్ళు కలుపుకుని గటగటా తాగేసాడు.

తర్వాత సోఫాలో కూర్చుని, కళ్ళు మూసుకుని ఆలోచించసాగాడు.

తను ఇంతకాలం ప్రేమిస్తున్న సుగుణమణి యింత బరితెగించిందా?"

హరిశ్చంద్ర మొహంలో చిన్న చిరునవ్వు అలుముకుంది. ఆ నవ్వు క్రమంగా అధికమై, తెరలు తెరలుగామారి ఆ తర్వాత పగలబడి నవ్వుతోండి పోయాడు చాలాసేపు.

తనకి ఏభై వేల రూపాయలు మిగులు.

మర్నాడు పుదయం ఇన్‌స్పెక్టర్ హడావిడిగా వచ్చాడు హరిశ్చంద్ర ఇంటికి.

"ఐయామ్ టెరిబ్లీ సారీ మిష్టర్ హరిశ్చంద్ర. మీ భార్య కారు బేగంపేటలో ఓ ఖాళీ స్థలంలో కనుగొనబడింది. దానిమీద పెట్రోలు చల్లి కాల్చేసారు యెవరో దుర్మార్గులు. అందులో ...అందులో మీ భార్య శవం కూడా వుంది. పూర్తిగా కాలిపోయి వుంది."

హరిశ్చంద్ర చిన్నగా మూలిగాడు.

"ఇది కావాలని ఎవరో చేసిన పని....దోషులని పట్టుకుని తీరుతాం."

పదినిముషాల తర్వాత, ఇన్‌స్పెక్టర్ వెళ్ళిపోయాక, హరిశ్చంద్ర బాత్‌రూంలోకి వెళ్ళి, జేబులోంచి నిన్న బ్రతికేవున్న తన భార్యకి ఆమె బ్లాక్‌మెయిలర్స్ రాసిన వుత్తరాన్ని, పంపిన ఫోటోలని వాష్ బేసిన్‌లో అగ్గిపుల్ల గీసి కాల్చేసాడు. వాష్‌బేసిన్ శుభ్రంగా నీళ్ళతో కడిగాక తన కారు దగ్గరకి వెళ్ళాడు.

డ్రయివర్ కారు స్టార్ట్‌చేసాక చెప్పాడు నెమ్మదిగా.

"స్టేట్ బేంక్ ఆఫ్ హైద్రాబాద్‌కి." □

వుడకని పప్పు!

షావుకారు : పప్పు వాపసు తేచ్చేసారేం సార్?

ఆసామి : ఇందాక ఎవరితోనో 'నాదగ్గర పప్పులు వుడకవు' అంటున్నావు కదా! మరి ఉడకని పప్పు నాకెందుకని.

—పి. యస్. రాజు, విజయవాడ

అనామకుడి హత్య

ప్రతాప రవిశంకర్

సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. నడివేసవి కాలం.. కిటికీ అద్దాలను చీల్చుకుని లోపలకు పడుతోంది యెండ.

ఫ్యానుకింద కుర్చీలో కూర్చుని ఇంగ్లీషు నవల చదువుతున్నాను. ఇంట్రెస్టింగ్‌గా వుంది.

ఫోన్ మోగింది. ముందుకు వొంగి రిసీవర్ ఎత్తాను.

అవతల్నించి మాట్లాడుతున్నది ఇన్‌స్పెక్టర్ ప్రదీప్.

భయపడ్డాను. ప్రదీప్ ఫోన్ చేసాడంటే తప్పకుండా యెక్కడో హత్య జరిగి వుంటుంది

"నువ్వు మద్రాసునించి వచ్చావో, రాలేదోనని ఫోన్ చేస్తున్నాను" నవ్వాడు అతను ఫోన్‌లో.

"థాంక్‌గాడ్. ఇది మొదటిసారనుకుంటాను నువ్వు మామూలుగా ఫోన్ చెయ్యడం."

"అదేం కాదు. ఈసారి అదే న్యూస్. హత్య జరిగిందని ఇప్పుడే నాకు ఫోన్ వచ్చింది."

"ఎక్కడ?"

"యూనివర్సిటీ యేరియాలో. జామై ఉస్మానియా రైలుగేటు ప్రాంతంలో."

"నేనూ వచ్చేదా?" అడిగాను.

"నువ్వు డైరెక్టుగా అక్కడికే వచ్చెయ్. నేను ఇప్పుడే బయల్దేరుతున్నాను" ఫోన్ పెట్టేశాడు ఇన్‌స్పెక్టర్.

గబగబా డ్రస్ మార్చుకున్నాను. రూమ్ లాక్ చేసి స్కూటరు తీసుకుని బయటకు వచ్చాను.

కళ్లు జిగేల్‌మంటున్నాయి యెండకు.

వేడిగాలిని చీల్చుకుంటూ ముందుకు పరుగుదీసింది స్కూటరు.

సమయం యెనిమిదిన్నరవుతోంది.

రోడ్లు రద్దీగా వున్నాయి.

వాహనాలు రివ్వున పరుగెత్తుతున్నాయి.

పది నిముషాల్లో హత్యాస్థలానికి చేరుకున్నాను. అప్పటికే అక్కడ హత్య జరిగినప్పుడు రావలసిన మనుషులందరూ వచ్చారు.

పోలీసులు శవాన్ని చూడటానికి ముందుకు వస్తున్న

మనుషులను వెనక్కు నెడుతున్నారు.

ముందుకు వెళ్ళి శవాన్ని చూశాను.

అతను బోర్లా పడివున్నాడు. వెన్నులో దిగబడి వుంది పొడుగాటి కత్తి.

తెల్ల షర్టు-బూడిదరంగు లూజు ప్యాంటు వేసుకున్నాడు. ఓ కాలికి చెప్పులేదు. దూరంగా పడివుంది. పొట్టకిందనించి కారిన నెత్తురు బయటకు కనిపిస్తోంది.

అతని వీపుమీద-తలమీద యెండిపోయిన గడ్డిపరకలు వున్నాయి-అతనికి కొంచెం దూరంలో యెండుగడ్డి కుప్పగా పడివుంది.

ఫోటోగ్రాఫర్ వివిధ కోణాల్లో శవాన్ని ఫోటోలు తీస్తున్నాడు. వేలిముద్రల నిపుణుడు కత్తిపిడి మీది వేలిముద్రలు తీస్తున్నాడు.

బోర్లా పడివుండటంవల్ల హతుడి మొహం కనిపించటం లేదు

"యెవరయినా శవాన్ని గుర్తు పట్టారా?" ప్రదీప్‌ను అడిగాను.

"లేదు."

"ఈ శవం గురించి నీకు ఫోన్ చేసింది యెవరుట?"

"ఎవరో ఇక్కడ లేరు. బహుశ అతను దారిన పోయే మనిషి అయివుండవచ్చు."

"అతనికి యెలా తెలుసు ఇక్కడ శవ ముందని. చూసాడా? యెవరయినా చెప్పారా?"

"జనం గుమికూడి చూస్తుంటే అతనుకూడా చూసి నాకు ఫోన్ చేసి వుండొచ్చు."

శవం దగ్గిరనించి ఇవతలికి వచ్చాను. అంతా ఖాళీ ప్రదేశం. అవతల తారురోడ్డు. రోడ్డుకు అవతల కాలేజీ

భవనాలు.

ఒకవైపున ఖాళీప్రదేశానికి ఇళ్ళు వున్నాయి. హత్య జరిగిన ప్రదేశానికి కొంచెం దూరంలో యెండుగడ్డి యెత్తుగా కుప్పలువేసి వుంది. దానికి కొంచెం దూరంలో రెండు గేదెలు గడ్డిమేస్తూ కనిపించాయి.

అక్కడకు నడిచాను.

ఓ ఇంటి బయట ముసలాయన కూర్చొని యెటో చూస్తున్నాడు-నన్ను చూడగానే లేచి నిలబడ్డాడు యెవరు కావాలంటూ.

"ఇక్కడ-హత్య జరిగింది నువ్వు చూశావా?"

"చూళ్ళేదు. యెవరో అనుకుంటున్నారు. విన్నాను."

"ముందుగా అక్కడ శవమున్నట్టు యెవరుచూసారు?" అడిగాను.

"ఏమో రోడ్డున పోయే వాళ్లు చూసారేమో."

అతనితో కొద్దిసేపు మాట్లాడి, అక్కడినించి శవం దగ్గరకు వచ్చాను.

అప్పటికే ఫార్మాలిటీస్ పూర్తయినాయి-

శవాన్ని వేన్‌లో యెక్కిస్తుండగా చూసాను హతుడి మొహాన్ని-ముప్ఫయ్ అయిదేళ్లు వుంటాయి. మొహం నిండా దుమ్ము అంటుకుని వుంది-

2

మరురోజు ఉదయం పేపర్లో హత్య గురించిన వార్త వచ్చింది. హతుడి ఫోటో కూడా ప్రచురించారు.

ఆ రోజు మధ్యాహ్నంలోపున ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కు రెండుమూడుసార్లు ఫోన్ చేశాను హతుడిని గుర్తించి యెవరయినా వచ్చారా అని.

"ఎవ్వరూ రాలేదు" అని చెప్పాడు ప్రదీప్ విచారంగా.

ఒకవేళ హతుడి శవాన్ని యెవ్వరూ గుర్తించకపోతే ఈ కేసును యెలా తేల్చాలో ఆలోచిస్తున్నాను.

సాయంత్రం నాలుగు గంటలయ్యింది.

ఇన్‌స్పెక్టర్ దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది. రిసీవర్ తీసుకున్నాను.

"నువ్వు వెంటనే స్టేషన్‌కి వస్తావా?"

"ఎందుకు?"

"పేపర్లో హతుడి ఫోటోను ఒకతను గుర్తించి ఇక్కడకు వచ్చాడు. నువ్వు కూడా వస్తే బావుంటుంది" చెప్పాడు ప్రదీప్.

"ఇప్పుడే వస్తున్నాను" అని ఫోన్ పెట్టేసి వెంటనే బయల్దేరాను స్కూటర్‌మీద.

నేను వెళ్ళేసరికి పోలీస్‌స్టేషన్లో ఇన్‌స్పెక్టర్ ఎదురుగా పాతికేళ్ల యువకుడు కూర్చుని వున్నాడు. పాపిడి తీసి దువ్విన క్రాపు-పలుచని మొహం-సన్నగా వున్నాడు. వైటు ప్యాంటు, నీలంరంగు ఫుల్ షర్టు వేసుకున్నాడు.

నన్ను అతనికి పరిచయం చేశాడు ఇన్‌స్పెక్టర్. అతను నమస్కారం చేసాడు.

"ఎప్పటినుంచో మిమ్మల్ని చూడాలనుకుంటున్నాను" అన్నాడతను.

"ఇప్పుడు కలుసుకున్నాం గదా. మీరు వివరంగా చెప్పండి హతుడి గురించి," అన్నాను సిగరెట్టు ముట్టిస్తూ.

"ఈ రోజు పేపర్ని నేను గంటక్రితమే చూశాను. దాన్లో రామసూరి ఫోటోను చూడగానే ఆశ్చర్యపోయాను. అతనికీ నాకూ నెలరోజుల క్రితమే పరిచయమయింది. నాకు తెలిసి అతనికి తన వాళ్లంటూ చెప్పుకోటానికి ఎవ్వరూ లేరు. ఒక్కడే వుండేవాడు.... రెండ్రోజుల క్రితం

కూడా యిద్దరం పార్కులో కలుసుకున్నాం. ఇవాళ చూస్తే పేపర్లో" చెప్పటం ఆపాడతను.

అతనికి బాధ కలిగిందని గ్రహించాను.

"ఇంకా చెప్పండి" అన్నాను.

"ఓ పార్కులో మా ఇద్దరికీ పరిచయం కలిగింది. నేను రోజూ ఆ పార్కుకు వెళతాను. అతను కూడా వచ్చేవాడు. మెల్లగా మాటలు కలిశాయి. తర్వాత తన గురించి చెప్పాడు. అతని పేరు రామసూరి అనీ తను ఇంటర్ వరకు ఎలాగో చదువుకున్నాడనీ ఎవరికైనా పనుల్లో చిన్న చిన్న సహాయం చేసి ఒంటరిగా బతుకుతున్నాననీ చెప్పాడు.

ఒకసారి ఇద్దరం కలిసి వస్తుండగా రోడ్డుమీద నించే అతని ఇల్లును చూశాను. అది పాడుబడిన యిల్లు. ఆ ఇంట్లో ఎలా వుంటున్నాడో అర్థం కాలేదు నాకు.

అప్పటినించీ మేము తరచు పార్కులోనే కలుసుకుంటున్నాం. అతనికి నేను పదిరూపాయల వరకు అప్పు కూడా ఇచ్చాను. చాలా మొహమాట పడుతూ అడిగాడు. పాపం....మంచి మనిషి....ఎవ్వరూ లేనివాడు. అటువంటి మనిషిని యెలా చంపారో అర్థం కావటం లేదు" అన్నాడతను-అతని పేరు నరసరాజుట.

"థాంక్స్ మిష్టర్ నరసరాజూ. మీలాంటి వాళ్లు చాలా అరుదుగా వుంటారు. సాధారణంగా ఇలా యెవరయినా హతుడి ఫోటోలను గుర్తుపట్టినా యెందుకొచ్చిన గొడవలే అని ముందుకు రారు. అలా కాకుండా మీరు మీకు తెలిసిన వివరాలన్నీ చెప్పినందుకు కృతజ్ఞతలు. మీరు ఇంకొంచెం హెల్ప్‌చేస్తే మా పని మరింత సులువవుతుంది."

ఇన్‌స్పెక్టర్ అతన్ని పొగుడుతూ అన్నాడు.

"అది నా డ్యూటీ సార్. పైగా అతను నా స్నేహితుడు.

చెప్పండి ఏం చెయ్యమంటారో" అన్నాడు నరసరాజు.

"రామసూరి ఇల్లు చూపించగలరా?" అన్నాను.

"అలాగే. రండి. ఇప్పుడే వెళదాం."

ఇన్‌స్పెక్టర్ లేచి నిలబడ్డాడు. అతనికి బాగా హుషారుగా వుంది. అనామకుడి హత్యకేసును యెలా డీల్ చెయ్యాలో తెలీక బాధపడుతున్నాడు. అటువంటి ప్రదీప్‌కు ఈ నరసరాజు రావటంతో సంతోషం కలిగింది.

జీపులో పావుగంట తరువాత రామసూరి యింటిముందు దిగాము.

నరసరాజు చెప్పినట్టుగా అది పాడుబడిన కొంపే. ఒక వైపు పూర్తిగా కూలిపోయింది. మరోవైపు పడిపోవటానికి సిద్ధంగా వుంది.

తలుపులకు తాళం తగిలించబడి వుంది. పట్టుకుని లాగగానే చేతిలోకి వచ్చింది.

లోపలకు వెళ్ళాం ...

చిరిగిపోయిన చాప-దుప్పటి-రెండు కూజాలు. కిరసనాయిలు బుడ్డి—పాత పుస్తకాలు చిందరవందరగా పడి వున్నాయి.

ఎంత వెదకినా ఆ ఇంట్లో పరిశోధనకు అవసరమయిన క్లూ ఏదీ దొరకలేదు. మళ్ళీ తలుపులను మూసి తాళం తగిలించి రోడ్డుమీదకు వచ్చాము.

"హతుడి గురించి తెలిసినా మన పరిశోధన మొదట్లోనే వుండిపోయింది" అన్నాడు ప్రదీప్.

జీపు దగ్గర నిలుచున్నాము. ఆ ఎదురుగా వున్న ఇళ్ళలో మనుషులు మమ్మల్ని ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"మిస్టర్ నరసరాజూ, మీకు తెలిసి రామసూరికి ఇంకా ఎవరయినా తెలిసినవారుగానీ, స్నేహితులుగానీ వున్నారా"

గబుక్కున అడిగాను.

"ఎవ్వరూ లేరు. కాని నాకు ఒక్క విషయం ఆశ్చ ర్యాన్ని కలిగించింది" అన్నాడు నరసరాజు.

"ఏమిటి?"

"మొన్న సాయంత్రం ఇద్దరం పార్కులోనించి బయ టకు వచ్చి రోడ్డుమీద నడుస్తున్నాము. మా పక్కనుంచి ఓ అంబాసిడార్ కారు రివ్వునపోయి సడన్ బ్రేకుతో ఆగి పోయింది. అందులోనించి ఒకతను తల బయటపెట్టి రామ సూరిని పరీక్షగా చూసాడు. ఇద్దరం కారు పక్కకు వెళ్ళాం. దాటి పోయాము. అతను మాత్రం రామసూరిని అలాగే చూస్తున్నాడు. నాకు ఆశ్చర్యమనిపించింది.

"అతనెవరో తెలుసా?" అనడిగాను రామసూరిని.

"తెలీదు" అన్నాడు.

ఇద్దరం నడుస్తూండగా కారు కదిలి మా పక్కకు వచ్చి ఆగింది. కారు నడుపుతున్న అతను రామసూరిని దగ్గరకు పిలిచాడు. "మీతో మాట్లాడాలి. కారెక్కు" అన్నాడు.

నాతో "తర్వాత కలుస్తాను" అని చెప్పి రామసూరి కారులో యెక్కాడు.

అంతే....

రామసూరి మళ్ళీ కనిపించలేదు. బహుశ అతనే యీ హత్యకు కారణం కావచ్చు" అన్నాడు నరసరాజు.

"అతనెలా వుంటాడో చెప్పగలరా?" ఇన్‌స్పెక్టర్ అడి గాడు ఆత్రంగా. అతనిలో ఆశ చిగురించింది.

"చెబుతాను. ఎందుకో నాకు రామసూరికీ అతనికీ పోలికలున్నట్టు అనిపించింది."

"కారునెంబర్ చూసారా?" అడిగాను.

"కావాలని గుర్తుంచుకోలేదు. అయినా గుర్తుంది.



కారణం అన్నీ ఒకటే నెంబర్లు. నాలుగు ఒకట్లు."

"థాంక్స్ నరసరాజుగారూ. ఇక హంతకుడ్ని పట్టుకోవటం అంత కష్టం కాదనుకుంటాను మిమ్మల్ని ఇంటిదగ్గిర డ్రాప్ చేస్తాం వస్తారా?" అన్నాడు ప్రదీప్.

"వద్దుసార్. నేను ఆటోలో వెళతాను. రామసూరి నా స్నేహితుడు. మంచిమనిషి. అటువంటి అమాయకుడిని చంపిన హంతకుడిని పట్టుకుని శిక్షించండి" అన్నాడు ఆవేశంగా.

3

నాలుగు ఒకట్లు అంబాసిడార్ కారు యెవరిదో తెల్సింది. 'స్కయ్‌లైన్ ఆటోమొబైల్స్' ప్రొప్రయిటర్ రంగదాసుది.

ఇన్‌స్పెక్టర్, నేను సాయంత్రం నాలుగున్నరకు స్కూటరుమీద అడ్రసు ప్రకారం రంగదాసు యింటికి వెళ్ళాము.

ఇన్‌స్పెక్టర్ డ్రెస్‌లోనే వున్నాడు.

పెద్దమేడ—ముందు గార్డెన్.

లోపలకు నడిచాము గేటు నెట్టుకొని. మొక్కలకు నీరు పెడుతున్న ముసలాడిని చూడగానే ఆశ్చర్యపోయాను. అతన్ని ఇంతకుముందు చూసాను. గుర్తు తెచ్చుకున్నాను. నిమిషంలో గుర్తుకొచ్చింది.

హత్య జరిగిన రోజు ఆ ప్రదేశంలో వున్న ఓ యింటి బయట మంచంమీద కూర్చుని నన్ను చూడగానే యెవరు కావాలంటూ నిలబడిన ముసలాడు.

ఇన్‌స్పెక్టర్‌తో యింట్లోకి నడిచాను.

రంగదాసు ఇంట్లోనే తన గదిలో వున్నాడు.

మమ్మల్ని చూడగానే అతను నవ్వి "రండి, కూర్చోండి" అన్నాడు మర్యాదతో.

అతనికి నలభై యేళ్ళుంటాయి. పైకి దువ్విన జుట్టు. సిల్కు లాల్చీ, పైజమా వేసుకున్నాడు. చేతిలో సిగరెట్టు వెలుగుతోంది.

"ఏమిటి నన్ను వెతుక్కుంటూ వచ్చారు? నా ఇంట్లో పోలీసులు రావలసినంత ఇన్సిడెంటు యేదీ జరగలేదే" అన్నాడు నవ్వుతూ.

ఇన్‌స్పెక్టర్ మాట్లాడలేదు.

జేబులోంచి రామసూరి ఫొటో తీసి రంగదాసుకి చూపిస్తూ "ఇతను మీకు తెలుసనుకుంటాను" అన్నాడు.

"ఇతనెవరు?" అన్నాడు రంగదాసు ఆశ్చర్యంగా.

అతన్ని పరిశీలనగా చూసాను. నరసరాజు ఆలోచన సరయినదే. రామసూరికీ, రంగదాసుకీ పోలికలున్నాయి.

"దయచేసి నటించకండి. ఇతనెవరో మీకు తెలుసు" అన్నాను నవ్వుతూ.

"మీరెవరో చెబుతారా?" నా వైపు అదోలా చూస్తూ అన్నాడు.

చెప్పాను.

"గ్లాడ్ టు మీటూ్య" అన్నాడు చేతిని ముందుకు చాచి.

నేను చెయ్యి నివ్వలేదు. రంగదాసు మంచి నటుడని పించింది.

"డోన్టు వేస్టు ద టైమ్. ముందు చెప్పండి. ఇతను మీకు తెలుసు. ఇతన్ని మీరు కలుసుకున్నారు" ప్రదీప్ కోపంగా అన్నాడు.

"నిజంగా తెలీదు. ఇతన్ని నేను కలుసుకోలేదు. మీకు యెవరో అబద్ధం చెప్పారు" మామూలుగా అన్నాడు.

"మీరు అబద్ధం చెబుతున్నారు. నిజం నేను చెబుతాను. ఇతను మీకు తెలుసు. ఇతన్ని మీరు మొన్న సాయంత్రం పార్కు రోడ్‌లో కలుసుకున్నారు. అప్పుడు ఇతని పక్కనే ఇంకో మనిషి వున్నాడు. ఇతన్ని మీరు మాట్లాడాలని కారులో యెక్కించుకున్నారు. ఆ రాత్రి యూనివర్సిటీ యేరియాలో వున్న ఖాళీ ప్రదేశంలో హత్యచేసారు. శవం కనిపించకుండా పైన గడ్డి కప్పేసారు."

"స్టాపిట్" గట్టిగా అరిచాడు రంగదాసు. ఇన్స్పెక్టర్ చెప్పటం ఆపాడు.

"మీరు నా మీద హత్యకేసు బనాయించాలని చూస్తున్నారు. నాకేమీ తెలీదు. నా మీద ద్వేషంవున్న వాళ్ళెవరో మీకు అబద్ధం చెప్పారు. ఇంతకుమించి నన్ను ప్రశ్నించటము అనవసరం" అన్నాడు మొండిగా.

"మీరు మొండిగా మాట్లాడి ప్రయోజనంలేదు రంగదాసు గారూ. ఇది హత్యకేసు. ఇందులోనించి మీరు అంత సులభంగా తప్పించుకోలేరు. మీరు ఇతనితో మాట్లాడి కారెక్కించుకోవటం ఒక మనిషికి తెలుసు. కావాలంటే అతన్ని తీసుకొచ్చి ఆ విషయం నిరూపిస్తాం. మీరు మర్యాదగా ఒప్పుకోండి. జరిగిందేమిటో చెప్పండి. లేకపోతే మా విధానాలు మేము ప్రయోగిస్తాం" ప్రదీప్ ఆఖరి అస్త్రం ప్రయోగించాడు.

అయినా అది కూడా రంగదాసు మీద పని చెయ్యలేదు.

"నన్ను బెదిరించాలని చూస్తున్నారా" అన్నాడు కోపంగా.

"మర్యాదగా చెబుతున్నాం."

"అనవసరం. మీ మర్యాద కాపాడుకోండి. హంతకు లను పట్టుకోలేకపోతే మీ వుద్యోగాలను వదులుకోండి. ఇంకేదయినా ఉద్యోగం చూసుకోండి. అంతేగానీ నాలాంటి మర్యాదస్తులను హత్యకేసుల్లో ఇరికించాలని ప్రయతించ కండి. ఇక మీరు వెళ్ళొచ్చు" అన్నాడు.

ప్రదీప్ నిప్పులు కురిపిస్తూ రంగదాసు మొహంలోకి చూశాడు.

నాకు నవ్వొచ్చింది.

రంగదాసులాంటి మనుషులను నేను చాలా మందిని చూశాను. ఎక్కువ మాట్లాడితే యెక్కడ నిజం చెప్పే స్తామోనని యెక్కువ మాట్లాడరు. కోపం నటిస్తారు.

ఏమయినా ఒక్క విషయం నిజం. రంగదాసుకు తప్ప కుండా రామసూరి హత్యతో సంబంధం వుంది. కాని అతని ద్వారా నిజం బయటకు రాదని తేలిపోయింది.

సిగరెట్టు వెలిగించుకోటానికి జేబులో నించి లైటర్ బయటకు తీశాను. సిగరెట్టు వెలిగించుకుని "ఆల్ రైట్ రంగదాసుగారూ. మీకేమీ తెలీదంటున్నారు. ఓకే. కాని మాకు అందిన ఇన్‌ఫర్మేషన్ బట్టి మేము దర్యాప్తు చెయ్యాలి. ఒక మనిషి మీరు హతుడు రామసూరితో మాట్లాడి మీ కారులో యెక్కించుకుని వెళ్ళటం చూశానని చెపుతున్నాడు. కాని మీరు ఒప్పుకోవటంలేదు. కాబట్టి రేపు ఉదయం అతన్ని మీ దగ్గరకు తీసుకొస్తాం. అతను మిమ్మల్ని గుర్తుపడతాడో—లేదో చూద్దాం. వెళ్లొస్తాం" అని లేస్తూ సిగరెట్టు లైటర్‌ని జేబులో వేసుకోబోతూ

కిందకు వదిలేశాను. అది రంగదాసు కాళ్ళదగ్గర పడింది.

దాన్ని తీసి నా చేతికిచ్చాడతను. జాగ్రత్తగా దాన్ని జేబులో వేసుకున్నాను "థాంక్స్" అంటూ.

"మళ్లీ కలుస్తాం" అని యిద్దరం బయటకు వచ్చాము.

గార్డెన్‌లో ఆ తోటమాలి ముసలాడు నాకు కనిపించ లేదు.

ఇన్‌స్పెక్టర్ మొహం మాడిపోయింది.

స్కూటర్ స్టార్టు చేస్తూవుండగా రంగదాసు యింటి ముందు ఓ ఆటో వచ్చి ఆగింది. అందులోనించి లాయరు అహోబలరావు దిగాడు. ఆయన నాకు తెలుసు. మమ్మల్ని ఆయన చూడలేదు.

4

సిగరెట్ లైటర్‌ని రంగదాసు వేలిముద్రల కోసం అతని దగ్గర వదేశానని అతను గ్రహించలేకపోయాడు.

పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళగానే లైటర్‌మీద వేలిముద్రలు తీయించి వాటిని రామసూరి హత్యచెయ్యబడిన కత్తిమీద వేలిముద్రలతో పోల్చి చూశాము ఇన్‌స్పెక్టర్, నేను.

కాని—రెండు వేలిముద్రలూ ఒకటి కాదు.

రంగదాసు ఈ హత్య చెయ్యలేదు. మరయితే యెవరు చేసి వుంటారు?

ఇంకెవరికి రామసూరిని హత్యచేసే అవకాశం వుంది? అంతుబట్టలేదు.

"ముందు మనం ఈ హత్య ఏ ప్రయోజనాన్ని ఆశించి జరిగిందో తెలుసుకోవాలి. అప్పుడే మనం అసలు హంతకు డెవరయిందో పట్టుకోగలం.

రామసూరి యెవ్వరూ లేనివాడు. అతనికి ఆస్తిపాస్తులు లేవు. అలాంటి మనిషికి సాధారణంగా యెవ్వరితోనూ

పగ, వైరం వుండవు. అతను ప్రేమ గొడవల్లో ఇరుక్కునే అవకాశం కూడా లేదు. ఏ విధంగా చూసినా సాధారణమయిన కారణాలవల్ల రామసూరి హత్య జరిగిందని అనిపించడంలేదు. ఇంకేదో ప్రత్యేకమయిన కారణం వుండి వుండాలి. అది ఏమయి వుంటుంది.

రామసూరిని రంగదాసు హత్య జరిగిన రోజు తన కారులో యెక్కించుకున్నాడని నరసరాజు చెప్పాడు. రంగదాసుకీ—రామసూరికీ పోలికలు వున్నాయి. ఎందుకున్నాయి? అందుకే రంగదాసు తనకు రామసూరి తెలియదని అబద్ధం చెబుతున్నాడా? ఇవన్నీ ప్రశ్నలు.

మనం ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకోవాలంటే లాయరు అహోబలరావుని కలుసుకోవాలి. ఆయన్ను కలుసుకుంటేగానీ మనకేసు మరింత ముందుకు జరగదు" అన్నాను సిగరెట్టు కాలుస్తూ.

"లాయరు అహోబలరావుకు ఏం తెలుసు?" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"సాధారణంగా కుటుంబ వ్యవహారాలు—రహస్యాలు లాయర్లకు తెలీకుండా వుండవు. అహోబలరావు రంగదాసు ఫామిలీ లాయరు అయివుంటే మన పని సులువవుతుంది. ముందు బయల్దేరు."

ఇన్‌స్పెక్టర్ని తొందర చేసాను.

హేట్ నెత్తిన పెట్టుకుని లేచాడు అతను. ఇద్దరం బయటకు వచ్చి స్కూటరుమీద యెక్కాము.

5

"కూర్చోండి. చాలా రోజులకు కలుసుకున్నాం" అన్నాడు అహోబలరావు నవ్వుతూ.

ఆయన యెదురుగావున్న పేముకుర్చీల్లో కూర్చున్నాము.

"అవును. మీతో పని తగిలింది. వచ్చాం. మీరు మాకు పూర్తిగా సహకరిస్తారనుకుంటాను" అన్నాను.

"చెప్పండి. నాకు వీలయినంతవరకు సహకరించే ప్రయత్నం చేస్తాను" అన్నాడాయన.

"మీ క్లయింటు రంగదాసుకు అన్నలుగానీ తమ్ముళ్ళు గానీ వున్నారా?"

ఆశ్చర్యంగా నా మొహంలోకి చూశాడు అహోబల రావు.

"ఎందుకు?"

"ముందు చెప్పండి రావుగారూ. ఉన్నారా? లేరా?"

"లేరు. ఆయనొక్కడే సంతానం."

"అయిన తండ్రి ఇంకా బతికే వున్నాడా?"

"లేడు. ఇరవై రోజుల క్రితం చనిపోయాడు."

"ఇరవై రోజుల క్రితమా? ఏమిటి కంప్లెయింటు?"

"ఆయన పెరాలిసిస్ పేషెంటు. రెండేళ్లుగా అయన బెడ్ మీదే వున్నాడు. ఇరవై రోజుల క్రితం మళ్ళీ స్ట్రోక్ వచ్చింది. పోయాడు."

మాట్లాటలేదు నేను. ఆలోచిస్తూ జేబులోనుంచి రామ సూరి ఫోటో తీసి ఆయనకిచ్చి "ఈ ఫోటోలో మనిషిని యెప్పుడయినా చూశారా? అని అడిగాను.

"చూశాను" అన్నాడు అహోబలరావు.

"ఎక్కడ? ఎప్పుడు??" ప్రదీప్ ఆత్రంగా అడిగాడు.

"చెబుతాను. రంగదాసు తండ్రి ఇంకో రెండురోజుల్లో పోతాడనగా నన్ను పిలిపించాడు. వెళ్ళాను. అప్పుడు రంగ దాసు కూడా ఆయన దగ్గరే వున్నాడు. ఆయన ఈ ఫోటోలో వున్న మనిషి పోలికలున్న ఫోటో ఒకటి చూపించాడు. అతనిపేరు చెప్పి అతను తన కొడుకు అన్నాడు. నేనూ

రంగదాసూ ఆశ్చర్యపోయాం....

ఆయన తర్వాత చెప్పాడు. ఆయనకు కొన్నేళ్ళ క్రితం వాళ్ళ ఇంట్లో వంటచేసే మనిషితో అక్రమ సంబంధం వుందిట. అప్పుడు ఇతను పుట్టాడుట. కాని తన కొడుకని చెప్పుకునే ధైర్యంలేక ఎక్కడో వదిలేశాడుట. ఇన్నాళ్ళు ఈ రహస్యాన్ని చెప్పలేదు. ఆ రోజు అంతా చెప్పి అతను ఈ వూళ్ళోనే ఎక్కడో వున్నారనీ అతనికి కూడా తన ఆస్తిలో కొంతభాగం చెందాలనీ విల్లు రాయించాడు. అతన్ని వెతికించి ఆ స్తిని అప్పగించే భారాన్ని నాకూ, రంగదాసుకీ వదిలి కన్ను మూసాడు తర్వాత. ఇదీ విషయం" అని ముగించాడు లాయరు.

రామసూరి యెందుకు హత్య చేయబడ్డాడో, యెవరిచేత హత్య చేయబడ్డాడో అర్థమయిపోయింది.

"ఇతని హత్య ఫోటోలను మీరు పేపర్లో చూడలేదా" అడిగాడు ప్రదీప్-లాయర్ని.

"నేను తెలుగు పేపరు చూడను" అన్నాడాయన.

"థాంక్స్ లాయర్‌గారూ, వెళ్ళొస్తాం" అని ఆయన దగ్గర సెలవు తీసుకుని బయటపడ్డాము.

ఇన్‌స్పెక్టర్ ప్రదీప్ మొహం విప్పారింది.

6

"అనుమానం లేదు. రంగదాసే ఈ హత్య చేయించాడు." అన్నాడు ఇన్‌స్పెక్టర్ స్కూటర్‌మీద వస్తుండగా.

చీకటి పడింది.

రోడ్డుమీద రద్దీ యెక్కువగా వుంది.

దీపాలు ప్రశాంతంగా వెలుగుతున్నాయి.

"ఎవరిచేత చేయించి వుంటాడు?"

స్కూటర్ పోలీస్‌స్టేషన్ ముందాగింది.

దిగాం. "హంతకుడెవరో అర్థమయ్యింది ఫ్రెండ్. నువ్వు ఓ నలుగురు కానిస్టేబుల్స్‌ని తీసుకుని జీపులో బయల్దేరు" అన్నాను గబుక్కున.

"ఎవరు?"

"ఎవరో. యిది నా అనుమానమే. రుజువు చేసుకుందాం. ముందు బయల్దేరు" అన్నాను.

అప్పటికప్పుడే జీపులో ప్రదీప్, నేను నలుగురు పోలీసులూ బయల్దేరాము.

జరిగినవన్నీ గుర్తుకు తెచ్చుకుంటున్నాను. ఎలా ఆలోచించినా అనుమానం అతనిమీదకే వెళుతోంది.

జీపు రామసూరి హత్య జరిగిన ప్రదేశంలో వున్న ముసలాడి ఇంటిముందు ఆగింది.

పశువులకు గడ్డివేస్తున్న వాడల్లా మమ్మల్ని చూడగానే షాక్ తిన్నాడు.

"వాడిని పట్టుకుని జీపులో ఎక్కించండి" అరిచాడు ఇన్‌స్పెక్టర్.

"నాకేం తెలీదు" అన్నాడు వాడు భయంగా.

ఇంట్లోనించి యెవరో బయటకు వచ్చారు.

అప్పటికే వాడిని జీపులో ఎక్కించారు.

జీపు కదిలి ముందుకు దూసుకుపోయింది. వాడు నాకేం తెలీదంటూ అరుస్తున్నాడు. ప్రదీప్ హాండ్‌స్టిక్‌తో వాడి నెత్తిన ఒక్కదెబ్బ వేసాడు. నోరు మూసుకున్నాడు వాడు.

స్టేషన్ ముందాగింది జీపు. అప్పటికప్పుడే వాడి వేలిముద్రలు తీసాము. ఫోన్‌చేసి ఫింగర్‌ప్రింట్సు ఎక్స్‌పర్ట్‌ని పిలిపించాడు ప్రదీప్.

ఆయన కత్తిపిడిమీద దొరికిన వేలిముద్రలతో ముస

లాడి వేలిముద్రలను పోల్చిచూసి "రెండూ ఒకటే" అన్నాడు.

ముసలాడు వణికిపోయాడు.

కోపంగా ముసలాడి దవడమీద ఈడ్చి కొట్టాడు ఇన్స్పెక్టర్ వాడు తూలి ముందుకు పడ్డాడు. పెదవి చిట్లి నెత్తురు కారింది. ఇంకో రెండు పోట్లు పొడిచి "చెప్పరా రామసూరిని ఎందుకు చంపావో" అన్నాడు పెద్దగా.

నాలుగు దెబ్బలు వాడి వీపుమీద పడేసరికి వాడు "నన్ను చంపొద్దు. నేనే ఆ హత్య చేసాను. రంగదాసు బాబు నాచేత ఈ హత్య చేయించాడు. చేసినందుకు ఐదు వేలు ఇచ్చాడు నన్ను కొట్టొద్దు. వదిలెయ్యండి" అని కేకలు పెట్టాడు ఏడుస్తూ.

"వీడిని ఆ సెల్‌లో పడెయ్యండి. కమాన్ జగదీష్. ఓ అనామకుడిని హత్య చేసిన ఆ బాస్టర్డ్‌ని పట్టుకోవాలి. హరియప్" అన్నాడు ఇన్‌స్పెక్టర్ బయటకు వెళుతూ.

నేను ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌ను అనుసరించాను. □

"గోల్డు మెడల్!"

"కాలేజీ చదివే రోజుల్లో నేను 'గోల్డు మెడల్' సంపాదించాను."

"యూనివర్సిటీ ఫస్టా....!?"

"లేదు చీట్లపేకలో డబ్బు తక్కువై మా స్నేహితు డొకడు దాన్ని నాకు అమ్మాడోయ్!"

—యం. వీరాస్వామి, మల్కాజిగిరి.

తానేకోట్ గ్యాంగ్

'సికిందర్'

(గతసంచిక తరువాయి)

"వెల్, బాయ్స్" కమీషనర్ కల్పించుకున్నాడు, "ఇంత వరకు జరిగిన సంఘటనల మీద క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్టుమెంట్ క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తోంది. మనుషుల మీద ఆ మందు ఎలా ప్రయోగించబడిందో త్వరలో తెలుస్తుంది. యీ లోపు మళ్ళీ అలాటి సంఘటన జరిగితే, దాన్ని అవకాశంగా తీసుకుని, నేర్పుతో ప్రవర్తించి శత్రువుల్ని బంధించాలి. ఇప్పుడిప్పుడే ఇలాటి సంఘటన

జరగదని నా అనుమానం. ఆ ఫార్ములాను విచ్చలవిడిగా ప్రయోగించేందుకు శత్రువులు ఒప్పుకోరు. అది వాళ్ళకే ప్రమాదకరం కావచ్చు. వాళ్ళ ప్రయోగాలన్నీ ఇంతవరకు ఉద్రిక్త పరిస్థితిలోనే జరిగాయి. ఇప్పుడు పరిస్థితి మామూలు స్థితికి వచ్చింది. కర్ఫ్యూ తొలగించడం జరిగింది. విద్యార్థులు ఉద్యమం విరమించుకున్నారు. అన్నిటికి మించి వాళ్ళు అనుకున్న హత్యలు జరిగిపోయాయి. వాళ్ళని పట్టిచ్చే ఆధారాలు నాశనమయ్యాయి. బహూశ వాళ్ళక్కడ నుంచి మకాం ఎత్తేయవచ్చు.

"మిస్టర్ లాల్, ప్రజల భద్రతతో మీకు నిమిత్తం లేదు. ఎలాటి ఇతర ఆలోచనలు లేకుండా ఆ ముఠాని నాశనం చెయ్యడం ఒక్కటే మీ లక్ష్యం. ప్రజల క్షేమం గురించి మేం ఆలోచిస్తాం. గంట తర్వాత ఐ. జి. పి. కాన్ఫరెన్స్‌వుంది - అక్కడ మేం తీసుకోవలసిన చర్యలు గురించి తీర్మానించుకుంటాం!"

లాల్ లేచాడు.

"ఆల్ రైట్ సర్. మీరు కోరినట్టే చేస్తాం. వేషాలు వేస్తాం, మోసాలు చేస్తాం, చట్టాన్ని ఉల్లంఘిస్తాం—ఏదైనా చేస్తాం—శత్రువుల్ని నాశనం చెయ్యడం ఒక్కటే మా ధ్యేయం."

"విష్యూ గుడ్ లక్!" అన్నాడు కమీషనర్.

ఆ తర్వాత లాల్—జాన్‌లు సోనియాతో కారెక్కి 'విద్యార్థి సంఘర్షణ సమితి' చేరుకున్నారు.

జంట నగరాల్లో ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. ఎక్కడా ఎలాటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. జీవనసరళి పునరుద్ధరించబడింది. ప్రజల్లో భయాందోళనలు లేవు. కార్యకలాపాలన్నీ యధావిధిగా కొనసాగుతున్నాయి.

ఉదయం లేస్తూనే హంతకులు అరెస్టయ్యారన్న వార్త ఆ తర్వాత కర్ఫ్యూ తొలగించారన్న వార్త విని తేలిగ్గా వూపిరిపీల్చారు.

సమితి యాక్షన్ కమిటీ సెక్రటరీ శీతల్ప్రసాద్‌తో విద్యార్థులు, విద్యార్థినులు కూడా ఆ ఉదయం కార్యాలయంలో సమావేశమై జరిగిన దురదృష్టకరమైన సంఘటనల్ని సమీక్షించుకుని, వీటన్నిటికీ ఒక రకంగా తాము బాధ్యులైనందుకు విచారం వెలిబుచ్చారు.

డిటెక్టివ్‌ల రాక వారి విచారాన్ని వెళ్ళగొట్టి, ముఖాల్లో ఆనందపు ఛాయల్ని పులిమింది.

"లాల్! అండ్ జాన్, జిందాబాద్!"

"టి. సి. డి. ఎ. వర్ధిల్లాలి!"

"కిల్లర్స్ గ్యాంగ్—డౌన్ డౌన్!"

ఇలా తమ ఇష్టమొచ్చిన నినాదాలు చేస్తూ డిటెక్టివ్‌లను ఉక్కిరిబిక్కిరి చేశారు.

"డియర్ ఫ్రెండ్స్, మీరు కోరిన కార్యం సఫలం చేశాం" అన్నాడు లాల్ విద్యార్థుల నుద్దేశించి, "హంతకుల్ని పట్టుకోడం చట్టం కోసం జరిగింది తప్ప, మాకేమీ తృప్తిగా లేదు. హత్యల గురించి హెచ్చరికలు అందినా నివారించలేకపోయాం. ఇందుకు కారణం వాళ్ళ దగ్గర పటిష్టమైన పథకం వుంది. వాళ్ళు చేయవలసిన హత్యలన్నీ నిరాటంకంగా చేసేశారు. అంతా అయిపోక వాళ్ళని పట్టుకుని ఏం లాభం - తీసిన ప్రాణాలు తిరిగి పోస్తారా?"

"మిస్టర్ లాల్, అసలు మేం ఉద్యమం ప్రారంభించక పోతే యీ హత్యలు జరిగేవి కావేమో?" అడిగాడు శీతాల్ ప్రసాద్.

"మీ ఉద్యమానికీ, యీ హత్యలకి సంబంధంలేదు.

మీ ఉద్యమాన్ని వాళ్లు తెరగా ఉపయోగించుకుని ఆశయం నెరవేర్చుకున్నారు. హత్యలు ఎందుకు జరిగాయో మీకు తెలుసు. ఈ హత్యల్లో మీరు దోషులు కాదు కదా, కారకులు కూడా కాలేరు. మీరు ఉద్యమం ప్రారంభించకపోయినా హత్యలు ఆగేవి కావు. వెల్, మీరిక నిశ్చింతగా వుండండి. జరిగిన సంఘటనలతో మీ కెలాటి సంబంధంలేదు. మీరు ఒప్పజెప్పిన బాధ్యత నెరవేర్చాం. ఇక పోలీసులు ఒప్ప జెప్పిన బాధ్యత మా భుజాలపైన వుంది" అన్నాడు లాల్.

జాన్ భుజాలు చూసుకుని అన్నాడు. "ఈ బాధ్యత జాతి మనుగడకు సంబంధించినది. ఫలితం ఎలా తేలు స్తామో మాకే తెలీదు!"

"నో! ఆ ముఠాని మీరు పట్టుకుని తీరాలి, మిస్టర్ జాన్!" అర్చారు విద్యార్థులు, "కిల్లర్స్ గ్యాంగ్ - డౌన్ డౌన్! ఆ ముఠాని పట్టుకునేందుకు మేమూ సహాయ పడతాం!"

"వెరీ వెల్! జాతికి విద్యార్థులు వెన్నెముకలాటి వారు. మీరు లేనిది ఏమీలేదు!" అన్నాడు లాల్, "అవసరమను కుంటే మీ సహాయం తీసుకుంటాం - కానీ ఇది పూర్తిగా అఫీషియల్ ఇన్వెస్టిగేషన్. మా అనుమతి లేకుండా ఇందులో మీరు జోక్యం చేసుకోకూడదు. ఈ వ్యవహారంలో ఎక్కువ శ్రద్ధచూపడం కంటే మీరు చదువుపైన చూపడం మంచింది."

విద్యార్థులు అంగీకరించారు. ఆ తర్వాత మళ్ళీ నినాదాలు చేసి కరతాళ ధ్వనులు చేశారు.

౬ 2

"అయితే నేనేం చెయ్యాలి?" అంది సోనియా కారు బయలుదేరాక.

"చదువుకోవాలి. గొప్ప డాక్టర్ కావాలి. దేశంలో ప్రథమ లేడీ ఆటోప్సీ సర్జన్ కావాలి. అలా మా లైను లోకి రావాలి. అంతే గాని, మీ ధైర్యసాహసాలతో మమ్మల్ని డామినేట్ చెయ్యడం నా కిష్టంలేదు. మీ ధైర్య సాహసాల్ని ఆత్మరక్షణకోసం వుపయోగించండి. వెల్?" అన్నాడు లాల్.

"వెల్! ఇప్పుడేం చెయ్యమంటారు? ఇంటికెళ్ళి వంట చెయ్యమంటారా?"

"మీరా పని చేస్తే లక్షణంగా వుంటుంది. ప్రస్తుతం మా కోసం మీరు చెయ్యవల్సిందేమీ లేదు. అవసరం వస్తే జాన్ మీ దగ్గరికి వస్తాడు" లాల్ అన్నాడు.

జాన్ తలూపాడు, "అంతే సోనియా. అవసరం వస్తే వస్తాను. అయితే ఒక హెచ్చరిక: నువ్వు మాతో పని చేస్తున్నావు....శత్రువుల వల్ల నీకు ప్రమాదం వుండ వచ్చు...."

ఆమె పిడికిలి బిగించి"ప్రమాదాల్ని ప్రేమిస్తాను జాన్. నాకేం భయంలేదు—నిశ్చింతగా వుండు" అంది.

మిస్ సోనియాను ఆమె యింటిదగ్గర వదిలిపెట్టి ఇంటికి చేరుకున్నారు డిటెక్టివ్‌లు!

"ఇక మన కార్యక్రమం ఏమిటి? రంగప్రవేశం ఎలా చెయ్యాలి? ఎప్పుడు చెయ్యాలి?" అడిగాడు జాన్ లాల్‌ని, 'సడెన్' తల నిమురుతూ. 'సడెన్' గోముగా మొరగ సాగింది.

గార్డెన్‌లో పడక్కుర్చీలో కూచున్న లాల్ ఆకాశంలో పక్షుల్ని చూస్తూ సిగరెట్ వెలిగించాడు. సమయం సాయంత్రం ఆరయింది. వుదయంనుంచీ చేసిందేమీలేదు, జరిగిందేమీలేదు.

"లెటజ్ థింక్ ఎబౌటిట్" అన్నాడు లాల్, "స్టార్టింగ్ పాయింట్స్ చాలా వున్నాయి. కానీ ఒక్కటీ శత్రువుల దగరికి తీసికెళ్ళదు. హోటల్ సెవెన్‌హిల్స్‌కి కేవలం దివాకర్‌తో సంబంధం వుంది—బిజినెస్ రీత్యా. దివాకర్‌కి డాన్సర్స్‌తో సంబంధం వుంది—హత్యల విషయంలో. హోటల్ జిల్‌జిల్‌కి డాన్సర్స్‌తో సంబంధం వుంది. కానీ అదీ బిజినెస్ సంబంధమే — శత్రువులతో లేదు. ఈ రెండు హోటల్స్‌లో మన కెలాటి యిన్ఫర్మేషన్ దొరకలేదు. దివాకర్‌కి డాన్సర్స్ తప్ప వాళ్ళ వెనకవున్నవ్యక్తుల గురించి తెలియదు. వీరేంద్ర, ప్రేంచంద్‌లవి పూర్తిగా వ్యక్తిగత వ్యవహారాలు.

"డాన్సర్స్ చనిపోయారు. వాళ్ళని చంపిన వ్యక్తులూ చనిపోయారు. వాళ్ళ శవాలు మన కెలాటి ఆధారాలూ అందివ్వలేదు. యిప్పటివరకు ఆ మందు యెలా ప్రయోగించబడుతోందో తెలియలేదు. శత్రువులు చాలా చలాకీ అయిన మనుషులు. తమ దగ్గరికి చేరవేసే ఆధారాలేమీ లేకుండా జాగ్రత్త పడుతున్నారు. మనం రంగంలో దిగాలంటే ఏదేనా ఆధారం కావాలి. రెక్కలు లేకుండా పిట్ట ఎలా యెగురుతుంది?"

"అంటే, మనక్కావలసిన ఆధారాలు వుండీ కనిపించడం లేదంటావా?"

"అవును. ఆధారాల్లేకుండా యెక్కడికి పోతాయి? నేరం జరిగాక ఆధారాలుండవలిసిందే—అది థియరీ. కాకపోతే ఆ ఆధారాలు గుప్తంగా వుండవచ్చు, లేదా స్పష్టంగా వుండవచ్చు. స్పష్టంగా వున్న ఆధారాలు మన తెలివితేటల్ని చాటవు. గుప్తంగా వున్న ఆధారాల్ని బయటికి లాగినప్పుడే మన సత్తా ఏమిటో బయటపడుతుంది."

"ఏదేమైనా మనం గాజులు తొడుక్కునే పరిస్థితి రాకూడదు లాల్। మన సత్తా యేమిటో నిరూపించాలి।"

లాల్ హఠాత్తుగా తల పట్టుకుని కూచుండి పోయాడు.

"ఏమిటి లాల్?" జాన్ అడిగాడు గాభరాగా.

"వెనక్కి తిరిగి చూడు। మేడమీద ఆ అమ్మాయి—గాజులు చూపిస్తోంది।"

జాన్ ఛటుక్కున తిరిగిచూశాడు.

ఎదురుగా మేడమీద ఓ పదేళ్ళ అమ్మాయి రెండు చేతులకి తొడుక్కున్న గాజుల్ని చూపిస్తూ నవ్వుతోంది.

"ఓహ్ గాడ్। చచ్చాం।" జాన్ ఛటుక్కున లేచి పరిగెత్తాడు. ప్రహరీ గోడదగ్గరికి వెళ్ళి అరిచాడు: "ఏమిటిది। ఎవరికి చూపిస్తున్నావు?"

ఆమె జాన్‌ని చూసి చేతులు వేగంగా వూపుతూ అరిచింది, "రేపు నా పుట్టినరోజు। కొత్త గాజులు తొడుక్కున్నాను।"

"మా కెందుకు చూపిస్తున్నావు?"

"మీక్కాదు। యెదురింటి పిన్నికి।"

జాన్ తల తిప్పి పక్కింటికేసి చూశాడు. గుమ్మంలో ఓ స్త్రీ నిలబడి వుంది. తేలిగ్గా వూపిరి వదిలి, తిట్టుకుంటూ వెనుదిరిగాడు.

లాల్ తలెత్తిచూసి అన్నాడు, "ఒకవేళ అలాటి పరిస్థితి యేర్పడితే ఆ అమ్మాయిచేతే తొడిగించుకోవాలి।"

జాన్ కోపంగా, ఆ తర్వాత నీరసంగా చూశాడు. "నాన్సెన్స్। ఈ గాజులతో నాకు నీరసం వస్తోంది। లాల్, నిన్ను చూస్తోంటే అలాటి పరిస్థితి యేర్పడేటట్లే వుంది। ఈ కేస్‌ని నువ్వు సీరియస్‌గా తీసుకోడం లేదా?"

"నేను లైఫ్‌నే సీరియస్‌గా తీసుకోను।..." అన్నాడు

లాల్.

జాన్ అన్నాడు: "అసలు దివాకర్‌కి డాన్సర్స్ తరపు ముఠా గురించి తెలియదని నువ్వెలా అనుకుంటున్నావో అర్ధంగావడం లేదు."

లాల్ నవ్వాడు, "తెలిసి వుంటే చచ్చేవాడు. ఈ ముగ్గుర్నీ వదిలి కేవలం డాన్సర్స్ యిద్దర్నే ఎందుకు చంపారనుకుంటున్నావు? పోలీసులకి పట్టుబడితే వాళ్ళిద్దరే వాళ్ళకి ప్రమాదకర వ్యక్తులు. మిగతా ముగ్గురు కారు. అంటే ఈ ముగ్గురికీ రహస్యంగా వున్న ముఠా గురించి అస లేమీ తెలీదు? అర్ధమైందా? శత్రువుల కా నమ్మకం వుంది."

'సడెన్' హఠాత్తుగా మొరిగింది. ఛటుక్కున లేచి గేటు దగ్గరికి పరిగెత్తింది. డిటెక్టివ్‌లు వులిక్కిపడి గేటు కేసి చూశారు అప్పటికి చీకట్లు కమ్ముకొంటున్నాయి ...

గేటుదగ్గర అస్పష్టంగా ఒక ఆకారం కనిపిస్తోంది—తెల్లటి దుస్తుల్లో—పురుషాకారం—అది గేటుమీద ఒరిగి నిలబడి వుంది. 'సడెన్' గేటు చేరుకుని గట్టిగా మొరుగుతోంది.

డిటెక్టివ్‌లు స్థాణువులై పోయారు. కదలడానికి వీల్లేదు. తమ జేబుల్లో రివాల్వర్స్ లేవు. అవతల మనిషి దగ్గర ఆయుధం వుండవచ్చు—కానీ విచిత్రంగా వుంది పరిస్థితి. ఆ మనిషి యెందుకలా నిలబడ్డాడు? శత్రువైతే కాల్చేసి పారిపోవచ్చుగా? కనీసం కుక్క మొరుగుతోంటే దాన్ని గాయపరచవచ్చుగా? అతనిలో చలనం లేదు. పైగా తమవేపు చూడ్డంలేదు!

డిటెక్టివ్‌లు నరాలు బిగదీసుకుని కాచుకున్నారు. కొన్ని

క్షణాలు తర్వాత ఆ ఆకారం నేలకూలింది. 'సడెన్' ఇంకా మొరుగుతోంది.

జాన్ తేరుకుని లేచి ఫురికాడు. 'సడెన్'ని వెనక్కి తరిమి గేటు తెరిచాడు. ఆ మనిషి నేలమీద బోర్లా పడి వున్నాడు. జాన్ అతని పక్కన కూచొని గబగబా సోదా చేశాడు: ఆయుధం లేదు. నాడీ చూశాడు: కొట్టుకుంటోంది. తేలికపడి లాల్‌ని పిల్చాడు.

లాల్ పరిగెత్తి కెళ్ళి చూశాడు, "ఏం జరిగింది? యెవరితను?"

జాన్ అతన్ని మరోసారి తట్టాడు.

అతను చిన్నగా మూల్గి కళ్ళు తెరిచాడు.

"ఎవరు మీరు? ఏం జరిగింది?" జాన్ అడిగాడు.

అతను నోరు తెరిచాడు. పెదవులు కదిలాయి. అస్పష్టంగా మాటలు వెలువడ్డాయి. "లాల్ అండ్ జాన్, ప్రైవేట్ యిన్వెస్టిగేటర్స్."

"అవును. మేమే. ఏం జరిగింది?"

"లాల్ అండ్ జాన్, ప్రైవేట్ యిన్వెస్టిగేటర్స్" మళ్ళీ అదే అన్నాడతను.

"లోనికి తీసికెళదాం" అన్నాడు లాల్.

ఇద్దరూ అతన్ని మోసుకొచ్చి బెడ్‌రూంలో పడుకోబెట్టారు. లైటు వెలిగించి అతన్ని పరీక్షగా చూశారు.

అతనికి ముప్ఫై ఏళ్ళుంటాయి. యెర్రగా వున్నాడు. ముఖం పాలిపోయింది. కళ్ళు లోతుకిపోయాయి. పెదవులు యెండిపోయాయి. జుత్తు రేగిపోయి వుంది. తెల్లటి దుస్తుల్లో వున్నాడు. దుస్తులు అక్కడక్కడ చినిగిపోయి, మాసిపోయి వున్నాయి. కాళ్ళకి పాదరక్షలు లేవు.

అతని వాలకం చూస్తే కొన్ని రోజులు ఖైదీగా గడిపి

నట్టు తెలుస్తోంది.

ఎన్ని ప్రశ్నలడిగినా స్పష్టమైన సమాధానాలివ్వలేదు. అసలు మాట పలికే స్థితిలో లేడతను. ఆతనేదేనా ఆక్సిడెంట్‌కి గురై వుండాలి—పరిస్థితి చాలా హీనంగా వుంది....

లాల్, డాక్టర్‌ని పిలవమని జాన్‌కి చెప్పాడు. జాన్, డాక్టర్ మనోహర్‌కి ఫోన్‌చేసి పిలిచాడు.

పది నిమిషాల్లో డాక్టర్‌వచ్చి ఆ మనిషిని పరీక్షించాడు. ఆ మనిషి ఒంటిమీద గాయాలెక్కడా లేవు. "విచిత్రమైన కేసు!" అన్నాడు డాక్టర్ నిట్టూర్చి.

"అంటే?" అన్నాడు లాల్.

"మెదడు దెబ్బ తినడం వలన మాట పడిపోయింది....!"

"ఎఫాసియా?"

"దటీజ్ రైట్."

డాక్టర్ ఆ మనిషిని కొన్ని ప్రశ్నలు వేశాడు. ఏ ప్రశ్న వేసినా అతను డిటెక్టివ్‌ల పేర్లు చెప్తున్నాడు.

"లాభంలేదు. కాయితం, పెన్సిలు ఇలా ఇవ్వండి— ఏదేనా వ్రాస్తాడేమో చుద్దాం" అన్నాడు డాక్టర్.

జాన్ అందించాడు. ఆ మనిషి వాటిని అందుకుని చాలా సేపు అచేతనంగా వుండిపోయాడు. ఆ తర్వాత హఠాత్తుగా తేరుకుని కాయితంమీద గబగబ వ్రాయసాగాడు. అలా వ్రాస్తూనే చటుక్కున కాయితం వదిలేసి నిస్సయంగా చూశాడు.

డాక్టర్ నేలమీద కాయితం అందుకుని చూశాడు. కళ్ళు చిట్లించి డిటెక్టివ్‌లతో అన్నాడు. "మిస్టీరియస్ ఎఫైర్! కాయితం నిండా 4 అంకెలు వేశాడు."

అపరాధ పరిశోధన పోటీ-140

[ఫలితాలు]

మార్చి '80 నెల "అపరాధ పరిశోధన పోటీ—140"కి సరియైన సమాధానాలు:

1. ఆఫ్ఘనిస్తాన్.
2. వెండి.
3. ఎన్నికల కొట్లాటలు.
4. సెంటిమెంట్.
5. మూర్ఖుడు.

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూన్ '80 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ బహుమతిగా పంపబడుతుంది.

(1) శ్రీమతి యర్రా అనూరాధ,
C/o శ్రీ చెన్నకేశవ స్టోర్స్,
నిడదవోలు—534 301.

(2) శ్రీ డి. శేషగిరిరావు, బి.ఎస్.సి.,
C/o టి.వి. సత్యవతి, వి.డి.ఓ. (డబ్ల్యు.)
పెద అమిరం—534 202,
భీమవరం—తాలూకా,
(ప. గో. జిల్లా.)

(3) శ్రీ కె.బి. పతి,
మోతక్‌పల్లి—పోస్ట్,
వయా—మదోల్,
గుల్బర్గా జిల్లా. (కర్ణాటక రాష్ట్రము)

లాల్ చటుక్కున కాయితం లాక్కుని చూశాడు. కాయితంనిండా వంకరటింకరగా వున్న '4' అంకెలు వున్నాయి.

ఆ కాయితం జాన్ గాభరాగా లాక్కున్నాడు.

"మిస్టర్ లాల్, ఇదీజ్ మెంటల్ కేస్" డాక్టర్ అన్నాడు లేస్తూ "నేను హాస్పిటల్‌కి వెళ్ళి అంబులెన్స్‌ని పంపిస్తాను. మీ రితన్ని డిస్టర్బ్ చెయ్యకండి."

లాల్ సాలోచనగా తలూపాడు. డాక్టర్ వెళ్ళిపోయాడు.

డాక్టర్ వెళ్ళిపోయాక జాన్ కంగారుగా అన్నాడు.

"లాల్! ఏమిటాలోచిస్తున్నావు? కోడ్ నెంబర్ ఫోర్!"

"ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్."

వినిపించాయి మాటలు. ఇద్దరూ ఉలికిపడి ఆ మనిషిని చూశారు. అతను లేవడానికి ప్రయత్నిస్తున్నాడు.

"హల్లో? ఏమిటి మీరన్నది?" జాన్ అడిగాడు ఆత్రుతగా.

"దిలీప్‌కుమార్....నా పేరు" అన్నాడా మనిషి. డిటెక్టివ్‌లు బెడ్‌మీద కూచొని అతను లేవకుండా ఆపారు.

"మిమ్మల్ని యెవరేం చేశారు?" లాల్ అడిగాడు.

అతని సమాధానం వేరుగా వుంది.

"నేను సి బి.ఐ. నుండి వచ్చాను."

"ఏజెంట్?" జాన్ అడిగాడు.

అతను తలూపాడు.

"గుర్తింపు వుందా?"

"నా వస్తువులన్నీ వాళ్ళు తీసుకున్నారు."

"వాళ్ళెవరు? మిమ్మల్నేం చేసారు?"

ఏజెంటు దిలీప్‌కుమార్ ఏదో చెప్పడానికి నోరు తెరిచాడు. మాట పెగల్లేదు. పెదవులు చప్పరించసాగాడు.

మీ తీర్పు ఏమిటి?

కేసు నెం. 20: ప్రతాప్ తన గుర్రాన్ని అమ్మకానికి పెట్టాడు. అయితే ఆ గుర్రంలో కొన్ని లోపాలు వున్నాయి. అందువలన అతడు పశువుల డాక్టరు సంతకాన్ని ఫోర్జరీచేసి, గుర్రం అన్ని విధాల సరియైనదే అని ఓ సర్టిఫికేట్ సృష్టించి, దానిని గుర్రపు శాల తలుపుకు అతికించాడు.

విక్రమ్ ఆ గుర్రాన్ని చూసి సంతృప్తి చెందాడు. తలుపుకున్న సర్టిఫికెట్ చూడనేలేదు. గుర్రాన్ని కొనుక్కొని తీసుకుపోయాడు. కాని కొద్దిరోజులకే మోసం గ్రహించి, గుర్రాన్ని తీసుకువచ్చి డబ్బు వాపసు ఇవ్వమన్నాడు. ప్రతాప్ అందుకు అంగీకరించలేదు.

విక్రమ్ కోర్టు కెక్కాడు.

న్యాయమూర్తిగా మీ తీర్పు ఏమిటి?

నిబంధనలు: మీ తీర్పును ఒక పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి, 7-5-'80 తేదీలోగా మాకు పంపండి. హోం. డె. సభ్యులు కానివారు తమ జవాబుతో 50 పైసలు పోస్టుస్టాంపులు జతపరచాలి. అత్యుత్తమమైన తీర్పుకు రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు జూలై '80 నెల సంచికలో చూడండి.

మార్చి '80 పోటీ ఫలితాలు

తీర్పు: అగ్రిమెంట్ చెల్లుతుంది.

ముస్లిమ్‌లలో మగవారు 4 వివాహాలు చేసుకోవచ్చును. అయితే నాలుగు వివాహాలూ చేసుకుని తీరాలని రూల్ లేదు. వారి అగ్రిమెంట్ వల్ల భవిష్యత్తులో చట్టప్రకారం చేసుకోవలసిన అవసరంలేని వివాహాలకు మాత్రమే ఆటంకం కలిగింది. కనుక మస్తాన్ వాదన చెల్లదు.

ఈ నెల న్యాయ నిర్ణేత: శ్రీ కె. చందర్ రావ్, 6-4-369/4, భోలక్‌పూర్, హైద్రాబాదు—500 003.

"మంచినీళ్ళు!" లాల్ అన్నాడు జాన్‌తో.

జాన్ రివ్వుమని లేచివెళ్ళి మంచినీళ్లు తీసుకొచ్చాడు.

దిలీప్ నీళ్లు తాగి తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు. డిటెక్టివ్‌లు పలకరించ లేదు. నిశ్శబ్దంగా కాచుకున్నారు.

కొన్ని క్షణాల తర్వాత అతను కళ్ళు మూసుకునే చెప్ప సాగాడు: "బొంబాయినుంచి ఈ ఆర్గనైజేషన్ వివరాలు దర్యాప్తు చెయ్యడానికి ఇక్కడికి వచ్చాను. రెండురోజులు క్రితం వాళ్ళు నన్ను పట్టుకున్నారు-డాన్వర్స్-వాళ్ళే నన్ను పట్టుకున్నారు. ఎక్కడ బంధించారో నాకు తెలియదు. నా మీద యేదో మందు ప్రయోగం జరిగింది. వాళ్లు నన్ను చంపదలచలేదు! మాట రాకుండా చేశారు. ఇప్పుడు.... ఇప్పుడు....నాకు మాట వస్తోంది."

కళ్ళు తెరిచి నవ్వాడతను.

"యస్, ఆ తర్వాత యేం జరిగింది?"

"ఆ తర్వాత—ఆ తర్వాత రాత్రి వాళ్లు యిల్లు విడిచి పారిపోయారు. ఈ మధ్యాహ్నం నేను తప్పించుకున్నాను. నా వొంట్లో బలం లేదు. మాట రావడంలేదు. ఎక్కడెక్కడో తిరిగాను, ఎక్కడెక్కడో పడుకున్నాను—ఎవరూ నన్ను పట్టించుకోలేదు... సాయంత్రానికి నా పరిస్థితి మెరుగుపడింది. తెలివిలోకొచ్చాను. మీరు జ్ఞాపకం వచ్చారు. అంతే! అంతే....ఇక్కడి కొచ్చేశాను."

"మిమ్మల్నెక్కడ బంధించారు?"

దిలీప్ కాస్సేపాలోచించి, "తెలియదు!" అన్నాడు.

"వాళ్ళని గుర్తుపట్టగలరా?"

అతను అడ్డంగా తలూపి, "డాన్వర్స్‌ని గుర్తిస్తాను." అన్నాడు.

డిటెక్టివ్‌లు నిట్టూర్చారు.

అపరాధ పరిశోధన పోటీ-142

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్లకాగితంపై వ్రాసి, దానితో 75 పైసలు విలువగల పోస్టలు స్టాంపులు జతపరిచి పంపండి. ఆల్ కరక్టుగా పంపినవారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ 75 పైసల పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికీ అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరుకూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ కూపనులు 7-5-'80 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు జూలై '80 నెల సంచికలో ప్రకటిస్తాము.

1. కొందరికి ఇదొక సరదా—?
(ఏడిపించటం, దొంగిలించటం.)

2. ఈ మధ్య కాలంలో అపూర్వ సంచలనం సృష్టించిన తెలుగు సినిమా—? (శంకరాభరణం, కార్తీకదీపం.)

3. అధికార దుర్వినియోగంలో ఈ శాఖ పెట్టింది పేరు—?
(పోలీసుశాఖ, విద్యాశాఖ.)

4. నేటి ప్రభుత్వం కొత్త స్లోగన్—?
(ఇంటికో దీపం, మనిషికో బర్రె.)

5. కపటం తెలియని వారు—?
(పసిపిల్లలు, మహనీయులు.)

"మంచిది. ఈ ఆర్గనైజేషన్ గురించి ఏమిటి?" లాల్ అడిగాడు.

"మీకు తెలియదా? నార్త్ ఇండియాలో ఎన్నో చట్ట వ్యతిరేక రహస్య కలాపాలు సాగిస్తోంది. సి. బి. ఐ. వాళ్ళని గాలిస్తోంది...." ఆగిపోయాడతను.

లాల్, జాన్‌వి చూసాడు; జాన్ ముఖం ఎర్రబడింది.

"ఇక్కడ జరిగిన అల్లర్లతో కూడా వాళ్ళకి సంబంధం వుంది!" మళ్ళీ అన్నాడు దిలీప్.

"వాళ్ళెవరు?" లాల్ అడిగాడు.

దిలీప్ భారంగా నిట్టూర్చి కళ్లు మూసుకున్నాడు. కాస్సేపటి తర్వాత పాఠం అప్పజెపుతున్నట్లు గబగబ చెప్పాడు:

"ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్: నలుగురు ఘరానా మనుషులతో ఏర్పడ్డ రహస్య ముఠా. నెంబర్‌వన్—గజానంద్ భాటియా. అస్సామీ. అతనే ఈ ఆర్గనైజేషన్‌కి హెడ్. ఆర్డర్స్ అన్నీ అతనే జారీ చేస్తాడు. నెంబర్ టూ—పేరు తెలియదు. బొంబాయికి చెందిన పారిశ్రామికవేత్త. ఆర్గనైజేషన్‌కి ధన సహాయం చెయ్యడం అతని వంతు. బాణం గుర్తుని కోడ్‌గా వాడుతుంటాడు. నెంబర్ త్రీ—ఒక కన్నెడ స్త్రీ. ఆమె గురించి వివరాలేమీ తెలియవు. నెంబర్ ఫోర్—"

"నెంబర్ ఫోర్?" లాల్ అడిగాడు చటుక్కున.

దిలీప్ ముఖం ఎర్రబడింది. చిన్నగా కళ్ళు తెరిచి చూశాడు.

ఆ తర్వాత వణుకుతున్న స్వరంతో నెమ్మదిగా గొణిగాడు:

"నెంబర్ ఫోర్.... మాస్టర్ కిల్లర్!"

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, నెల నెలా పత్రిక మరియు సప్లిమెంట్ రెండూ కలిపి అసలు ధరకే రు. 8-00 లకు మా ఏజెంట్ ద్వారాగాని, వి. పి. ద్వారాగాని మీ ఇంటిదగ్గర అందజేయబడతాయి. ఇందుకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. పైకం మనియార్డరుద్వారాగాని, పోస్టలు స్టాంపులుగాని పంపవచ్చును. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము కార్డు అందుతుంది.

3. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు నెల నెలా గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. మీ ఇంటిదగ్గరనే డబ్బు చెల్లించి కాపీలు పొందవచ్చును. కాపీలకోసం మీరు ఏజెంట్ చుట్టూ తిరుగనవసరంలేదు. కాపీలు దొరకలేదనే నిరాశ, పోస్టులో పోయే సమస్య, ఎంతమాత్రం వుండదు. పైగా సభ్యులు పోటీలలో ఫ్రీగా పాల్గొనవచ్చును.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, వాటి పైకం రు. 8/-లు వెంటనే M. O. చేయాలి. కాపీలు తిరిగి 'రికార్డెడ్ డెలివరీ'లో పంపుతాము. లేదా మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా కాపీలు ఖచ్చితంగా అందజేయబడతాయి. మీ చిరునామా మారినప్పుడల్లా తగినంత ముందుగా మాకు తెలియజేయండి.

6. పాతకాపీలు కావలసిన వారికి వాటి అసలు ధరకే వి. పి. ద్వారా పంపగలము. ఎక్కువ కాపీలు తీసుకునేవారికి కొంత కన్సెషన్ కూడ లభిస్తుంది.

7. నెల నెలా వి. పి. తీసుకోవటం కష్టమనుకునేవారు, ఏడాది పైకము రు. 90/-లు ముందుగా పంపవచ్చును దీనివల్ల మీకు ఖర్చులు కొంత తగ్గుతాయి

నేడే మీరూ 'హోమ్ డెలివరీ' లో చేరండి!

అతని కళ్ళు మూతపడ్డాయి. మరుక్షణం స్పృహ తప్పాడు.

53

లాల్ నిట్టూర్చి అన్నాడు; "అజ్ఞాతంగా వున్న శత్రువులిప్పుడు బయటపడ్డారు. మిస్టర్ దిలీప్ పరిస్థితి సీరియస్‌గా వుంది. శత్రువులతనికి విచిత్రమైన ట్రీట్‌మెంటు ఇచ్చారు"

ఇద్దరూ బయటికి వచ్చి బెడ్‌రూం తలుపు మూశారు.

"ఫోర్ ఏసెస్ ఆర్గనైజేషన్" జాన్ అన్నాడు, "ఎక్కడా ఈ పేరు విన్లేదు. లాల్, ఈ ఆర్గనైజేషన్ ఇక్కడ పని చేస్తోందా?"

లాల్ తలూపాడు, "రహస్యంగా. గజానంద్ భాటియా అస్సామీ! వెల్, సందేహంలేదు. మన శత్రువులు వీళ్ళే!"

"కానీ—దిలీప్‌ని వదిలి ఎందుకు పారిపోయారో అర్థం గావడంలేదు!"

"ఒక్కటే ఎక్స్‌ప్లనేషన్ వుంది: డాన్సర్స్ తనని బంధించారని దిలీప్ అన్నాడు. బంధించినచోట ఎవరూ కాపలా లేరనుకుంటాను. మనల్ని చంపడానికి ప్రయత్నించి చాలామంది అస్సామీ శత్రువులు చనిపోయారు. డాన్సర్స్ కూడా చనిపోయారు—కానీ, వీళ్ళంతా పారిపోయారని దిలీప్ అనుకుంటున్నాడు. వాస్తవానికి అక్కడ కాపలా ఎవరూ లేరు!"

"అతన్నెక్కడ బంధించారో దిలీప్‌కి తెలియదు." జాన్ అన్నాడు, "కాబట్టి మనమూ తెలుసుకోలేం. అయితే అతన్ని చంపేయకుండా మాటరాకుండా ఎందుకు చేశారు?"

"అది తాత్కాలిక చర్య. బహుశ మిస్టర్ భాటియా ఆర్డర్‌కోసం ఎదురుచూస్తూ అలాటి చర్య తీసుకున్నారనుకుంటాను."

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

(బహుమతి రు. 50/-లు నగదు)

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని ఓ పోస్టుకార్డు సైజు తెల్ల కాగితంపై వ్రాసి 7—5—'80 తేదీ లోపల మాకు చేరేటట్లు పంపండి.

ఇదేవిధంగా "సప్లిమెంట్" ముఖచిత్రాలకు కూడా మీ వ్యాఖ్యలు పంపవచ్చును. రెండు పత్రికల వ్యాఖ్యలు వేరువేరు తెల్లకాగితాలపై వ్రాసి పంపాలి. హోం.డె. సభ్యులు కానివారు తమ వ్యాఖ్యలతో 50 పైసల స్టాంపులు జతపర్చాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఒక్కొక్కరికి రు. 25/-లు బహుమతి పంపుతాము. ఫలితాలు జూలై '80 నెల సంచికలో చూడండి. *

మార్చి '80 పోటీ ఫలితాలు

(1) మార్చి '80 నెల "అపరాధ పరిశోధన" ముఖ చిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

కడలిలో కల్లోలం!
కాలిలో నిక్షిప్తం!!

పంపినవారు: శ్రీ ముద్దా రమేష్, అరోరా ట్రేడర్స్, 1—116 A, మెయిన్‌రోడ్, కానూరు—534 329.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఇది రాకెట్ యుగం!
మరి లేదిక క్షేమం!!

పంపినవారు: శ్రీమతి వైజయంతి, బి.ఎస్.సి., చెల్వమాంబ అగ్రహారం, మైసూరు. (కర్ణాటక స్టేట్.)

పై విజేతలు ఇరువురికి చెరొక రు. 25/-లు చొప్పున బహుమతి పంపబడుతుంది.

"అప్పుడు—ఇప్పుడు భాటియా ఎక్కడ వున్నాడు?"

"ఇంకా సిటీలో ప్రవేశించలేదు ఎక్కడో కూచొని తీగలు లాగుతున్నాడు—మీటలు నొక్కుతున్నాడు."

"అయితే దిలీప్‌కి యెప్పటికీ ప్రమాదమే!" అన్నాడు జాన్.

"అవును. అతని రక్షణ గురించి ఆలోచిద్దాం."

బయట మోటారు శబ్దం అయింది. ఇద్దరూ బయటి కొచ్చి చూసారు. అంబులెన్స్ ఆగివుంది.

"లాల్, పోలీసులకి ఫోన్ చెయ్యడం మంచిదేమో?"

"అవును. హాస్పిటల్‌లో దిలీప్‌ని గార్డ్ చెయ్యాలి. నువ్వు కృష్ణన్‌కి ఫోన్‌చేసి వెంటనే ఇక్కడికి రమ్మను!"

జాన్ కదిలాడు.

ఇంతలో స్ట్రెచర్‌తో నలుగురు మనుషులు వచ్చారు. లాల్ బెడ్‌రూం తలుపు తీసి వాళ్ళని లోనికి తీసికెళ్ళాడు. లోపల ప్రశాంతంగా వుంది. ఎంత ప్రశాంతంగా వుందంటే దిలీప్‌కుమార్ వూపిరి విన్పించడం లేదు.

దిలీప్‌కుమార్ శ్వాస ఆగిందని దూరంనుంచే గ్రహించిన లాల్, ఒక్క దూకులో బెడ్ చేరుకున్నాడు. దిలీప్ నిర్జీవంగా కళ్ళు మూసుకుని వున్నాడు.

జాన్ లోనికి ప్రవేశించి తికమకగా చూశాడు లాల్‌ని.

"చనిపోయాడు."అన్నాడు లాల్ ఎర్రబడ్డ ముఖంతో.

అంబులెన్స్ సిబ్బంది మొహాలు చూసుకున్నారు.

"ఎలా!" జాన్ అర్చాడు.

"అతని నోటిదగ్గర చూడు, ఏదో ద్రవం వుంది.... నైట్రిక్ ఆసిడ్, సల్ఫ్యూరికాసిడ్, హైడ్రోసైనిక్ ఆసిడ్.. ఏదేనా కావచ్చు."

కొంపలు కొరివి?

(పాఠకుల పరిశోధన పోటీ-94 ఫలితాలు)

హంతకుడు—గోవిందరావు.

శవాన్ని పరిశీలించి చూస్తే క్లోరోఫాంతో స్పృహ తప్పాక ఏదో తలగడతో అదిమి చంపినట్టు అర్థమవుతోంది. ఆత్మ హత్యగా నిరూపించడానికే శవం పొత్తి కడుపులో కత్తి గుచ్చి వుంచారు. అందువలన రక్తస్రావం పెద్దగా ఏర్పడలేదు. లోపల గదిలో ప్రాణం పోయాక శవాన్ని వాకిట్లో అరటిమొక్క వద్దకు చేర్చారు.

క్లోరోఫాం సంపాదించడమూ, శవాన్ని మోసుకురావడమూ రాజమ్మకి సాధ్యంకాదు. అందుకే గోవిందరావు ఆ హత్య చేసినట్టుగా డిటెక్టివ్ శిరీష్ గుర్తించాడు. పైగా కేసులో 'ఆత్మ హత్య' పదం గోవిందరావే మొదట వాడి కేసును తప్పుదోవ పట్టించాలని ప్రయత్నించాడు.

—ఈ కేసును అత్యుత్తమంగా పరిశోధించిన యీ క్రింద ఇద్దరు పాఠకులకు చెరొక పాతిక రూపాయలు బహుమతిగా పంపుతున్నాము.

(1) శ్రీ సాగి కృష్ణంరాజు, క్లర్కు,
ఎస్.డి.ఒ.టి. ఆఫీసు,
వుడ్ పేట,
అనకాపల్లి—531 001,
(విశాఖపట్టణం జిల్లా.)

(3) శ్రీమతి యం. సత్యవతిదేవి,
C/o వి. శ్రీరామమూర్తి,
దంతిపల్లి,
అరవల్లి—పోస్టు,
(ప. గో. జిల్లా.)

"ఓహ్ గాడ్! ఎవరొచ్చారిక్కడికి!"

లాల్ కిటికీ చూపించాడు, "కిటికీ తెరిచివుంది, హంతకుడు అక్కడినుంచి వచ్చాడు."

"కిటికీ ఎలా తెరిచాడు?"

"మూసివుందా?"

"మనం బయటికెళ్ళినప్పుడు మూసి వుంది."

"గడియపెట్టి వుందా?"

జాన్ ఆలోచించాడు. "ఏమో.... చెప్పలేను!"

"అయితే గడియ తీసి వుండాలి. హంతకుడు సులభంగా ప్రవేశించాడు."

"ఎంత ధైర్యం! యెవరా హంతకుడు?"

బయట కారాగిన శబ్దమైంది. డిటెక్టివ్‌లు నిశ్శబ్దంగా వుండిపోయారు. కొన్ని క్షణాల్లో కృష్ణన్ గాభరాగా ప్రవేశించాడు, "వాట్ హేపెండ్? ఏం జరిగింది?"

"మర్డర్" లాల్ అన్నాడు.

"మళ్ళీ మర్డరా!"

లాల్ తలూపాడు శవాన్ని చూపిస్తూ.

"ఇక్కడెలా జరిగింది? ఎవరితను?"

లాల్ దిలీప్‌కుమార్ గురించి వివరించాడు. కృష్ణన్ ఆశ్చర్యంగా విని, "మీరు ఇంట్లో వుండగా హత్య జరగడమేమిటి!" అన్నాడు.

(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-534 Narayanaguda Hyderabad-500 029,
and Printed at Kranti Press,
Madras-600001.

Blank Page


Regd. no: H/HD-48